నవశక్తి

Vol. 2, no. 7

(Jan. 25, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 7

(Jan. 25, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

స్వాతంత్ర్య దినోత్సవం


Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

సంపుటం 2 | బుధవారం 25-1-39 బెజవాడ | సంచిక 7



కమ్యూనిస్టు (పట్టాభితో):—"తాతా! స్వాతంత్ర్యానికి మార్గమిది కాదు. అల్లదిగో! ప్రజలంతా అటున్నారు!"

24 పేజీలు ⁂ ఒక అణా

సంపుటం 2
సంచిక 7

నవశక్తి

బుధవారం
25-1-39

రాష్ట్రపతి పదవికి

సుభాస్ బోసునే తిరిగి ఎన్నుకోవాలి!

ఈ సంవత్సరం, అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష స్థానానికి రెండు అభ్యర్థిత్వాలున్నాయి. (1) సుభాస్ చంద్ర బోస్ (2) డా॥ పట్టాభి.

ప్రస్తుతం దేశంలోని రాజకీయ పరిస్థితుల ననుసరించి ఆ స్థానానికి ఎవరు ఎక్కువ సమర్థులో నిర్ణయించ వలసిన బాధ్యత ప్రజలమీద, వారిచే త్రిపురి కాంగ్రెసుకు డెలిగేట్లుగా ఎన్నుకోబడినవారిమీద ఉంది.

ఈ విషయాన్ని చర్చించే ముందు, వ్యక్తుల యెడల మనం చూపే గౌరవ మర్యాదలు, లాంఛనాలు తీసి అవతల పెట్టాలి. ఎందుకంటారా, ఇది బోసు, పట్టాభి అనే యిరువురు వ్యక్తులకు సంబంధించిన సమస్య కాదు. మనవారు కొందరనుకుంటున్నట్లు ఆంధ్ర, బెంగాలీ సమస్య అంతకన్నా కాదు. ఇది యావద్భారత సమస్య: ఫెడరేషన్ పెనుభూత నాశన సమస్య; సామ్రాజ్య వ్యతిరేక శక్తుల ఐక్యతా సమస్య: ఒక్క మాటలో చెప్పాలంటే సత్వర సంపూర్ణ స్వాతంత్ర్య సమార్జనా సమస్య!

దేశంలో అభివృద్ధి పొందుతూ వస్తూన్న సామ్రాజ్య వ్యతిరేక పోరాటమిప్పుడు కొత్త భావాలకు, సమస్యలకు, కార్యక్రమానికి తావు నిచ్చింది. అందుచేత ఇట్టి ఎన్నికలు, స్పష్టమైన సమస్యలమీద, స్పష్టమైన కార్యక్రమాల మీద జరగాలంటాము. ఈ పోటీ, మనల నెదుర్కొంటూన్న సమస్యలను విస్పష్టం గావించేటందుకు ఉపయోగ పడా లంటాము. అంతేకాదు, ఇట్టి విషయాలపై ప్రజాభిప్రాయం ఎప్పటికప్పుడు ప్రకటితం కావాలంటాము కూడా.

త్రిపురి కాంగ్రెసును అత్యవసరంగా ఎదుర్కొంటూన్న సమస్యలు రెండు.

(1) ఫెడరేషన్ విషయమై దేశాన్ని పోరాటానికి తయారు చెయ్యాలి. రాజీ ప్రయత్నాలు వదలిపెట్టి నిర్దిష్టమైన కార్యక్రమంతో ప్రజా పోరాటాన్ని ముందుకు తీసుకుపోవాలి.

(2) ఇందుకు ముఖ్యంగా దేశంలోని సామ్రాజ్య వ్యతిరేక శక్తు లన్నిటిని (సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కిసాన్ సభ, ట్రేడు యూనియన్ కాంగ్రెసు) కాంగ్రెసుతో సమీకరణ మొనర్చాలి

బోస్, ఈ రెండు పనులు చక్కడా నెరవేర్చగలడు. తాను అధ్యక్షుడై నప్పటినుండి ఫెడరేషను పట్ల అత డవలంబించుతూన్న విధానం, మొన్నటి బార్డోలీ వర్కింగు కమిటీలో అతివాదుల యెడల అతని దృక్పథం, ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. తరువాత, ఈఅధ్యక్షపదవినిగురించి మొన్న అతడిచ్చిన స్టేట్‌మెంట్ వీటిని మరింత బల పరుస్తోంది.

అయితే, మన పట్టాభి గారి సంగతి ఏమిటని అడగవచ్చు. రాక రాక ఆంధ్రుల కీ స్థానం వస్తూంటే వల దనడం భావ్యం కాదనే వాదన తప్పితే వేరేమీ లేదంటాము. ఆ వాదన మన ఆంధ్రత్వాన్ని వెల్లడి చేయవచ్చునుగాని ఆ స్థానానికి పట్టాభి గారి సామర్థ్యాన్ని రుజువుపర్చజాలదు. స్పష్టంగా పట్టాభిగారా పదవిని నిర్వహించలేరని చెబుతాము. ఎందుకంటే, గడచిన సంవత్సరం సంస్థాన సంఘాధ్యక్షులుగా వుండి కూడా, ప్రతి సంస్థానంలోను బయలుదేరిన స్వాతంత్ర్యోద్యమాన్ని నడపలేకపోయారు. వారికి ఒక కార్యక్రమం సూచించలేకపోయారు. ఆఖరికి, వల్లభాయి జమ్నాలాల్ మొదలయినవారు సంస్థాన పోరాటాలకు నాయకత్వం వహించ గలిగినారు గాని మన పట్టాభి బాధ్యత గల స్థానంలో వుండి కూడా, ఆ పోరాటాల యెడల తన దృక్పథ మిట్టిదని యైన ప్రకటించలేకపోయారు. స్వతంత్రింగా ముందంజ వేయలేని ఈయన ఫెడరేషనుపై ఇంత తర్జన భర్జన జరిగే రోజుల్లో తన అభిప్రాయం దేశానికి తెలియజేయలేని యీయన అఖిల భారత కాంగ్రెసు మహాసభ కధ్యక్షత వహించి ఇంతకంటె ఎక్కువ చేయగలడని ఎట్లు ఆశించగలము?

రెండవది అతివాద శక్తులతో ఐక్యత. ఇది పట్టాభిగారి స్వభావంలో ఎక్కడా కనబడదు. వరుసగా రెండేండ్లు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా వున్నా, ఆత్మగౌరవం అంటే వున్న పట్టుదలలో పదవ వంతు కూడ స్వాతంత్ర్య పోరాటంలో ప్రదర్శింప లేకపోయారు. తమ్ము 'తూలనాడినా'రనే వంకతో, దేశ సేవయే పరమావధిగా పెట్టుకున్న కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణ ప్రభృతులను కాంగ్రెసునుండి వెలిబెట్టినారు. చెప్పుడు మాటలు విని 'హింసావాదినని తానే ఒప్పుకుంటున్నా'డని అబద్ధాలు కల్పించి, కామ్రేడ్ సుందరయ్య నామినేషను త్రోసివేసినారు; పశ్చిమ కృష్ణా జిల్లాలో, అతివాదుల చేతిలోనుండి కాంగ్రెసు సంఘాన్ని ఊడగొట్టాలని, తన "ఆజ్ఞలు ఉల్లంఘించా" రని వారు చేర్పించిన 35 వేల కాంగ్రెసు సభ్యత్వాన్ని రద్దుపరిచారు; ప్రెసిడెంటు కార్యదర్శులను కాంగ్రెసునుండి వెలి వేసినారు. పోనీ, రైతుల విషయంలో నయినా ఈరాష్ట్రాధ్యక్షులు చేసిన దేమిటి? కాశీపట్నం విషయంలో గాంధిగారివద్ద పోలీసు రిపోర్టులు వల్లించి, ఆ రైతుల నోట్లో దుమ్ము కొట్టినారు. ఒక రాష్ట్రంలో పట్టుమని మునగాలకు ప్రచారకులను ఎందుకు పంపినారో సంజాయిషీ చెప్ప మంటూ ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంవారికి హుకుం జారీ చేయించారు. పదిమంది అతివాదులతోను, రైతులతోను సఖ్యతతో మెలగలేని పట్టాభిగారు యావద్భారత సఖ్యత సమకూర్చి స్వాతంత్ర్య పోరాటాన్ని నడపగలరని ఎట్లు విశ్వసించడం?

అందుచేత ఇప్పుడు మనకు కావలసింది తెరమీద బొమ్మ నాయకత్వంకాదు. దేశంలో ఫెడరేషన్ అమలుజరగకుండా చూడడం; నూతన రాజ్యాంగ విధానం భగ్నచేయడం; సంస్థానాలలో బాధ్యతాయుత ప్రభుత్వాలు నెలకొల్పడం; వీటి కన్నిటికి ముఖ్యమగు జాతీయైక్య సంఘటన; ఇవన్నీ సమకూరాలంటే సుభాస్ చంద్ర బోసునే మరలఅధ్యక్షునిగా ఎన్నుకోవాలని హెచ్చెరిస్తున్నాం.

వ్యాసకర్తలకు మనవి.

1. వ్యాసాలను పంపువారు కాగితానికి ఒకవైపునే విడిగా వ్రాసి పంపాలి.
2. ప్రకటింపబడని వ్యాసాలు తపాల బిళ్ళలు పంపనిదే తిరిగి పంపబడవు.
3. కొందరు "ప్రెస్ మేటరు" అని బుక్‌పోస్టులో పంపుతూ దానిలోనే ఉత్తరాలు వ్రాయుటచే, పోస్టేజీ ఇచట అదనంగా వసూలు చేస్తున్నారు. వ్యాసంతోపాటు ఎడిటరును మానేజరును సంబోధించి ఏమీ వ్రాయకూడ దని గమనించాలి.

—సంపాదకుడు.



25—1—39 బుధవారం

జనవరి 26 వ తేది స్వాతంత్ర్య దినోత్సవం

1930 జనవరి 1 వ తేదీ ఉదయం లాహోరు కాంగ్రెసు మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని అంగీకరించింది. తొమ్మిదేండ్ల నాడు, జనవరి 26 వ తేదీ యావద్భారత దేశమూ సంపూర్ణ స్వాతంత్ర్య ప్రమాణాన్ని స్వీకరించింది.

నాటి నుండి భారతీయులు సంకెళ్ళ నుండి విముక్తి పొందడానికి, ప్రజా సామాన్య కష్టాన్ని దోచుకొంటున్న బ్రిటిషు సామ్రాజ్యాన్ని నాశనం గావించడానికి పోరాటాలు సాగించారు: సాగించుతున్నారు. బ్రిటిషు ప్రభుత్వం మన పోరాటాన్ని జైళ్ళు, లాఠీచార్జీలు, కాల్పులు, ఉరి శిక్షలతో ఎదుర్కొంది. జయించానని సంతసించింది.

కాని యీ పోరాటాలలో గడించిన అనుభవముతో, యినుమడించిన ఉత్సాహముతో, భారత ప్రజలు కాంగ్రెసు మహా సంస్థ నాయకత్వాన, తమ ఆశయమైన సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని జేరుటకు కృత నిశ్చయులై వున్నారు. 8 రాష్ట్రాల లో కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పడి పని చేస్తున్నాయి. కర్షకులలో చైతన్యము వృద్ధి పొందింది. జమీందారీ విధానాన్ని, వారికి తోడ్పడు బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని నాశనము గావించుటకు, అఖిల భారత కిసాన్ సభ నాయకత్వాన తమ హక్కులకొరకు పోరాడుతున్నారు. అగ్రగాములుగా వుండి స్వాతంత్ర్య పోరాటము కొనసాగించడానికి సిద్ధముగా వున్నారు. ఇంతకు పూర్వము నిద్రాణులయి వున్న సంస్థాన ప్రజలు మేల్కొని బాధ్యతాయుత ప్రభుత్వము కొరకు పోరాటము సాగించుతున్నారు.

బ్రిటీషు సామ్రాజ్యం నేడు అంతర్జాతీయ క్లిష్టపరిస్థితుల్లో చిక్కుకొని ఉంది. యూరపులో ఇటాలియన్, జర్మన్ ఫాసిస్టులకు లొంగుతూ, తన సామ్రాజ్యమును కట్టుదిట్టము చేసికొంటూంది. పాలస్టైయిన్ స్వాతంత్ర్య పోరాటాన్ని బాంబులు, విష వాయువులతో ఎదుర్కొంటూంది. ఇండియాలో సైన్యంలో చేరరాదను ప్రచారాన్ని నిషేధించు శాసనాన్ని గావించింది. ఫెడరేషను భారతీయు లందరి అభిప్రాయాన్ని ధిక్కరించి ఆచరణలో పెట్ట జూస్తూంది. భారత దేశములోనే యుద్ధ సామగ్రి చేయు ఫ్యాక్టరీలను నిర్మించి, సామ్రాజ్య రక్షణకు ఇండియాను కేంద్రముగా చేసుకోవాలని ప్రయత్నిస్తూంది.

కృంగిపోతున్న వర్తకము, పరిశ్రమలు, వలస దేశాలలోని విప్లవోద్యమము, బ్రిటను కార్మికులలో వృద్ధి పొందుచున్న చైతన్యము, వల్ల బ్రిటీషు సామ్రాజ్యము నేడు తన అంతిమ దశలో వుంది. మన స్వాతంత్ర్య పోరాటాన్ని కొనసాగించడానికి ఇది మంచి సమయం. ఈ అవకాశము జారవిడచిన ఇట్టి అనుకూల పరిస్థితులు మరల ఎన్నటికో?

ఫెడరేషను ఎదిరించుతామని కూర్చుంటే లాభములేదు. నూతన రాజ్యాంగ విధానాన్నే నాశనము గావించడానికి సర్వ సన్నాహాలు చెయ్యాలి. అందులకు ప్రధానమైన జాతీయైక్యతను వృద్ధి పొందించాలి. బ్రిటీషు యిండియా ప్రజలు, సంస్థాన ప్రజలు అంతా కలసి బ్రిటీషు సామ్రాజ్యానికి, సంస్థానాధీశుల నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా కాంగ్రెసు మహాసభా నాయకత్వాన పోరాడాలి. భారత ప్రజా స్వామిక ప్రభుత్వాన్ని స్థాపించడానికి దీక్ష బూనాలి. ఈ తొమ్మిదవ స్వాతంత్ర్య దినోత్సవము నాడు మన గమ్య[illegible] సంవత్సరములోనే చేరడానికి [illegible]లి. మన నినాదాలు

ఫెడరేష[illegible]

బానిస ర[illegible]

ప్రజా ప్ర[illegible]

ఈ మన ఆశయ[illegible] సులో తావులేకుండా చెం[illegible] కరించ వచ్చుననే వారి[illegible] స్వాతంత్ర్య పోరాటానికి[illegible] అలంకరించాలి. అట్టి కా[illegible] పెట్టబోతున్నాడు. గాన[illegible]

సంపూర్ణ స్వాత[illegible] ఐక్యత ఎంతేని అవసర[illegible] అంతా కలసి పోరాటాన్ని[illegible] భుజం భుజం కలపి పని[illegible] కూర్చగలవారే నేడు కాం[illegible] సమర్థుడు.

ఈ మధ్య, మం[illegible] తత్వం, కాంస్టిట్యూషన[illegible] గమ్యస్థానం మరుగునబ[illegible] చున్నారు. శ్రీమాన్ సత[illegible] నుండి సత్యమూర్తికి అ[illegible] మెంబేరియస్లు కాంగ్రె[illegible] జబర్దారీ చేయుటకు [illegible] వలెను.

రేపు 26 వ తేదీ సంపూర్ణ స్వాతంత్ర్య దినోత్సవము[illegible] కొరకు వేలకొలది స్త్రీ పురుషులు జైళ్ళకేగిరో, వందలకొలది ప్రాణాలు గోల్పోయిరో అట్టి భారత ప్రజా స్వామికమును స్థాపించుటకు దీక్ష బూనుదాము.

బ్రిటీషు సామ్రాజ్య పునాదులు క్రుంగిపోవుచున్న యీ సమయములోనే మన అంతిమ పోరాటము సాగించాలి. యావద్భారత ప్రజాసామాన్యంలో చైతన్యజ్వాలలు చెలరేగుచున్న యీ సమయములో మన నినాదం "పదండి ముందుకు పోదాం!"

మన ప్రతిజ్ఞ, "ఈ సంవత్సరంలోనే భారత ప్రజాస్వామికం స్థాపించుదాం" అని!

జై! స్వతంత్ర భారత దేశానికి జై!!



పట్టాభిగారి పట్టుదల—వైస్రాయి-ఫెడరేషన్—తెలుగు పుస్తకాల మీద నిషేధం—ఒరిస్సాలో క్లిష్ట స్థితి—మలబార్ రైతులు—కాంగ్రెసేతర రాష్ట్రాలలో—బలే బీహార్

పట్టాభిగారి పట్టుదల

పశ్చిమ కృష్ణా జిల్లా కాంగ్రెసు కమిటీ యొక్క 91 మంది సభ్యులలో 50 మంది రాజీనామా లిచ్చియుండగా, రాష్ట్ర కమిటీ వారు ఆ రాజీనామాల విషయం ఆలోచించనే ఆలోచించక, ఈ నెల 19 వ తేదీని బెజవాడలో కొత్త జిల్లా కాంగ్రెసు కార్య నిర్వాహక వర్గమునకు ఎన్నికలు జరుపవలసిందని ఒక ఇనస్పెక్టరును పంపడం, ఆ విధంగా కొత్త ఎన్నికలు ఆ రోజునే జరగడం, ఎట్టి ప్రజాతంత్ర విధానమో తెలియకుండా ఉంది. మరుచటి దినం బార్డోలీ నుండి దిగిన డాక్టరు పట్టాభి గారితో పేట బాపయ్య గారు, సభ్యత్వము నుండి తొలగింపబడిన 35,372 కాంగ్రెసు సభ్యుల విషయం ఏమిటని అడగ్గా, సుభాష్‌బోసు పేర బ్యాంకులో కట్టిన 4,000 రూపాయలు తన కిప్పించవలసిన దని జాబు వ్రాస్తే అప్పుడు ఆ 35,372 మంది విషయం ఆలోచించబడుతుందని పట్టాభి గారు జవాబు చెప్పారు.

అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవికి పోటీ చేసే డాక్టరు పట్టాభి గారికి ఇంత దురభిమానం, ఇంత మొండి పట్టుదల తగదు. బందరు—బార్డోలీల మధ్య తిరిగేకంటె, జిల్లా యందలి గ్రామాలకు వెళ్ళి చూస్తే వీరి యెడల ప్రజల ధోరణి ఏవిధంగా ఉన్నదో బోధపడుతుంది.

వైస్రాయి ఫెడరేషన్

ఫెడరేషన్ సాధ్యమైనంత త్వరలోనే ప్రవేశ పెట్టబడుతుందని వైస్రాయి బొంబాయి ఓరియంట్ క్లబ్బులో ఉపన్యసిస్తూ పలికాడు. అది ప్రవేశపెట్టబడునపుడు మనం ఏమి చేయాలో కాంగ్రెసు పెద్దలు యింకా నిర్ణయించలేదు. సత్యమూర్తి మాత్రం తన పంథాను మార్చుకోవటంలేదు. కొన్ని సవరణలతో ఫెడరేషన్‌ను అంగీకరించ వచ్చునని మధుర జిల్లా రాజకీయ మహాసభలో ఉపన్యసించాడు. ఈ ధోరణిని కట్టిపెట్టవలసిందని వార్నింగ్ యిస్తూ ఉత్తరము వ్రాశాడు, కాంగ్రెసు అధ్యక్షుడు బోసు. దీన్ని సత్యమూర్తి అనుసరిస్తాడో, ఉల్లంఘిస్తాడో చూడవలసి యుంది.

విద్యార్థులు-స్వాతంత్ర్య దినోత్సవం.

రేపు 26 వ తేదీ స్వాతంత్ర్యదినోత్సవం, ఆనాడు దేశంలో ఉన్న విద్యార్థు లందరూ స్కూళ్లు—కాలేజీలు మానివేసి, సభలు, ఊరేగింపులు జరపవలసిందని అ॥ భా॥ విద్యార్థి సంఘం వారు తీర్మానించారు. లక్నో యూనివర్సిటీవారు ఆరోజు సెలవు దినంగా ప్రకటించారు. మదరాసు రాజధానిలో కూడా సెలవు ప్రకటించమని కోరుటకు వార్కి (విద్యాశాఖమంత్రి)గారి వద్దకు మదరాసు విద్యార్థుల సంస్థ తరపున రాయబారంవెళ్ళగా వీల్లేదని జవాబిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం ఉల్లాసంతో కాలం గడపడానికి కాదంటూ తమిళనాడు రాష్ట్ర కాంగ్రెసుఅధ్యక్షుడు మంత్రిగారిని సమర్థించాడు.

కాని, స్వాతంత్ర్య దినోత్సవం నాడు విద్యార్థులు గాని—మరెవరుగాని, నిర్వర్తించవలసిన ఒక నిర్ణీత కార్యక్రమం ఉంటుంది. స్కూళ్ళలోనూ, కాలేజీల లోను కాలం గడిపితే, ఏ విధంగా దానిలో పాల్గొన గలరు? ఈ స్వల్ప విషయం వీరు ఉభయులూ గ్రహించక పోవడం విచారకరం. సెలవు ప్రకటించినా, ప్రకటించకపోయినా ఆరోజున విద్యార్థులందరూ స్కూళ్లు-కాలేజీలు మానివేసి, స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని తీరాలి.

బలే బీహార్

శాసనోల్లంఘ నోద్యమ సమయంలో బీహార్ ప్రభుత్వంచే అమలు జరుపబడిన పబ్లిక్ సెక్యూరిటీ చట్టాన్ని కాంగ్రెసు మంత్రివర్గము మొన్న యీ మధ్యనే రద్దుచేస్తూ తీర్మానించింది. దాని స్థానే, ప్రభుత్వోద్యోగులకు అసాధారణ అధికారాల నిచ్చే మరొక బిల్లు 'రౌడీల నిరోధపు చట్టము' అనే పేరుతో—ప్రవేశపెట్టడానికి తలపెట్టింటి. కాని, అది ప్రజల పౌరసత్వపు హక్కులకు భంగకరమని రాష్ట్ర మంతటా బయల్దేరిన ఆందోళనకు ఫలితముగా ప్రభుత్వము విరమించుకొన్నది.

కాంగ్రెసేతర రాష్ట్రాలలో

బెంగాల్‌లో రాణీగంజ్ పేపరుమిల్లు సమ్మె సందర్భంలో, అసన్సాల్ కాంగ్రెసు కమిటీ కార్యదర్శిని—మరొక 7 గురు సమ్మెదారులనూ, పోలీసులు ఎరస్టు చేశారు. కలకత్తాలో, "బసుమతి", "యుగాంతర్" అనే పత్రికల కార్యాలయాలను రాజద్రోహ నేరం క్రింద వారంట్లు తీసుకొచ్చి సోదా చేశారు. పంజాబ్ ప్రభుత్వం "కీర్తి లహార్" అనే పత్రిక యొక్క జనవరి 1 వ తేదీ సంచికను నిషేధించింది. కాంగ్రెసు వాదులను పోలీసులు వెంబడించడాన్ని సమర్థిస్తూ సింధు ప్రధాని జవాబిచ్చాడు.

ప్రజల పౌరసత్వ హక్కులకు యీవిధంగా భంగపరుస్తున్న బెంగాల్—పంజాబ్—సింధు ప్రభుత్వాలను ఖండించవలసి యున్నది.

తెలుగు పుస్తకాల మీద నిషేధం

నిర్బంధ విధానాన్ని మన కాంగ్రెసు మంత్రులే సమర్థిస్తూ శాసన సభలలో మాట్లాడటం గర్హ్యనీయం. ఈ నెల 16 వ తేదీని జరిగిన మదరాసు ఎసంబ్లీ సమావేశంలో శ్రీ కొత్తగడ్డ నారాయణరావుగా రడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ, రాజాజీ "1905 రష్యా విప్లవం," "మన్యం రైతుల తిరుగుబాటు" మొదలయిన తెలుగు పుస్తకాలమీద నిషేధాలు తొలగించడం విషయంలో తిరిగి ఆలోచించబడదని చెప్పాడు, "1905 రష్యా విప్లవం" యు. పి. కాంగ్రెసు ప్రభుత్వంచేత నిషేధింప బడలేదు కదా! అని తిరిగి ప్రశ్నిస్తే, "నేను వారికి సలహా యిచ్చుటకు ప్రయత్నిస్తా"నని జవాబు చెప్పాడు. అంతేకాదు ఈ లాంటి పుస్తకాలు ఇంగ్లీషులో ఉంటే ప్రమాదం ఉండదట! తెలుగులో ఉంటే తెలియని ప్రజలు వాటిని చదివి, దౌర్జన్యయుతమయిన నేరాలకు ఉద్యుక్తులౌ తారట.

ఈపాడు వైఖరి సామ్రాజ్య వాదులతో బ్రహ్మాండమయిన పోరాటాలు నడుప వలసిన నాయకులకు ఏ మాత్రం తగదు.

ఒరిస్సాలో క్లిష్ట స్థితి

ఈ రమధ్య ఒరిస్సా రాష్ట్రములోని స్వదేశ సంస్థానాల ప్రజా ఉద్యమ సందర్భములో—అనేక మందిని సంస్థానాల ప్రభుత్వాలు ఎరస్టు చేసి, శిక్షలు విధించాయి. వారిప్పుడు కాంగ్రెసు రాష్ట్రమైన ఒరిస్సా జైళ్ళలో ఉన్నారు. ఈ రాజకీయ ఖైదీలను ఆయా సంస్థానాల ప్రభుత్వాలకు స్వాధీనము చేయవలసిందనీ; సంస్థాన ప్రజా ఉద్యమాన్ని ప్రోత్సహించే ఉపన్యాసాలుగాని, కార్యక్రమాలుగాని ఒరిస్సా రాష్ట్రములో ఎవరూ నడిపించకుండా నిషేధిస్తూ కాంగ్రెసు మంత్రులు "సంస్థాన రక్షణ చట్టము"ను అమలు జరుపవలసిందనీ మొదలైన కోరికలు కోరుతున్నాడు, ఒరిస్సా గవర్నరు. మంత్రులిందుకు అంగీకరించటం లేదు.

రణపూర్ హత్యలో నిందితులయిన ప్రజల దౌర్జన్యాన్ని ఒరిస్సా కాంగ్రెసు మంత్రులు అంత విపరీతముగా ఖండించడం ఒక అవకాశముగా తీసుకొని గవర్నరు యిప్పుడు యీ విధముగా ఒత్తిడి తెస్తున్నాడు. కాని, మంత్రులు మాత్రం గవర్నరుకు లొంగకూడదు. అవసరమయితే, యీ సమస్యమీద రాజీనామాలయినా యివ్వవలసిందే!

మలబార్ రైతులు

మదరాసు ఎసంబ్లీలో శ్రీమాన్ రాజగోపాలాచారి కొన్ని ప్రశ్నలకు జవాబు చెబుతూ, మలబార్‌లో శిస్తుల నిరాకరణోద్యమం అమలులో ఉన్న దని ప్రకటించాడు. కేరళ రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి శంకరన్ నంబూద్రిపాద్ గారు అది అసత్య ప్రచారమని యిదివరలో రెండు మూడు పర్యాయాలు రాజాజీకి తెలియజేశారు. శాసన సభలో సభ్యుడయిన కేరళరాష్ట్రకాంగ్రెసు అధ్యక్షులు అబ్దుల్ రహిమాన్‌గారుకూడా అది అసత్యమేనన్నారు. కొన్నిచోట్ల జమీందారులే శిస్తులు పుచ్చుకోవడం లేదని ఆయన చెప్పారు.

మలబార్‌తో ప్రత్యక్షసంబంధంగల రాష్ట్రకాంగ్రెసు అధికారులు చెపుతూన్న యీ సాక్ష్యాన్ని రాజాజీ త్రోసి కరించడం కాంగ్రెసు ధిక్కారం కాదా

అఖిల భారత ప్లానింగ్ కమిషన్.



అఖిల భారత ప్లానింగ్ కమిషన్ అధ్యక్షుడు
నెహ్రూ

భారతీయ జాతీయోద్యమ చరిత్రలో మొట్ట మొదటిసారి మననాయకులు స్వదేశీ పరిశ్రమల అభివృద్ధికి తీవ్రప్రయత్నములు సాగించుట మనం చూస్తున్నాం. గత అక్టోబరు మాసంలో ఢిల్లీలో సమావేశమైన అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశ సందర్భంలో కాంగ్రెసు అధ్యక్షులైన సుభాష్ చంద్రబోసుయొక్క అధ్యక్షతను వివిధ కాంగ్రెసు రాష్ట్రాలనుంచివచ్చిన పరిశ్రమల శాఖామంత్రులు సమావేశమయారు.

"మనదేశంలోని పేదతనం, నిరుద్యోగసమస్య జాతీయ రక్షణ, ఆర్థిక పునర్నిర్మాణం యివన్నీ పారిశ్రామికాభివృద్ధి లేకుండా పరిష్కరింపబడజాలవని ఆసమావేశంలో తీర్మానించబడింది. "దేశంయొక్క అవసరాలను, జాతీయ సంపదను, దేశంలోవున్న ప్రత్యేకపరిస్థితులను దృష్టి యందుంచుకొని" ఇనుము, ఉక్కు మొదలైన పెద్దపెద్ద ప్రధాన వృత్తముల అభివృద్ధికై ఒక ప్రణాళికను తయారుచేయాలని ఆసమావేశంలో నిర్ణయించబడింది. అందుకై జవహర్లాల్ నెహ్రూయొక్క అధ్యక్షత క్రింద ఒక ఉపసంఘంకూడా నియమించబడింది. దేశమందలి అర్థశాస్త్ర నిపుణులు, అనుభవజ్ఞులైన బ్యాంకర్లు, ఆరితేరిన శాస్త్రవేత్తలు, రసాయన శాస్త్రజ్ఞులు స్పెష్యలిస్టులు, ఆ ఉపసంఘంలో మెంబర్లు.

యంత్ర పరిశ్రమ, యంత్రాలకు కావలసిన సాధన సామగ్రి, మోటార్లు, వాటికి అవసరమయ్యే భాగాలు, పరిశ్రమలలో ఉపయోగపడే రసాయనాలు, విద్యుచ్ఛక్తి—వీటిని మన దేశములో తయారు చేయడానికిగల అవకాశాలేమిటో పరిశీలించి ఒక నివేదికను తయారుచేయడం యీ ఉపసంఘపువారిపని. ఆనివేదికను అ. భా. కాంగ్రెసు వర్కింగ్ కమిటీకి యివ్వాలి.

ఈ ఏర్పాటునను సరించి ఉపసంఘంవారు 167 ప్రశ్నలను తయారుచేసి, వాటిని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకూ—స్వదేశ సంస్థాన ప్రభుత్వాలకూ—వర్తక సంఘాలకూ—పారిశ్రామిక సంస్థలకూ—కార్మిక సంఘాలకూ—వ్యవసాయ సంస్థలకూ—పెద్దపెద్ద కంపెనీలకూ పంపారు. కొంతమంది వ్యక్తులకు కూడా పంపారు. ఏయే రాష్ట్రాలలో ప్రజల జీవిత పరిమాణం ఎంతో, అందుకై అందుబాటులోవున్న అవకాశాలు ఏవేవో, ఏయే పరిశ్రమలు ఎక్కడెక్కడ స్థాపించడానికి వీలున్నదో, ఇప్పుడున్న పరిశ్రమలు ఎంతమందికి పని యిస్తున్నవో మొదలైన వివరాలన్నీ ఆ ప్రశ్నావళిలో చేర్చబడి ఉన్నాయి. ఆయాసంస్థలు, వ్యక్తులు, యిచ్చే సలహాలపై వచ్చే మార్చిలో ఉపసంఘ సభ్యులు చర్చలు సాగించి కొన్ని ప్రధాన సిద్ధాంతాలకు వస్తారు. అప్పుడు వారంతా మరొక పెద్ద కమిటీగా ఏర్పడుతారు. అదే అఖిలభారత జాతీయ ప్లానింగ్ కమిషన్. దానిలో మొదటి ఉపసంఘ సభ్యులూ, ప్రతి రాష్ట్రముయొక్క—ప్రతి స్వదేశ సంస్థానము యొక్క ప్రతినిధి, ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్సుయొక్క ప్రతినిధులు నలుగురూ, అఖిలభారత గ్రామపరిశ్రమల సంస్థ తరఫున ఒకరూ, సభ్యులుగా ఉంటారు.

ఒక్కొక్క పరిశ్రమ ఏయే రాష్ట్రంలో ఎక్కడెక్కడ స్థాపించవలెనో, దానిని ఏరీతిగా నడపాలో, ఏ సూత్రాలనుబట్టి యాజమాన్యం ఉండాలో, దానికి కావలసిన పెట్టుబడి, ఋణం, షేర్లు మొదలైన చిన్నచిన్న వివరాల దగ్గర నుంచీ యీ అఖిలభారత జాతీయ ప్లానింగ్ కమిషన్‌వారు తమ సిఫార్సులతో కూడిన ఒక స్కీమును ప్రకటిస్తారు.

ప్రభుత్వ విధానం.

బ్రిటిష్‌వారు మన దేశంలో కాలుపెట్టినప్పటి నుంచీ ముఖ్యంగా, గ్రేట్ బ్రిటన్‌లో పారిశ్రామిక యుగం ప్రారంభమైన నాటినుంచీ మన దేశాన్ని లాభకరమైన ఒక మార్కెట్టుగా ఉపయోగించుకొంటూవచ్చారు. అనాదినుంచీ ప్రసిద్ధిగాంచిన మనదేశీయపరిశ్రమల్ని నాశనం చేసారు. అదేగాక తమదేశంలో ప్రరిశ్రమలు వృద్ధి చెందాలంటే ముడిసరుకులు అవసరం. మనదేశంలో అవి కావలసినన్ని ఉన్నాయి. కాబట్టి, పత్తి, గోధుమ, జనుము, వేరుశనగ మొదలైన వ్యాపారపు పంటలే విరివిగా పండించేలాగు అనేక ఉపాయాలు కనిపెట్టారు. అనగా తమ పరిశ్రమలు, తమవ్యాపారం వృద్ధిపొందాలంటే, మన దేశంలో పరిశ్రమలు వర్ధిపొందకుండాను, వ్యవసాయమే ప్రధానవృత్తిగాను ఉండాలన్నమాట. ఎగుమతి-దిగుమతి పన్నులవిధానంవల్ల, రూపాయమారకపు పద్ధతివల్ల, రైల్వే పాలిసీవల్ల, బ్యాంకింగు వ్యవహారాలవల్ల యీపనిని వారు చేయగలుగుతున్నారు.

అనగా బ్రిటిషు ప్రభుత్వవిధానం రెండు పద్ధతులుగా ఉన్నదని బోధపడుతుంది: (1) మన పరిశ్రమలను అణపడం (2) మన ప్రజలు ఎల్లప్పుడూ వ్యవసాయ వృత్తిమీదనే ఆధారపడుతూ వారి పరిశ్రమలకు చౌకగా ముడి పదార్థాలు సప్లయిచేయడం.

1935 నూతన రాజ్యాంగ చట్టంలో కూడా బ్రిటిష్ పరిశ్రమలకు ప్రత్యేకరక్షణ లిచ్చే క్లాజులు ఉన్నాయి.

మన నాయకుల అభిప్రాయం.

స్వదేశీ పరిశ్రమలయెడ మన ప్రభుత్వము చూపుతున్న యీ సవతితల్లి ప్రేమను మన నాయకులు తెలుసుకోకుండాలేరు. ఢిల్లీసమావేశంలో సుభాష్‌బోసు యిచ్చిన అధ్యక్షోపన్యాసంలో ప్రజలకు సంపూర్ణమైన రాజ్యాంగాధికారంరానిదే పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా జరగదని స్పష్టంగా చెప్పాడు." మన ప్రధాన పరిశ్రమల విషయంలోను, గనుల అభివృద్ధి విషయంలోను, నావికా పరిశ్రమ, యితర రహదారీ పరిశ్రమల విషయంలోను, కాంగ్రెసుకు ప్రభుత్వానికీ మధ్య అభిప్రాయభేదాలు ఉన్నాయి. అంటూ మదరాసు పరిశ్రమల మంత్రి అయిన వి. వి. గిరి గారు పలికారు.

అయితే యీ ప్లానింగ్ కమిషన్లు, యీ ప్రణాళికలు, యీ రిపోర్టులు, ఎందుకని పాఠకులు అడుగవచ్చు. రిపోర్టు పూర్తి అయి వచ్చాక, దానికి ప్రజలందరియొక్క బలం ఉండి తీరుతుంది. వెన్వెంటనే, బ్రిటిష్ పెట్టుబడిదార్ల నియంతృత్వం పనికిరాదనీ, స్వదేశీ పరిశ్రమలు దేశం అంతటా విరివిగా స్థాపించబడాలనీ, ఒక ఆందోళన బయల్దేర తీయవచ్చు. దీనిఅర్థం, బ్రిటిష్‌వారి రాజకీయ, ఆర్థిక నియంతృత్వానికి "ఛాలెంజ్"గా యీ రిపోర్టు ఉపయోగ పడుతుంది.

వచ్చేది ప్రపంచ యుద్ధం. ప్రతి దేశంనుంచీ ముఖ్యంగా ఇండియా నుంచి, ఆయుధాలు, మోటార్ లారీలు, మొదలైనవెన్నో అవసరం అవుతాయి బ్రిటన్‌కు. కనుక, ప్రభుత్వ సహాయం ఉంటుంది కదా అని అట్టి పరిశ్రమల మీదనే మన పెట్టుబడిదార్ల దృష్టి కేంద్రీకరించబడితే మనకే నష్టం వాటిల్లుతుంది.

ఎప్పుడైతే మననాయకులు ప్లానింగ్ కమిషన్ ఏర్పాటుచేసి స్వదేశీ పరిశ్రమలకై ఆందోళన ప్రారంభించారో, అప్పుడు బ్రిటిష్ వ్యాపారస్థుల గుండెల్లో రాయిపడింది. సర్ థామస్ ఇన్సు కప్ (బ్రిటిషు ట్రేడ్ కమీషనర్ ఇన్ ఇండియా) 1937-38 సంవత్సరంలో బ్రిటన్‌కీ, ఇండియాకు మధ్య జరిగిన వ్యాపారాన్ని గురించి ఒక రిపోర్టు వ్రాస్తూ, యీవిధంగా అన్నాడు: "ఇండియా ప్రారంభించబోతూన్న పారిశ్రామికాభివృద్ధి వేగాన్ని కొంత తగ్గించకపోతే, త్వరలోనే ఆదేశం ఆర్థికంగా దెబ్బ తింటుంది." ఇండియాకు, ఎగుమతి చేసే దేశాలకు, కూడా యీ అభివృద్ధి నష్టమే నంటూ బ్రిటిష్ పెట్టుబడిదార్ల 'ఫైనాన్షియల్ టైమ్సు' పత్రిక అభిప్రాయం యిచ్చింది. ఇంగ్లండులో యీ విషయమై తీవ్రమైన ఆందోళన ప్రారంభమయింది.

మన దేశంలో యంత్ర పరిశ్రమలు వృద్ధిపొందితే, రైతుల్లోనూ, కూలీలలోను బీదతనం ఎక్కువై, వ్యవసాయ పరిశ్రమకూ-యంత్ర పరిశ్రమకూ మధ్య స్పర్ధ ఏర్పడుతుందని ట్రేడ్ కమీషనర్ హెచ్చరించాడు. కాని, ఏదేశ చరిత్రచూచినా, ప్రజాసామాన్యము ఫ్యూడల్ జమీందార్ల క్రింద తాము అనుభవించిన దుర్భర దాస్య జీవితం యంత్ర యుగంవల్ల కొంత దాగుపడినదని అంగీకరించవచ్చు. కాని, మన దేశంలో విదేశీ పెట్టుబడిదార్ల లాభాలకై మధ్య యుగపు వ్యవసాయ పద్ధతులే యింకా అమలులో ఉండవలసి వస్తోంది. అనేకమంది బీద రైతులు, వ్యవసాయ కూలీలు దేశీయ పరిశ్రమలలో కార్మికులుగాచేరితే, వ్యవసాయంలోనూ పోటీ తగ్గుతుంది. పరిశ్రమలూ వృద్ధి చెందుతాయి. అంతేగాక, దేశంలో ఉత్పత్తిఅయిన ముడిసరకుకు దేశములోనే తగిన విలువ, మార్కెట్టు లభిస్తుంది.

విదేశీ సరకుల దిగుమతి తగ్గితే, దిగుమతి పన్నులద్వారా ప్రభుత్వానికి నేడు లభించే ధనం ఆగిపోతుందని ఇన్సుకప్ వాదించాడు. ఇది నిజమేగాని, జాతీయ ప్రభుత్వానికి కావలసిన రివెన్యూ యితరమార్గాలవల్ల సేకరించవచ్చు. ఉదా:— ఇన్‌కంటాక్సువల్ల వచ్చే ధనం ఎక్కువౌతుంది. ఇప్పుడు దేశానికి అవసరం కాని మిలిటరీ, సివిల్ సర్వెంట్సు జీతాలు, ఋణంమీద వడ్డీ యీ ఖర్చులన్నీ స్వరాజ్యంవచ్చాక అవసరం ఉండదు.

ప్రతియేటా మనం బ్రిటన్‌కు చెల్లించవలసిన ధనానికి బదులుగా పంపుతూన్న ముడిసరుకు వగైరా స్వదేశీ పరిశ్రమలకే వినియోగించబడినప్పుడు, ప్రభుత్వంయొక్క పరపతి నశిస్తుందని విలపించాడు బ్రిటిష్ ట్రేడ్ కమీషనర్, నిజమే! ఏటేటా మనం బ్రిటన్‌కు చెల్లిస్తున్న రు. 300 కోట్లు శాశ్వతంగా చెల్లించము. రాజకీయంగా మనం స్వాతంత్ర్యం సంపాదించుకొంటే, ఇండియా యొక్క ఎగుమతులకూ-దిగుమతులకూ ఎంతో తారతమ్యం ఉండదు.

ఎసెంబ్లీలో ప్రకాశంగారి గంభీరోపన్యాసం



మదరాసు రివెన్యూ మంత్రి ప్రకాశం పంతులుగారు తమ "ఎస్టేట్సు ల్యాండ్ ఆక్టు ఎంక్వయిరీ రిపోర్టు"ను మద్రాసు ఎసంబ్లీలో ప్రవేశపెట్టుచు, యీనెల 20, 21 తేదీలలో సుమారు 6 గంటలు గంభీరంగా ఉపన్యసించారు. దాని సారాంశం యీక్రింద ప్రచురించుతున్నాము:

ఈ నివేదికను సమర్పించుటకు పూర్వం దీనివల్ల తమకు నష్టము కలుగుననే భయంవల్ల కొందరు యెటులైనను దీనిని ప్రచురించకుండజేసి, రహస్యముగ ఉంచునటుల ప్రయత్నించిరి. కమిటీలోనే యిట్టి ప్రయత్నములు గావింపబడెను. కాని, యీ సభవారును, కౌన్సిల్ సభ్యులును, మమ్ములను విచారణజరిపి నివేదికను సమర్పించుటకై నియమించి యుండుటచే మా నివేదికను రహస్యముగ నుంచుటకు వీలులేకపోయెను.

నివేదిక ప్రచురింపబడిన పిమ్మట, అనేక విధములగు విమర్శలు బయలుదేరెను, అది సహజము. ప్రజలు బాగుగా విమర్శించి దానిలో నుండు లోపాలోపములను వెల్లడించుట కొరకే అసలీ నివేదిక ప్రకటించబడినది. ప్రజలలో వారివారి తత్వముల ననుసరించి పూర్వాచార పరాయణులు, మితవాదులు, అతివాదులు పలు రకముల వారుందురు, వారు తమకు న్యాయమని తోచిన విమర్శల గావింపవచ్చును. కాని నివేదికను చదువకయే, అది విప్లవకరమైనదనీ ఇతరుల ఆస్తులను అపహరించు చున్నదనీ హేతుబద్ధమైనది కాదనీ, చెప్పుట మాత్రము భావ్యము కాదు.... సామ్యవాదులే యిప్పుడీ మంత్రివర్గమున ఉండియుంటే, సామ్యవాద మంత్రియే ఈ నివేదికను తయారుచేసి యుంటే ఇది ఎంతో విప్లవకరమైనదనీ—సోషలిస్టు సిఫార్సులనీ — మాస్కోవారి ప్రేరేపణచే యిది తయారు చేయబడెననీ—దీని కంతకును మాస్కోవారే కారణమనీ—కూడ పై విమర్శకులీ సరికి గొప్ప గందరగోళముచేసి యుండెడివారనియే నా అభిప్రాయం....

మరచిపోయిన విషయం

130 సంవత్సరములుగ ప్రజలందరును మరచిపోయినట్టి విషయములను, రైతుల హక్కులను యిప్పుడు మొదటిసారిగ మేము బయటికి తీయుచున్నాము.... 1802 వ సంవత్సరపు పెర్మనెంట్ శెటిల్మెంటు రెగ్యులేషన్ గావింపబడిననాడే పట్టా రెగ్యులేషనులనీ, కరణం రెగ్యులేషనులనీ మరి 5 రెగ్యులేషన్లుకూడా శాసింపబడెను. పర్మనెంట్ సెటిల్మెంటు రెగ్యులేషన్ నేటికిని అమలులో ఉన్నది. దీని ప్రకారం శిస్తురేట్లు శాశ్వతముగా, మార్పులేకుండా వర్తించేలాగు నిర్ణయించబడినది. 1863 వ సంవత్సరమున రెంట్ రికవరీ బిల్లు (ఇది 1865 లో శాసనం గావింపబడెను.) ను రచించి ప్రవేశపెట్టిన ప్రభుత్వాధికారులు, 1905 లో మద్రాసు ఎస్టేట్సుల్యాండ్ బిల్లు (ఇదే 1908 లో శాసనం గావింపబడెను) ను ప్రవేశపెట్టిన ప్రభుత్వ సభ్యులును, అందరూ 1802 వ సంవత్సరపు రేట్లను మార్చ వీలులేదనే సూత్రమును అంగీకరించి వ్యవహరించిరి. బిల్లులుగా ప్రవేశపెట్టబడి, సెలెక్టు కమిటీవారి నివేదికలు సమర్పింపబడిన తరువాత దుర్గ్రాహ్యములగు ఏవో కారణములచే వదలివేయబడిన చట్టములలో కూడ 1802 వ సంవత్సరపు శిస్తురేట్లే శాశ్వతముగా నిర్ణయింపబడెనని అంగీకరింపబడెను.

పర్మనెంట్ సెటిల్మెంటు రెగ్యులేషన్‌తో బాటు గావింపబడిన పట్టా రెగ్యులేషన్ నందు 7, 9 నిబంధనలలో శిస్తురేట్లు హెచ్చింపరాదనియు, అవిశ్వాసముగ నిర్ణయింపబడెననియు ప్రకటించియుండిరి. 1863 లో ప్రవేశపెట్టబడిన రెంట్ రికవరీబిల్లుకూడా పై రెండు నిబంధనలు ఉన్నవి ఉన్నట్టుగానే 10 వ సెక్షనులో ప్రవేశపెట్టబడెను. కాని ఆ బిల్లు శాసనం అగుసరికి (అనగా 1865 నాటికి) 10 వ సెక్షన్‌యొక్క స్వరూపం మార్చివేయబడెను. కాని, అందలి ప్రధాన సిద్ధాంతం మార్చబడలేదు. దరిమిలాను 1885 లో ప్రవేశపెట్టబడిన మరొక చట్టముపై చర్చ సందర్భమున బెంగాల్‌లోవలె జమీందార్లకు శిస్తు హెచ్చింపు అధికారం ఉండవలెనని వాదించబడెను. కాని, రివెన్యూ బోర్డువారు తీవ్రముగా ప్రతిఘటించినందున ఆచట్టం వదలివేయబడెను. అటుతరువాత 1898 లో ప్రభుత్వం వారింకొక చట్టమును ప్రవేశపెట్టిరి. అప్పటి ప్రభుత్వ సభ్యుని ఉపన్యాసమును చదివినచో, శిస్తురేట్లు 1802 లో శాశ్వతముగా ఎట్లు నిర్ణయించబడెనో తెలియగలదు. 1908 వ సంవత్సరపు ఎస్టేట్సు ల్యాండ్ ఆక్టును ప్రవేశపెట్టుచూ ప్రభుత్వ సభ్యుడైన ఫోర్బ్సు ఉపన్యాసమునందు కూడ రైతుల హక్కు స్పష్టంగా అంగీకరింపబడెను.

కాబట్టి, మా నివేదికయందు గావించియున్న సిఫార్సులు ఏమాత్రము కొత్తవికావు. ఇంత కాలముగ ప్రవేశపెట్టబడుతూ వచ్చిన జమీన్ రైతాంగ శాసనముల సందర్భములో ప్రతి ప్రభుత్వ సభ్యునిచేతను స్పష్టంగా అంగీకరింపబడినవి.

సెటిల్మెంటుకు పూర్వం

పెర్మనెంట్ సెటిల్మెంటుకు పూర్వం ఈస్టు ఇండియా కంపెనీవారు ఏజంట్లద్వారా రైతుల నుండి శిస్తులు వసూలు చేసుకొనేవారు. వీరే దరిమిలాను జమీందార్లయినారు. ఈ ఏజంట్లు ప్రభుత్వంవారికి వసూళ్ళను గురించి సరిగా లెక్కచెప్పక దగా చేయుచుండిరి. ప్రభుత్వమునకు రావలసిన దానికంటె ఎక్కువగా వసూలు చేసి రైతులనుకూడా మోసపుచ్చుచుండిరి. రైతులను పొలములనుండి వెళ్ళగొట్టుచు అల్లకల్లోలము చేయుచుండిరి. ఇట్టి కల్లోల పరిస్థితులను తొలగించి, దేశమున శాంతిని స్థాపించి, ప్రజలు ఆర్థికముగ అభివృద్ధి పొందుటకు 1802 లో ప్రభుత్వం పెర్మనెంటు సెటిల్మెంటును గావించిరి. అనాటికి ఎంత హెచ్చు శిస్తురేట్లు విధించియున్నను, ప్రభుత్వమువారు చాల ఉదారమగు ఆశయములతోనే యీ సెటిల్మెంటును ప్రవేశపెట్టిరనుట మాత్రం నిస్సంశయం. రైతుల స్థితిని అభివృద్ధిపరచి, దేశములో సంపదను, పరిశ్రమలను, వాణిజ్యమును అభివృద్ధి పరచుటకుగాను యీ పెర్మనెంట్ సెటిల్మెంటు తలపెట్టబడెనని ఆ కాలపు ప్రభుత్వ రికార్డులన్నిటియందును తెలియజేయబడెను. ఇది ముఖ్యముగా రైతుయొక్క శ్రేయస్సుకొరకు ఉద్దేశింపబడినదిగాని యితరుల కొరకుకాదు. కనుకనే ముందుగా రైతుచెల్లించు శిస్తురేటును నిర్ణయించిరి. ఉత్తర జిల్లాలలో మొత్తము ఫలసాయములో సగమును, దక్షిణ జిల్లాలలో నికరాదాయములో సగమును. శిస్తురేటుగా నిర్ణయించి, ఆరేటే శాశ్వతంగా అమలునందుండునని ప్రకటించిరి. తరువాత జమిందార్లతో పెర్మనెంట్ ఒడంబడికలు చేసుకొననారంభించిరి. రైతులకు విధింపబడిన శిస్తురేటు ప్రకారం, అప్పటి సాగుభూములపై ఆదాయమును లెక్కగట్టి. అందులో మూడింట రెండు భాగములు ప్రభుత్వమునకు చెల్లించవలెననియు, మిగిలిన ఒక భాగమును తన ఖర్చులకును, లాభములకును జమీందారు తీసుకొనవలెనని విధించిరి. ఇంతేగాక, అప్పటికి బంజరులుగా నున్న భూములను రైతులకు వ్రాసియిచ్చి వాటివల్ల వచ్చే ఆదాయమును కూడా అనుభవించుటకు జమీందార్లకు వదలివేసిరి. జమీందార్లకొసగబడిన యీ ప్రతిఫలం చాలా ఉదారమైనదని అంగీకరింపక తప్పదు. శిస్తురేట్లను శాశ్వతముగ నిర్ణయించి, వానిని వసూలుచేసి మూడవవంతుమాత్రమే అనుభవించుటకు అధికారం గలిగిన జమీందార్లు క్రమక్రమంగా, శిస్తులు హెచ్చించి తమ ఆదాయమును విపరీతముగా హెచ్చించుటకారంభించిరి. ఇట్టి చర్య అక్రమమని ప్రభుత్వాధికార్లు చట్టనిర్మాణం వచ్చినప్పుడెల్ల ప్రకటించుచునేవచ్చిరి. శిస్తురేట్లు శాశ్వతం అనే సూత్రం ఈస్టిండియా కంపెనీ డైరెక్టర్లచే స్పష్టంగా అంగీకరించబడియున్నది.

కాబట్టి, మానివేదికలో కొత్త విషయమేదియును లేదు ఇంతవరకును మరుగు పడియున్న అంశములను బయల్పరచితిమి. మూతలనుతొలగించి, రహస్యముగ నున్న దానిని బహిరంగమొనర్చితిమి.....

ఈ రాష్ట్రమున నేడు 1659 జమీందారీలున్నవి. వీరందరును కలిసి 44లక్షల రూపాయల పేష్కష్ ప్రభుత్వమునకు చెల్లించుచున్నారు. తాము మాత్రం 213 లక్షల శిస్తుగా వసూలు చేయుచున్నారు. పెర్మనెంట్ సెటిల్మెంటు ఒడంబడిక ప్రకారం వీరు 63 లక్షలు మాత్రమే వసూలు చేసుకొన వలెను. జమీందార్లు యీ విధముగ శిస్తులు హెచ్చింపక, షరతుల నుల్లంఘింపక, న్యాయమైన దానినే వసూలు చేసుకొన్నచో, రైతులింత దుర్భరమైన శిస్తు భారముతో శిథిలమయే వారుకారు; షాహుకార్ల చేతులలో తివస్థలు చెందవలసి వచ్చెడిది కాదు. రైతు ఋణభారం 200 కోట్లు రూపాయల వరకు హెచ్చేది కాదు. భూములు కోల్పోయి, కూలినాలి చేసి జీవింపవలసిన అధోగతికి పాల్పడి యుండేవారు కారు....

ఫారెస్టు హక్కులు

ఫారెస్టులపైనను, జలాధారముల పైనను జమీందార్లకుగల హక్కులు భూమికి సొంతదారు ఎవరో అనే విషయంమీద ఆధారపడి యుండును. భూమికి యజమాని జమీందారే అయినట్లయితే, ఫారెస్టులను తమ యిష్టమువచ్చినట్లు ఉపయోగించుకొనవచ్చు. అప్పుడు రైతులకు ఫారెస్టు సరసులమీద ఎట్టి అధికారం లేకుండా పూర్వం మాదిరిగానే వ్యవహరింపవచ్చును. ఫారెస్టు చట్టంలో, వారు భూమికి సొంతదారులని ప్రభుత్వం ఎక్కడా స్పష్టీకరించి యుండలేదు. ఆ భూమిని వ్యవసాయమునకు ఉపయోగించేలాగు మార్చుటకు కూడా హక్కు ఉన్నట్లు ఎక్కడా చెప్పలేదు. ఫారెస్టు భూముల విషయంలో కమిటీవారు సమగ్రమైన విచారణ చేసియున్నారు. రైతులే ఫారెస్టు భూములకుకూడ యజమానులని కమిటీవారి అభిప్రాయం. కొన్ని నిర్ణీతమైన ఉపయోగములకొరకు, ఫారెస్టులు ప్రజల ఆస్తిగా పరిగణింపబడుచున్నది. వాటిని ఆక్రమించు కొనుటకు ఎవరికినీ హక్కులేదు. అంతకంటె మంచి ఉద్దేశముతో అవి ప్రత్యేకించబడినవి. ఫారెస్టులవల్ల వర్షం కురియునని శాస్త్రనిపుణుల అభిప్రాయము.

భూమికి యజమాని రైతే అయినప్పుడు, ఆభూమిలో ఒక నదిగాని, కాలువగాని. ప్రవహించినట్లయితే, ఆనీటికి యజమాని ఎవ్వరు? రైతేకదా! భూమికి వలెనే, జలాధారములకు కూడా, యజమాని రైతు అని మానిశ్చితాభిప్రాయం....

ముగింపు

ఈ సిఫార్సులలో కమ్యూనిస్టు స్వభావమెద్దియును లేదు. కాంగ్రెసు రాజకీయముల స్వభావముకూడ లేదు. అసలు రాజకీయ స్వభావమే వాటిలోలేదు. ఈ సభలో ఉన్న సభ్యులు ఒక్క ధనికుల విషయమే ఆలోచింపరాదు. మీరు ధనికుల ప్రతినిధులేకాదు. పేదప్రజలకు కూడ మీరు ప్రాతినిధ్యమును వహించియున్నారు. కనుక, యీ వ్యవహారమున పేద, ధనిక విచక్షణలకు మనస్సులలో తావొసంగరాదు. అట్టిభావమునన్నింటిని వదలి, నిరుపేదలగు నీరైతుల స్థితియందే తాముంటిమని ఊహించుకొన వలెనని ప్రార్థించుచున్నాను. పాక్షిక, రాజకీయ విభేదములను దృష్టిలోనుంచుకొనవద్దని కోరుచున్నాను. చిరకాలముగ సకల కష్టములకు లోనై, అలసట చెందుచున్న రైతులు ఆపార్టీవారుగాని, యీపార్టీవారుగాని గాదు. ఆ కులమువారుగాని, యీ కులమువారు గాని కాదు. ఆ మతమువారుగాని, యీ మతమువారుగాని కాదు. అన్నితెగలకును, అన్ని మతములకును చెందియున్నారు. అందుచేవారికి న్యాయమొనర్చుట ప్రతి సభ్యునికిని విద్యుక్తధర్మము. అనేక దశాబ్దములుగ వారికి నిరాకరింపబడుచున్న కనీసమగు న్యాయమొనర్పవలెనని మాత్రమే యీ కమిటీవారు సిఫార్సులు చేసిరి. అంతకంటె ఎక్కువేమియును కోరుటలేదు. ఈ సిఫార్సులలో న్యాయము లేనియెడల, ధర్మము లేనియెడల, వానిని పూర్తిగా నిరాకరింపుడు. నాకెట్టి అన్వేషణయు నుండదు.

లెక్కలేనన్ని సభలు! బ్రహ్మాండమైన యాత్రలు!!

చిత్తూరుజిల్లా రైతు మహాసభ తిరుత్తనిలో, యీనెల 14 వతేదీని శ్రీగద్దె రంగయ్యానాయుడు గారిఅధ్యక్షతక్రిందసమావేశమయ్యెను.సుమారు 5,000 మంది రైతులు మహాసభకు వచ్చిరి.

శ్రీ రంగయ్య నాయుడుగారు తమ అధ్యక్షోపన్యాసంలో, జమీందారీ విధానంలో రైతు లేవిధంగా నలిగి కృశించుచున్నారో వివరించిరి. జమీందార్లు భోగలాలసులై తమ్ము తామేమరచి పోవుచున్నారనిరి. ఈ విషయాలు గ్రహించే ప్రకాశం పంతులుగారు మద్రాసు ఎసంబ్లీలో జమీందారీ ల్యాండ్ రెవిన్యూ బిల్లు ప్రతిపాదించనున్నారనిరి. సదరు బిల్లు యందలి అంశములను గురించి శ్రీ నాయుడుగారు విపులంగా విశదీకరించిరి. ఈనాము రైతుల విషయము కూడా యిప్పుడే పరిష్కారం అగుట ధర్మం అన్నారు. విచారణ కమిటీవారు జమీందారీ విధాన నాశనము విషయమై పట్టుదల వహించక పోయినను, రైతులు పట్టుదల వహించవలెనన్నారు.

అధ్యక్షోపన్యాసం పూర్తియైన తరువాత, ప్రకాశం కమిటీ రిపోర్టును గురించి శ్రీ ఆర్. బి. రామకృష్ణరాజుగారు, డి. శ్రీనివాసయ్యంగారును, జమీందారీల రద్దును గురించి కామ్రేడ్ వాసిరెడ్డి శివలింగప్రసాద్‌గారునూ, రైతు యాత్రలను గురించి శ్రీ నాగ నరసింహంగారును, ఉపన్యసించిరి.

తీర్మానములు

పిమ్మట, ఈనాము రైతులకు సంబంధించినంతవరకు వారి హక్కులను కాపాడే మరొక చట్టం నిర్మింపబడేవరకు ప్రస్తుతము అమలులో ఉన్న శాసనమునే ఉంచవలెననీ; కొత్త టెనెన్సీబిల్లు చట్టం అయే తేదీకి నిల్వవున్న శిస్తుల బాకీయావత్తు రద్దుచేయబడాలనీ; రూపాయలో నాలుగణాలకు క్రింద పండినపంటకు జమీందారు పూర్తి రెమిషన్ యివ్వాలనీ; సాముదాయక భూములు గ్రామపంచాయితీల వశంచేయాలనీ; జమీందారీ అడవులను, కొండలను రైతుల సౌకర్యార్థం కొంతభాగం ప్రత్యేకించవలెననీ; జలాశయముల విషయంలో, 3 సంవత్సరములకు మించకుండా డి. పి. డబ్ల్యు అధికార్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుబడిపెట్టి జలాశయములన్నీ మరమ్మతు చేయించాలనీ: సదరు ఖర్చులు ఆయా జమీందార్ల వద్ద వసూలు చేయాలనీ; యిప్పుడు జమీందార్లచేత స్వయంగా ఆక్రమింపబడినట్టిగాని, రైతులకు పట్టాలు వ్రాసి యివ్వబడినట్టిగాని ఆ పడు కొండప్రదేశాలను శాసనరీత్యా తిరిగి సాముదాయక భూములుగా కేటాయించబడవలెననీ; శిస్తువసూళ్ళు ఫిబ్రవరి 10 వ తేదీలోగా ప్రారంభించరాదనీ; చట్టం అమలులోనికి వచ్చినప్పటినుంచి 1 సంవత్సరం లోగా సర్వేశాసనభూములన్నీ ప్రభుత్వమే సర్వేచేయించాలనీ మొదలైన సవరణలతో ల్యాండ్ రెవెన్యూ టెనెన్సీబిల్లు చట్టముచేయవలసిందిగా మదరాసు ప్రభుత్వమును కోరుచూ తీర్మానించబడెను.

* * *

దరిశి డివిజన్ తృతీయ జమీన్ రైతు మహాసభ.

పై మహాసభ యీ నెల 12 వ తేదీని శ్రీ ఉన్నవ బలరామ కృష్ణయ్యగారి అధ్యక్షత క్రింద పడమటి వీరాయపాలెంలో జరిగెను. షుమారు 2000 మంది రైతులు సభకువచ్చిరి. ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షులైన కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు జాతీయ పతాకమును ప్రతిష్ఠించిరి. సభాప్రారంభకులైన శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఉపన్యసించుచూ ప్రకాశంగారి రిపోర్టు ఆమోదించ బడదనే పుకారు సరియైనది కాదన్నారు. శ్రీ రాజగోపాలాచారిగారు దానికి వ్యతిరేకులు కాదన్నారు. కాంగ్రెస్ మంత్రులు చేయు ప్రతిపనీ, ప్రతి శాసనమూ, మీకొరకేనన్నారు. జమీందారీ పద్ధతిని యిప్పుడే తీసివెయ్యాలనిగాని, గవర్నమెంటుకు యిబ్బంది కలిగేటట్లుగాని ఏమీ చేయకూడదన్నారు, రైతులేమి చేయుదురోనని జమీందార్లు భయపడు చున్నారట. ప్రకాశం కమిటీవారు జమీందార్లకు హామీ యిచ్చారట, కనుకనే రిపోర్టు పైకివచ్చినదట, రిపోర్టు పైకి వచ్చినదికదా అని రైతులు తమ హద్దులు మీరి నడచుకోరాదని గోపాలరెడ్డిగారు హెచ్చరించారు. కొత్త శాసనము కొరకు రైతులు ఎదురు చూచుచుండ వలసినదేగాని, యిప్పుడే వస్తుందని అనుకోరాదట.

అనంతరం సభాధ్యక్షులు జమీందారీ విధానం యొక్క పుట్టుపూర్వోత్తరాలు, పెర్మనెంటు సెటిల్మెంటు, ప్రకాశంకమిటీవారు చేసిన తీర్మానములు మొదలైన అంశాలనుగురించి ఉపన్యసించిరి. పిమ్మట మహాసభలో అనేక తీర్మానములు అంగీకరింపబడెను. మదరాసు ప్రభుత్వ రెవిన్యూ శాఖామాత్యులు శ్రీ ప్రకాశంపంతులుగారు తయారుచేసిన విచారణకమిటీ నివేదికను బలపరచుచూ, ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతు సంఘములవారు సూచించిన సవరణలతో శాసనము చేయవలసినదని మదరాసు ప్రభుత్వమును కోరుచూ తీర్మానించబడెను.

* * *

కాళహస్తి తాలూకా జమీన్ రైతు మహాసభ.

10-1-39 వ తేదీని పైమహాసభ తాలూకా జమీన్ రైతుసంఘ కార్యాలయంలో శ్రీ అద్దూరి అంకిరెడ్డిగారి అధ్యక్షక్రింద జరిగెను ప్రకాశం కమిటీవారు చేసిన సిఫార్సులకు సభవారి ఆమోదంతెలియజేస్తూ తీర్మానించబడెను. ఇండియన్ టాక్సేషన్ కమిటీవారి సూచనప్రకారం రైతు చెల్లించవలసిన శిస్తు నికరాదాయంలో నాల్గవ వంతు అయినను, లేక పూర్వపు హిందూ రాజులకాలంలో మాదిరిగా 6 లేక 10 వ వంతు అయినను, లేక రు. 2500 లకు తక్కువగాక యుండు ఆదాయంమీద మాత్రమే శిస్తు విధించే పద్ధతి అయినను చట్టబద్ధం చేయవలెనని కోరుచూ తీర్మానించబడెను. శిస్తువసూలు అధికారం జమీందార్లనుండి తొలగించవలెననియూ; వసూళ్ళు ప్రతి సంవత్సరం మార్చిలో ప్రారంభించబడవలెననీ; ప్రభుత్వపు రివెన్యూ డిపార్టుమెంటుద్వారా జమీన్ రైతుల జాయింట్‌పట్టాలు విడదీయ బడవలెననీ; అడవులలో కట్టె, కంప మొదలైనవి తెచ్చుకొనుటకును ఏవిధమైన అటంకమును ఉంచకూడదనీ; కొత్తశాసనం యీ రైతులకు కూడా అన్వయించవలెననీ; మిగతా అన్ని విషయములలోనూ ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘం వారి సవరణలతో టెనెన్సీబిల్లును శాసనంగా చేయవలెననిమదరాసు శాసనసభ్యులను కోరుతూ తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదించబడెను.

* * *

కోటనందూరు ఫిర్కా రైతు మహాసభ.

పై మహాసభ యీనెల 16 వ తేదీని కోటనందూరు (తుని ఎస్టేటు)లో శ్రీ గెడ్డం సన్యాసిరావుగారి అధ్యక్షత క్రింద జరిగెను. సుమారు 1000 మంది రైతులు సభకువచ్చిరి. "జమిందారీ విధానము నశించుగాక" అనే నినాదములతో పెద్ద ఊరేగింపు జరిగెను.

కామ్రేడ్ యినుగంటి నారాయణరావుగారు జాతీయ పతాకోత్సవము గావించిరి. శ్రీయుత తిరుపతి అప్పల నరసింహంగారు ప్రారంభోత్సవము జరిపిరి. పిమ్మట, తుని తాలూకాలో సరియైన నీటివసతులు లేకపోవుటవల్లను, ఉన్నవైనను జమీందార్లు మరమ్మతులు చేయించనందునను, యిప్పటికి వరుసగా 4, 5 సంవత్సరముల నుండి నాలుగవ వంతు పంట అయినా పండనందునను, యీ సంవత్సరము తాలూకా మొత్తంమీద ఎనిమిదవ వంతు పంటఅయినా పండనందున పూర్తిరెమిషన్ యిప్పించుటకు పిఠాపురం, తుని జమీందార్లపై ప్రభుత్వము ఒత్తిడి తేవలెననియు, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘము వారిచేతను, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ వారిచేతను, సూచింపబడ్డ సవరణలతో మదరాసు ప్రభుత్వం వెంటనే ప్రకాశం కమిటీ నివేదికను ప్యాసు చేయవలెననియూ, ఈబిల్లు చట్ట రూపము దాల్చేలోగా జమీందార్లు శిస్తుల కొరకు రైతుల దూడ, దుక్కి మొదలైనవి తోలుకొనిపోవుట ప్రారంభించినందున, స్థానికాధికారులు తగిన రక్షణ ఈయకపోతే రైతులు శాంతియుతమైన సత్యాగ్రహ పోరాటమునకు దిగవలసి వచ్చుననియు; తీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదించ బడెను.

గ్రామ కాంగ్రెస్‌సంఘ కార్యదర్శి శ్రీ సూరి ప్రకాశంగారి వందనములతో మహాసభ ముగిసెను.

* * *

కానుకొల్లు రైతులసభ.

12-1-39 వ తేదీని కైకలూరు, కానుకొల్లు తాలూకా రైతు సభ శ్రీ కారవరపు లక్ష్మీనరసింహారావుగారి అధ్యక్షతను సమావేశమై, ప్రకాశం కమిటీవారి సిఫార్సులకు సంపూర్ణమైన ఆమోదము తెలియజేయుచు, తీర్మానింపబడెను. ఈయేటి శిస్తులకు పూర్తిరెమిషన్లు యిప్పించవలెననీ; బుడమేరు గండ్లు పూడ్చించవలెననీ; 1926 లో సెటిల్మెంటులో వృద్ధి చేసిన పన్నులు రద్దుచేయవలెననీ మదరాసు ప్రభుత్వమును కోరుచూ తీర్మానింపబడెను.

* * *

బ్రహ్మాండమైన రైతు యాత్రలు

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ నిర్ణయం ప్రకారం యీ నెల రెండవవారంలో ప్రకాశంకమిటీ రిపోర్టును బలపరుస్తూ ఉత్తర విశాఖ జిల్లాయందలి అన్నితాలూకాలతోను రైతుయాత్రలు ఆయా తాలూకా కచేరీలకు సాగించబడెను.

జిల్లారైతుసంఘ కార్యదర్శి శ్రీ గౌతు లచ్చన్నగారి నాయకత్వమున జలంత్రా, తలతంపర బారువపేట, మందసా, బుదారిసింగి జమీన్ రైతులు 8000 మందికి పైగా "జమీందారీ పద్ధతి పోవాలి!" "జమీందారీ బిల్లు వెంటనే ప్రవేశపెట్టాలి!" "ఈనాం రైతులను వేరుపరచరాదు!" "విప్లవము వర్ధిల్లాలి!" మొదలైన నినాదములతో, రైతుగీతములు, ఎర్రజండాలు ఎగురవేయుచు, బారులు తీరిన పటాలములవలె గొప్ప ఊరేగింపుతో యీనెల 7 వ తేదీని సోంపేట తాలూకా కచేరికి వెళ్ళి వేలకొలది సంతకాలతో కూడిన మెమొరాండములు తహసిల్దారు గారికి దాఖలు చేశారు. వాటిలో ప్రకాశం కమిటీ రిపోర్టును రైతాంగము బలపరచుచున్నదనియు ఆంధ్రరాష్ట్ర జమీన్‌రైతు సంఘముల సవరణలతో వెంటనే శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టాలని మదరాసు ప్రభుత్వమును కోరబడెను.

ఆదినముననే శ్రీ పుల్లెల శ్యామసుందరరావుగారి (ఎం. ఎల్. ఎ) నాయకత్వమున టెక్కలిలో 4000 మంది జమీన్ రైతులును: 9 వ తేదీని పాతపట్నంలో శ్రీ కన్నేపల్లి సత్యనారాయణగారి నాయకత్వమున 4000 మందిన్నీ; గరిమెళ్ళ కుమారస్వామి పంతులుగారి యాజమాన్యమున నరసన్నపేట తహసిల్దారుగారి వద్దకు 2000 మందిన్నీ; 12వ తేదీని విజయనగరం, బొబ్బిలి, ఎస్టేటు రైతులు, అనేకమంది ఈనాం—అగ్రహారం రైతులు శ్రీకాకుళం సబ్‌కలెక్టరుగారి కచేరికి శ్రీపుల్లెల శ్యామసుందరరావుగారి యాజమాన్యమున బ్రహ్మాండమైన ఊరేగింపుగావచ్చి, మెమొరాండములు దాఖలుచేసిరి.

ఉత్తర విశాఖజిల్లాలోగల అన్ని జమిందారీ యీనాం, అగ్రహారం, గ్రామాలనుండి వేలకొలది సంతకాలతో మహజర్లు శాసన సభాధ్యక్షులకు పంపుచున్నారు.

* * *

తెనాలి తాలూకా రైతు రక్షణ యాత్ర

ఈ నెల 11 వతేదీని తెనాలి తాలూకాలో వివిధ ప్రాంతముల నుండి రైతులు విరివిగా వచ్చి, గుంటూరు జిల్లా రైతు సంఘాధ్యక్షులైన శ్రీ ధూళిపాళ్ళ కోటయ్యగారు, తాలూకా రైతు సంఘాధ్యక్షులు నాగళ్ళ కృష్ణయ్యగారు, తాలూకా కాంగ్రెస్ సంఘాధ్యక్షులు శరణు రామకోటయ్యగారు, కామ్రేడ్ ముత్తేవి మాధవాచార్యులు-జీ తే పెద్ది నరసింహమూర్తి మొదలైన సోషలిస్టు ప్రచారకులు-వీరి నాయకత్వమున తెనాలి రివెన్యూ డివిజనల్ ఆఫీసరు గారి వద్దకు వెళ్ళి, మెమోరాండము దాఖలు చేసిరి. పసుపు తోటలను ఆయకట్టులో చేర్చాలనీ; ధాన్యపు బస్తాకు 168 పౌనులు నిర్ణయించాలనీ; గాలివానవల్ల పంటకు వచ్చిన నష్టంవల్ల రూపాయిలో 4 అణాలు రెమిషన్ యిప్పించాలనీ; ఆంధ్రరాష్ట్ర రైతు సంఘమువారి సవరణలతో ప్రకాశం కమిటీ రిపోర్టును శాసనము చేయవలెననీ; మొదలైన 15 అంశములతో మెమోరాండములు యిచ్చిరి.

మంత్రులు మనవారైనా,

లంచగొండితనాన్నుండి విముక్తి లేదా?


కాంగ్రెసువారు పదవులు స్వీకరించి 1½ సంవత్సరము కావచ్చిననూ, అనాదినుంచి ప్రజలను నిరంకుశముగా పీడించుచున్న లంచగొండితన పిశాచం నిర్మూలనకాలేదు. పైగా కొందరు ప్రజా ప్రతినిధులు లంచగొండి తనమునకు లోపాయికారిగా సహాయపడు చున్నారు. భీమవరం తాలూకాలో ఒక గవర్నమెంటు ఉద్యోగి ఒక మంచి పాడిఆవు (రు 100-0-0 విలువగలది)నూ, కొంత సొమ్మునూ లంచముగా పుచ్చుకొన్నట్లు సుమారు 1 సంవత్సరము క్రిందట తాలూకా కాంగ్రెస్ సంఘంద్వారా రాష్ట్ర కాంగ్రెస్ సంఘంవారికి అఫిడెవిట్లు యిచ్చినట్లునూ, దానిపై విచారణ గావించి కలెక్టరుగారు ఆ ఉద్యోగిని సస్పెన్షన్‌లో ఉంచి కేసు విచారణ చేసినట్లునూ, తెలియుచున్నది. కాని దరిమిలాను ఏమి జరిగినదో తెలియదు. ఆ ఉద్యోగికి మాత్రం పూర్వపు జీతంతో సహా తిరిగి పని యిచ్చినట్లు తెలియుచున్నది. కాంగ్రెసు ప్రభుత్వములోనే యీవిధంగా చేయుటవల్ల ప్రజా సామాన్యములో కాంగ్రెసువారు చేయబోవు పనులలో ఏవిధముగా విశ్వాసం వృద్ధిపొందునో తెలియుటలేదు.

బీహార్, యు. పి. వంటి కాంగ్రెసు రాష్ట్రములలో లంచగొండితన విచారణ కమిటీలను ఏర్పాటుచేసి. రిపోర్టులు ప్రకటించబడుతోంటే, మన రాజధానిలో అట్టి కమిటీని అవసరమేమీ లేదని మదరాసు ఎసంబ్లీలో మనప్రధాని రాజాజీ బహిరంగంగా చెప్పడంవల్ల లంచగొండితనం మరింత చెలరేగి పోగలదు.

—డి. వి. శాస్త్రి, భీమవరం.

ఏజన్సీ లంచగొండితనము కేసు.

1938 ఫిబ్రవరినెలలో రామచంద్రపురం గ్రామములో ఒక దొంగతనం జరిగింది. సదరు దొంగతనము విషయంలో యేమియూ యెరుగని ముగ్గురు మాలలపై నేరము ఆరోపించి వారిని కొట్టి బాధించి, యీ గ్రామములోను పురుషోత్తమ పట్నం గ్రామంలోను వున్న విజిలెన్సు కమిటీ మెంబర్లయొక్క సహాయముచేత దేవీపట్నం పోలీసు సబుయినస్పెక్టరుగారు మిక్కిలి బలవంతముమీద రు 25 లు మాలల వద్ద వసూలుచేసినారు. కాని మాలలు యీ దొంగతనముచేసినట్టు రుజువు కాలేదు.



పోలవరం డివిజన్ చిన్నవారిగూడెం రైతు సభ

ఈ విషయమును గురించి మాలలు అన్యాయముగా మావద్ద రు 25 లు లంచము పుచ్చుకున్నారు అని జిల్లా పోలీసుసూపరెంటెండెంటు దొరవారికి అర్జీ పెట్టుకున్నారు. అందుమీద చోడవరం సర్కిలు ఇనస్పెక్టరుగారు ది 6-5-38 తేదీని పురుషోత్తపట్నంలో చాలమంది మధ్యవర్తుల సమక్షంలోచేసిన యింక్వైరీలో పోలీస్ సబ్ ఇనస్పెక్టరు నేరం పూర్తిగా ఋజువు అయినది. ఆయినప్పటికీ 3-7-38 తేదీని Rc. 636/88 నెంబరుతో మీ అర్జీ విషయములు ఋజువు కాలేదంటూ ఆయనే యండార్సుమెంటు పంపించియున్నారు అందుమీద మరల సరియైన యింక్వయిరీ చేయించి న్యాయము దయచేయించవలసినదని 29-7-38 వ తేదీని మరల అర్జీపంపుకున్నారు మాలలు. అందుమీద చోడవరం సర్కిలు ఇనస్పెక్టరుగారే మరల చోడవరం డివిజన్ పోక్సుపోటలో విచారణ చేయుదునని తెలియపరచగా, సదరు విచారణకు మాలలందరును సాక్షులతో వెళ్ళి మీవద్దకి విచారణ జరుగుటవల్ల మాకు న్యాయముదొరకదని ఒక పిటీషను దాఖలుచేసినారు. అందుమీద Rc. No. 1049/38 నెంబరుతో రెండవసారి యింక్వరీకి సాక్షులతో హాజరుకాలేదు అని తెలియపర్చినారు.

యిట్లు మాలలు, పోలీసు సబుయినస్పెక్టరు గారిమీద, విజిలెన్సు కమిటీ మెంబర్లమీద పై అధికార్లకు తెలియపరచినారని విజలెన్సు కమిటీ మెంబర్లు, పోలీసులు మాలలను మిక్కిలి బాధించుట మొదలుపెట్టారు. బాధలు భరించలేక జిల్లా కాంగ్రెసు ప్రెసిడెంటువారికిన్నీ జిల్లా పోలీసు సూపరెంటు వారికిన్నీ, రిపోర్టుల ద్వారా తెలియపర్చుకున్నారు. కాని ఫలితము లేకపోయినది. బాధలు వృద్ధి చెందుచున్నవి. ఆకారణములచేత మాలలందరును కలసి మహజరు పిటీషన్లు వ్రాయించుకొని కాంగ్రెసు లేబరు మినిష్టరు గారికిన్నీ, ప్రధాన మంత్రిగారికిన్నీ రాజమండ్రి సబుకలెక్టరు వారికిన్నీ డిస్ట్రిక్టు సూపరెంటు వారికిన్నీ పంపుకున్నారు.

అందుమీదట శ్రీ చోడవరం డిప్యూటీతహసీలుదారువారు 14-10-38 తేదిని పురుషోత్తపట్నం మకాంలో పూర్తిగా విచారణ చేసినారు. రాజమండ్రి అసిస్టెంటు జిల్లా సూపరెంటుగారు 30-12-38 తేదీని యంక్వయిరీ చేసినారు. సదరు యింక్వయిరీలో మాలలు యింకా సాక్ష్యము వున్నదని చెప్పుకున్నారు. కాంగ్రెసు లేబరు మినిష్టరుగారికి పంపుకున్న అర్జీ విచారణ నిమిత్తం ఇదివరలో యింక్వరీచేసి రుజువు అయినప్పటికిన్నీ రుజువుకాలేదని యెండార్సుమెంటు పంపిన చోడవరం సర్కిలు యినస్పెక్టరుగారు 25-11-38 తేదీని దేవీపట్నంలో హీరింగుచేసియూ రాలేదు. కాని 18-12-38 తేదీని మరల హీయరింగువేయగా సదరు హీరింగుకు మాలలందరువెళ్ళి మీవద్ద యింక్వయిరీ వద్దని ఒక అర్జీ స్వయముగా దాఖలుచేసినారు.

యీ విషయములన్నియు తెలియపరుస్తూ ప్రధాన మంత్రిగారికిన్నీ లేబరు మినిష్టరుగారికిన్నీ పోలీసు యినస్పెక్టరు జనరలు వారికిన్నీ పోలీసు జిల్లా సూపరెంటుగారికిన్నీ రాజమండ్రి సబుకలెక్టరు వారికిన్నీ మరల అర్జీలు పంపుకున్నారు.

కవి బసవరాజు

సం. కార్యదర్శి, ఏజన్సీ ప్రజల సంఘం.

చల్లపల్లి ఎస్టేటులో దౌర్జన్యాలు

కామ్రేడ్ కోనేరు రాజగోపాలరావు.

పూషడం మాదిగ గూడెంలో జమీందారుగారి నిగామాన్లు, సముద్దారు, కమతగాళ్ల ప్రవేశించి, వాళ్ళెప్పుడో 15, 20 సంవత్సరముల క్రితం కౌలుబాపతు బాకీయున్న సొమ్ముకై వారి స్వంత అధికారంమీద వారంట్లు, జప్తు నోటీసులు తీసుకొనివచ్చి, అంతకుముందే ప్రసవమై యున్న స్త్రీలను సహితం యిండ్లబయటకు నెట్టి యిండ్లకు తాళములు వేసిరి.

కాకర్ల చంద్రశేఖరరావుగారు మాజేరులో జరిగిన దురంతాలను "నవశక్తి"లో ప్రకటించినప్పటినుంచీ ఆ గ్రామస్థుల ఐక్యత వృద్ధిపొందినది. దానిని చీల్చుటకు ఎస్టేటు మేనేజరుగారు అనేక పన్నాగములు పన్నుచుండిరి. జమీందారుగారు ఆక్రమించుకున్న పోరంబోకలు, కమతం భూములు, రాబోయే జమీందారీ బిల్లువల్ల పోతాయని ఒక ఉపాయం ఆలోచించారు మేనేజరుగారు. రైతులకు భూములిస్తాము రమ్మని కబురుచేశారు. నిజమేనని కొందరు వెళ్ళుటకు ఉద్యుక్తులైనారు. మరికొందరు వెళ్ళకూడదను కొన్నారు. వారిలో ఐకమత్యము చెడకుండా ఉండుటకై శ్రీ మాజేటి రామచంద్రరావుగారు అందరినీ తీసుకొని కోటలోనికి వెళ్ళారు. మేనేజరుగారు "నవశక్తి"లో వ్రాయబడిన వ్రాతలుఅబద్ధములని ఖండించి, తరువాత రైతులకు పెద్ద ధర్మబోధ గావించారు. 'స్వార్థపరుల' మాటలునమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. తరువాత, రైతులను లేనివారికి భూము లివ్వవలయునా లేక అందరికీ యివ్వవలయునా అని ప్రశ్నించారు. రామచంద్రరావుగారు, మీరేమైనా యిచ్చేది ఉంటే లేనివారికే యిస్తే చాలునన్నారు. మీరు ఎంతెంత భూమిని భరించగలరని మేనేజరుగారు రైతుల నడిగారు. మాకేమీ మీరు దానముగా ఈయనక్కరలేదని రైతులు ఏకకంఠంగా చెప్పి, చివరకు విసిగి బయటికి వచ్చేశారు.

1802 తరువాత రైతులనుండి గుంజుకొన్న భూములు, ఆక్రమించిన బంజర్లు తిరిగి ఎస్టేట్ ల్యాండ్ ఆక్టు ప్యాసయినచో రైతులకే సంక్రమించును గాన, యీలోపుననే వీరు రైతులకు స్వాధీనం చేసినవారమగు దమనీ, దానితోబాటు కొంతధనముకూడా అమాయక రైతులవద్ద కాజేయవచ్చుననీ, ఉద్దేశంతో యీవిధంగా చేస్తున్నారు.

అసత్య ప్రకటనలు

"ప్రజామిత్ర"లోను, "ఆంధ్రపత్రిక"లోను, తుపానువల్ల నష్టపడిన కుటుంబాలకు తూమెడు బియ్యం, తాడిచెట్లు, తాటిఆకు మాజేరు భోగిరెడ్డిపల్లి పెదయాదర చినయాదర మొదలైన గ్రామాలలోయిచ్చితిమనిచేసినప్రకటన నిజంకాదు ఎందువల్లనంటే, మేముఆగ్రామాలకు స్వయంగా వెళ్ళి, రైతుసోదరులను అడుగగా వారు ఆ విధంగాఎవరికి సహాయముచేసి యుండలేదని చెప్పిరి.

ఒక గింజకూడా రైతులకు సహాయంచేయమని మేనేజరుగారు యీ విధంగా పత్రికలలో ప్రకటనలుచేసి ప్రపంచాన్ని మోసపుచ్చుట సాహసమే!

దివితాలూకా రైతుయాత్రాదళమువారు శ్రీ కాకర్ల చంద్రశేఖరరావుగారి నాయకత్వమున చల్లపల్లి ఎస్టేటులో అనేక గ్రామములు సంచారముచేసిరి. ఈ నెల 7 వ తేదీని కృష్ణ లంకలకు చేరిరి. సదరు లంకలకు సర్వే లేకపోవుటచే రహదారీలు సహితము లేకపోవుట, లంకలను జమీందారుగారు స్వాధీనము చేసుకొనుట మొదలైనవి చూచియుండిరి. ప్రక్కనేయున్న గవర్నమెంటు ఏరియాలోని లంకభూములకు చక్కని లెక్కలు, హద్దులు కనుపించుచుండ చల్లపల్లివారి హయాంలోమాత్రం యివేమీలేవు.

దేశమంతా ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరచింది

"జమీందారీ విధానము రైతు శ్రేయస్సునకు హానికరము. అట్టి విధానమును రద్దుపరచని ఏచట్టమూ రైతుల కోర్కెల నీడేర్చి వారి జీవనమును శాశ్వతముగా అభివృద్ధిపరచజాలదు. ప్రకాశం కమిటీ నివేదికలోని సూచనలు జమీందారీ విధానము వల్ల అంతరించిన మా అనాదిసిద్ధములగు హక్కులను కొంతవరకూ తిరిగి పునరుద్ధరించగలవని మేము నమ్ముచున్నాము. ఇట్టి అభివృద్ధికర మయిన సూచనలు చేసిన ప్రకాశం కమిటీ వారికి హృదయ పూర్వక కృతజ్ఞతా వందనములు. అయినను, రైతుల అత్యవసర కోర్కెలను యీడేర్చుటకై కొన్ని సవరణలు గావింపవలసి యున్నది. ఇందులకై, ఆంధ్రరాష్ట్రీ రైతు సంఘంవారు కొన్ని సవరణలను సూచించి యున్నారు. వాటితో మేము పూర్తిగా ఏకీభవించుచున్నాము. వాటితో కూడిన కమిటీ సూచనలను బిల్లు రూపముగా జనవరి 20 వ తేదీని జరిగే అసెంబ్లీ సభా సమావేశములో ప్రవేశపెట్టవలసినదిగా కోరుచున్నాము."

అనే తీర్మానము 12-1-39 మొదలు 19-1-39 వరకూ ఆంధ్రరాష్ట్రీ మంతటా జరిగిన సభలలోను, ఊరేగింపులలోను, మెమొరాండములలోను రైతులందరిచేతను అంగీకరింపబడి, శాసనసభాధ్యక్షులైన శ్రీ బులుసు సాంబమూర్తిగారి పేర పంపబడెను.

* * *

ప. గోదావరి జిల్లా

ఆంధ్రరాష్ట్రీ రైతుసంఘము వారి ఆదేశానుసారం, యీనెల 12 వ తేదీ మొదలు 19 వరకూ ప. గోదావరి జిల్లాలో అనేక స్థలములందు రైతురక్షణ వారం జరిగెను. 16 వ తేదీని కామ్రేడ్ గారపాటి సత్యనారాయణ, జిల్లా రైతుసంఘ కార్యదర్శి పేటేటి వెంకటరత్నంగారు, ఏలూరునుంచి జయద్దేరి, జంగారెడ్డిగూడెం మీదుగా పోలవరం ఏజన్సీకి సంబంధించిన లక్ష్మీపురం చేరుకొన్నారు. సింగులూరి వెంకట్రామయ్యగారి అధ్యక్షత క్రింద జరిగిన రైతు సమావేశమునకు అయ్యవారి పోలవరం, ధర్మారావుపేట మొదలైన చుట్టుపట్ల గ్రామాల నుంచి సుమారు 350 మంది రైతులు, కూలీలు వచ్చిరి. సభలో ప్రకాశం కమిటీ రిపోర్టును గురించి వారికిచెప్పి, రాష్ట్రీ రైతు సంఘం వారిచే ప్రకటింపబడిన తీర్మానాన్ని మదరాసు ప్రభుత్వానికి పంపబడెను. ఆరాత్రికి ధర్మారావుపేట గ్రామంచేరిరి, అక్కడ జిల్లా చిట్టెయ్యగారి అధ్యక్షత క్రింద బహిరంగసభ జరుపబడెను.

17 వ తేదీని గురజ పట్టెటుకు సంబంధించిన బొర్రంపాలెం; 18 వ తేదీని కొవ్వూరు తాలూకా లక్కవరం, గుంటుపల్లి గ్రామాలు; 19 వ తేదీని చింతలపూడి వెళ్ళి, బహిరంగ సభలు జరిపిరి. ప్రతిసభకు చుట్టుపట్ల గ్రామాల నుండి రైతులు వందలాదిగావచ్చి ఉత్సాహంతో పాల్గొనిరి. 19 వ తేదీని మధ్యాహ్నం 3 గంటలకు చింతలపూడి తహసిల్దారుగారి వద్దకు రైతు యాత్రను తీసుకొనివెళ్ళి, మెమొరాండములు దాఖలు చేసిరి.


పైవిధంగానే, జిల్లాబోర్డు మెంబరు గారగు సయ్యద్ అబ్దుల్లా సాహేబుగారు, చింతలపూడి తాలూకా రైతు సంఘాధ్యక్షులగు బర్మా పాపారావుగారు, చిలుకూరి వెంకటప్పారెడ్డిగారు, పులిపాటి శ్రీరాములుగారు వగైరాలు చింతలపూడి తాలూకాలో అనేక గ్రామాలకు వెళ్ళి ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరుస్తూ తీర్మానములు గావించి ప్రభుత్వానికి పంపించిరి.

ఏలూరు తాలూకాలో రంభా వెంకటప్పయ్య అన్నె వెంకటేశ్వరరావు, పసుపులేటి భుజంగరావు, చింతాడ రంగారావు గారలు వసంతవాడ సత్యవోలు, గోగుంట వగైరా గ్రామాలలో సంచారముచేసి, ప్రకాశం కమిటీ రిపోర్టుకు రైతుల ఆమోదాన్ని తీసుకొని, రాష్ట్ర రైతు సంఘం వారి సవరణలతో చట్టం ప్రవేశపెట్టవలసినదనే తీర్మానమును శాసన సభాధ్యక్షులకు పంపిరి.

* * *

రేపల్లె

రేపల్లె తాలూకాలో, రాంభోట్లపాలెం, చెరుకుపల్లి, పొన్నపల్లి అగ్రహారం, కనగాల, పెద్దవరం, గ్రామములయందు ప్రకాశం కమిటీ



మునగాల రైతు సభ

రిపోర్టును బలపరుస్తూ, రాష్ట్రీ రైతు సంఘం వారి సవరణలను ఆమోదిస్తూ సభలలో తీర్మానములు చేయబడెను. కామ్రేడ్స్ కంభంపాటి సత్యనారాయణ, బి. యస్ సి., బి. యల్., కూచిభొట్ల రామశాస్త్రి మొదలైనవారు ప్రచారములో పాల్గొనిరి.

* * *

నాగులూరు

మైలవరం (కృష్ణాజిల్లా) సమీపంలో ఉన్న నాగులూరులో 16 వ తేదీని జరిగిన సభకు చుట్టుపట్ల గ్రామాలనుంచి సుమారు 800 మంది రైతులు వచ్చిరి. శ్రీ పేటబాపయ్యగారు సభకు అధ్యక్షతవహించిరి. నండూరి ప్రసాదరావుగారి సుందర సూర్యనారాయణగారు సభలో ఉపన్యసించిరి, సభానంతరము ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరచుచూ తీర్మానించబడెను.

* * *

కృత్తివెన్ను జమీ

కృష్ణాజిల్లా, బందరు తాలూకా, కృత్తివెన్ను జమీలో చేరిన సంగమూడి, శీతనపల్లి, కుమాళ్ళపూడి గ్రామాలలో 11,12 తేదీల యందును; 13 వతేదీని పెదచెల్ల పాలెం (అధ్యక్షులు శ్రీ కృత్తివెంటి కృష్ణ భోగరాజుగారు) లోను; 14 వతేదీని పోడు గ్రామం (అధ్యక్షులు గుండం గవరయ్యగారు) లోను; 16 వ తేదీని నిడమర్రు గ్రామం (అధ్యక్షులు బొర్రా నెలబాలుడుగారు) లోను జరిగిన బహిరంగ సభలలో ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరచుచూ ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంవారి తీర్మానమును ఏకగ్రీవంగా ఆమోదించ బడి, అది ఎసంబ్లీ అధ్యక్షుని పేర పంపబడెను.

* * *

గుడివాడ తాలూకా

గుడివాడ తాలూకా, పాములపాడు గ్రామములో శ్రీ సూరపనేని గోపాలక్రిష్ణయ్యగారి అధ్యక్షత క్రింద 15-1-39 వ తేదీని జరిగిన బహిరంగ సభలో శ్రీయుత కావూరి మద్దిరామయ్యగారు, బి. ఏ., బి. యల్. కామ్రేడ్ సజ్జా బ్రహ్మయ్యగారు ప్రకాశం కమిటీ నివేదికను గూర్చి విపులముగా ఉపన్యసించిరి. రాష్ట్రీ రైతు సంఘమువారి సవరణలతో శాసనము చేయవలసినదని మదరాసు ప్రభుత్వంను కోరుచు తీర్మానింపబడెను.

ఇదేవిధముగా, దోసపాడు, పాములపాడు, మాలపల్లి, తంబలంపాడు, మోపర్రు, దూడల పాలగూడెం, రావులపాడు, మహేశ్వరపురం మొదలైన గ్రామాలలో కామ్రేడ్స్ సూరపనేని వెంకటశేషయ్య, సజ్జా రామబ్రహ్మం, కావూరి మద్దిరామయ్య, చిట్టా శ్రీమన్నారాయణమూర్తి గారలు సభలు గావించి, రాష్ట్రీ రైతుసంఘము వారి తీర్మానమునకు ప్రజల ఆమోదమునుబడసి శాసన సభాధ్యక్షునికి పంపిరి.

* * *

కాళహస్తి తాలూకా

కందాడు, కోబాక, మోదుగుల పాలెం, ముసలిపేడు, మన్నసముద్రం, ఏర్పేడు, మేర్లపాక మొదలైన గ్రామాలలోని రైతులు కాటక పరిస్థితులవల్ల మిక్కిలి దీనావస్థలో ఉన్నప్పటికీ, నూతలపాటి మునుస్వామి నాయుడు మొదలైన రైతు సేవకుల నాయకత్వమున అత్యుత్సాహంతో ప్రకాశం కమిటీ నివేదికను బలపరచుతూ సభలలోపాల్గొని తీర్మానములు చేసి ప్రభుత్వమునకు పంపిరి.

కురుమద్దాలి

14-1-39 వ తేదీ సాయంత్రము కురుమద్దాలి గ్రామ సత్రం వద్ద శ్రీ యార్లగడ్డ కోటయ్యగారి యాజమాన్యమున జరిగిన రైతు సమావేశంలో ఆంధ్రరాష్ట్రీ రైతు సంఘము వారి సవరణలకు ఆమోదము తెలుపబడెను. సదరు తీర్మానమును శాసనసభాధ్యక్షునికి పంపబడెను.

* * *

ఇతర ప్రదేశములు.

నెల్లూరుజిల్లా, కోవూరు తాలూకా, ఇందుపూరు గ్రామంలో 15-1-38 వ తేదీని యరాబోలు రామచంద్రారెడ్డి గారి అధ్యక్షతను; బెజవాడ తాలూకా మైలవరంలో 17-1-39 వ తేదీని ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి చెలసాని వాసుదేవరావు గారి అధ్యక్షతను; గోతవరంలో 13-1-39 ని కామ్రేడ్ ఉదయగిరి వెంకటకృష్ణయ్యగారి అధ్యక్షతను; 14 వ తేదీని పెద్దాపురం (కృష్ణా) లో తాతినేని రామకోటయ్యగారి అధ్యక్షతను; తూర్పు గోదావరి జిల్లా, పోలవరం తాలూకా గోపవరం గ్రామములో 18 వ తేదీని గంగోలు ఎస్టేటు జమీన్ రైతు మహాసభ మేణి చిన సత్యనారాయణగారి అధ్యక్షతను; 18 వ తేదీని రామచంద్రపురం (కృష్ణాజిల్లా) లో కృష్ణాజిల్లా రైతు సంఘాధ్యక్షులైన శ్రీ కామినేని వెంకటప్పయ్యగారి అధ్యక్షతను జరిగిన రైతు సమావేశములకు వందలాదిగా రైతులు వచ్చి, పాల్గొనిరి. ఆంధ్రరాష్ట్రరైతు సంఘమువారు ప్రకటించిన తీర్మానము సభలలో ఏకగ్రీవంగా అంగీకరింపబడి, మదరాసు శాసన సభాధ్యక్షులకు పంపబడెను.

* * *

ఒంగోలు తాలూకా రైతు రక్షణయాత్ర

రావర్ల, మాచవరం, కనుపర్తి, పెదగంజాం వగైరా ఒంగోలు తాలూకా గ్రామాల నుంచి 200 మంది రైతులు సుమారు 15 మైళ్ళ కాలినడకను కామ్రేడ్ జయరామనాయుడుగారి నాయకత్వమున 19-1-39 వ తేదీ సాయంత్రము 3½ గంటలకు ఒంగోలుచేరి. "ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరచండి?" "కొమ్మమూరు ప్రాజెక్టును నిర్మించాలి!" మొదలైన నినాదాలతో పురవీధులంతా తిరిగారు. ఇతర గ్రామాలనుంచి వచ్చిన జమీన్ రైతులు మరొక 200 మంది వారితోచేరిరి. ఊరేగింపు ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటలకు సబ్‌కలెక్టరు గారి ఆఫీసు చేరుకొనిరి. ఊరేగింపులో శ్రీమతి భారతి రంగా, బాదిన సుబ్బారావు, జయరామనాయుడు, నాగినేని వెంకయ్య, డి. కామేశ్వరరావు గారలు పాల్గొనిరి.

శ్రీ ప్రకాశంగారి రిపోర్టును బలపరచుచూ రాష్ట్రీ రైతు సంఘమువారి సవరణలతో చట్టం గావించ వలసినదనియు; అన్ని ప్రాంతాలలోను శిస్తు సగానికి తగ్గించవలెననీ; కొమ్మమూరు ప్రాజెక్టును వెంటనే నిర్మించవలెననీ; ప్రభుత్వ శాఖలలో లంచగొండి తనమును నిర్మూలించే ఏర్పాటు చేయవలసినదనీ మదరాసు ప్రభుత్వాన్ని కోరుతూ మెమొరాండములు యివ్వబడెను.

సాయంత్రం శ్రీమతి భారతి రంగాగారి అధ్యక్షత క్రింద బహిరంగసభ జరిగెను.

కారల్ లిబ్‌నెక్ జీవిత చరిత్ర.

"జర్మను కృత్రిమ దేశాభిమానుల నెదిరించిన సోషలిస్టు ఇతడొక్కడే!"

—లెనిన్.

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ, ఎం. ఏ.

"రీచ్‌స్టాగ్ (జర్మన్ పార్లమెంటు)లోఉన్న 111 గురు సోషల్ డెమాక్రటిక్ పార్టీ మెంబర్లలో ఒక్కడు మాత్రం (ఒక్కడే సుమండీ!) నిజమైన సోషలిస్టు ననిపించుకున్నాడు. అతడే కామ్రేడ్ కార్ల్ లెబ్‌నెక్. యుద్ధంలో ప్రభుత్వానికి ఋణం కావలని వచ్చినప్పుడు, అక్కరలేదని వ్యతిరేకించి, తన సామాన్య ధర్మాన్ని నిర్వర్తించినవాడు యీతడొక్కడే. జర్మన్ సోషల్ డెమాక్రటిక్ పార్టీ నాయకులలో ద్రోహుల్నీ, కృత్రిమ దేశాభిమానుల్నీ, వ్యతిరేకించిన సోషలిస్టు యీతడొక్కడే."

— లెనిన్

లెబ్‌నెక్ 1871 లో జన్మించాడు. జర్మనీలో పరిశ్రమలు అతివేగంగా వృద్ధి చెందుతూన్న రోజులవి. ఫ్రాన్సు-జర్మనీ యుద్ధంలో జర్మనీ జయించడంవల్ల, ఆదేశపు పెట్టుబడి పూర్వం కంటె ఎక్కువయింది. బ్రిటిష్-ఫ్రెంచి-అమెరికన్ పరిశ్రమలతో జర్మనీ పోటీ చేయడము ప్రారంభించింది. దక్షిణ అమెరికాలోనూ, ఆఫ్రికాలోను, చైనాలోను, దగ్గర ప్రాచ్యదేశాలలోనూ, జర్మనీకి యిదివరకే అనేక భూప్రదేశాలున్నాయి. ఇప్పుడు వాటిని పూర్వం కంటె వేగంగా వృద్ధిచేయ నారంభించింది. వాటిని కాపాడుకోవటానికి, కొత్తరాజ్యాలు సంపాదించుకోవటానికి, జర్మనీ బలమైన ఆయుధ నిర్మాణ కార్యక్రమంలో దిగవలసి వచ్చింది.

ఇతర సామ్రాజ్యవాద దేశాలతో జర్మనీ చేస్తూన్న పోటీలో ఓడిపోకుండా ఉండడానికే యీ విపరీతమైన యుద్ధసన్నాహాలన్నీ. ఈవిధంగా ప్రపంచ శాంతిని భగ్నమొనర్చడానికి సన్నాహాలు చేస్తూన్న జర్మనీ ప్రభుత్వాని కెదురుగా నిలబడ్డాడు, కార్ల్ లెబ్‌నెక్. జర్మనీ కార్మికుల్లో ప్రవేశించాడు. "కార్మిక యువజన సమితి" నొకదాన్ని స్థాపించాడు. ప్రజలలో తీవ్రమైన యుద్ధప్రతికూల ప్రచారం సాగించాడు. ఇతడు జర్మనీ ప్రభుత్వానికి ప్రక్కలో బల్లెంగా తయారయ్యాడు. యుద్ధప్రతికూల ప్రచారానికై 1909 లో లెబ్‌నెక్‌ను పోలీసులు అరెస్టు చేసారు. విచారణానంతరం 1½ సంవత్సరాల జైలుశిక్ష విధించబడింది.

సోషల్ డిమాక్రటిక్ పార్టీ.

అప్పటి జర్మన్ యువజనోద్యమం సోషల్ డెమాక్రటిక్ పార్టీయొక్క మితవాద నాయకుల స్వాధీనంలో ఉండేది. ఈ పార్టీయొక్క ఆశయం సోషలిస్టు సమాజస్థాపన. పార్లమెంట్లలో మెజారిటీ సంపాదించి, చట్టసమ్మతమైన పద్ధతులతో యీ ఆదర్శాన్ని చేర్చవచ్చునని వారు విశ్వసిస్తారు. లెబ్‌నెక్ కూడా ఆ పార్టీలో సభ్యుడు. 1906 లో సమావేశమైన జర్మన్ డెమాక్రటిక్ పార్టీలో లెబ్‌నెక్ ఒకతీర్మానాన్ని ప్రతిపాదించాడు. 144 గురు డెలిగేట్లు అతన్ని బలపరిచారు. దేశం అంతటా తీవ్రమైన యుద్ధప్రతికూల ప్రచారాన్ని సాగించాలి అని ఆతీర్మానసారాంశం. కాని, పార్టీలో మితవాదుల ప్రాబల్యం ఎక్కువగా ఉండడంవల్ల, ఆ తీర్మానం ఓడిపోయింది. అప్పటినుంచి లెబ్‌నెక్ మితవాదుల పలుకుబడిలో ఉన్న పార్టీమెంబర్లను నిజమైన సోషలిస్టు పంథాకు తీసుకురావడానికై తీవ్రమైన ప్రయత్నాలు సాగించాడు. "యుద్ధసన్నాహము-యుద్ధ ప్రతికూలత" అనే పుస్తకం 1907 లో రచించాడు. దీని ప్రభావం పార్టీ మెంబర్లలో చాలామందికి కలిగింది. ఈ పుస్తకంలో లెబ్‌నెక్ సామ్రాజ్యవాద యుద్ధాలకు కారణాలేవో స్పష్టీకరించాడు. పెట్టుబడిదార్ల లాభాలు వృద్ధిపొందడానికై కాలనీలు పారిశ్రామికంగా వెనుకబడియున్న భూభాగాలు ఏవిధంగా అవుసరమవుతాయో, అవి సంపాదించడానికి ఇతర పెట్టుబడిదారీ ప్రభుత్వాలతో ఏ విధంగా యుద్ధం చేయవలసివస్తుందో వివరంగా తెలియచేసాడు. సామ్రాజ్యవాద యుద్ధాలవల్ల పేద కార్మికులకు ఏవిధంగా నష్టమో ఋజువు చేసాడు. అంతర్జాతీయ కార్మికవర్గంలో కలతలు పుట్టించి, వారి అయికమత్యాన్ని చెడగొట్టే సామ్రాజ్యవాద యుద్ధాలలో ప్రజాసామాన్యం ఎవరూ పాల్గొనకూడదని ఆపుస్తకంలో హెచ్చరించాడు.

1912 లో లెబ్‌నెక్ మొట్టమొదటిసారి రీచ్‌స్టాగ్ (జర్మనీ పార్లమెంటు)లో సభ్యుడుగా యెన్నుకోబడ్డాడు. వివిధ దేశాలలో అప్పుడు జరుగుతూన్న భయంకర యుద్ధ సన్నాహాలను గురించి అతడు రీచ్‌స్టాగ్‌లో బట్టబయలు చేసేవాడు. తీవ్రమైన యుద్ధ ప్రతికూల ప్రచారము కొరకు రీచ్‌స్టాగ్‌ను ఉపయోగించుకొనేవాడు.

ప్రపంచ యుద్ధం

జులై 1914 లో ప్రపంచ యుద్ధం ప్రారంభమైనది. వెంటనే లెబ్‌నెక్ దేశమంతటా సంచారముచేసి, ప్రజలెవరూ ముఖ్యంగా కార్మికులు యుద్ధంలో పాల్గొనవద్దని ప్రచారము చేశాడు. ఫ్రాన్సు మొదలైన విదేశాలకువెళ్ళి అక్కడి కార్మికులను కూడా జర్మనీ కార్మికులకు సహాయపడ వలసిందంటూ ప్రచారము చేశాడు.

లెబ్‌నెక్ తిరిగి స్వదేశానికి చేరుకొనేటప్పటికి రీచ్‌స్టాగ్‌లో మెంబర్లుగావున్న సోషల్ డెమాక్రటిక్ పార్టీకి చెందిన "దేశాభిమాను" లందరూ ప్రభుత్వానికి కావలసిన ఋణమివ్వడానికి తీర్మానించుకున్నారు. క్లిష్టపరిస్థితిలో ఉన్న తమ "మాతృదేశా"నికి సహాయంచేసితీరాలని కొందరు వాదించారు. ఆత్మరక్షణకు మాత్రమే జర్మనీ యుద్ధంలో పాల్గొంటే సహాయం చేస్తాం, అంటూ ఇతరులు వాదించారు. పార్టీ సమావేశంలో మూడురోజులు ఘాటైన చర్చ జరిగింది. ఆఖరికి, ఋణమివ్వడానికే అధిక సంఖ్యాకులు తీర్మానించారు. 78 వోట్లు అనుకూలంగాను 14 వ్యతిరేకంగాను వచ్చాయి. అల్పసంఖ్యాకులైన 14 గురు రీచ్‌స్టాగ్‌లో కూడ వ్యతిరేకంగా వోటు చేయవలసిందని లెబ్‌నెక్ మిగిలిన 13 గురికీ సూచించాడు. కాని వారందుకు ఒప్పుకోలేదు. పార్టీయొక్క ఐక్యతను కాపాడాలని వారందరూ పట్టుపట్టారు. వెంటనే లెబ్‌నెక్ పార్టీనుండి వేరుకావలసిన అవసరాన్ని గుర్తించి యుండవలసింది. కాని అతడట్లు చేయలేదు. పార్టీ ఐక్యతయే ప్రధానమనుకొని, లెబ్‌నెక్ కూడ వారిలో కలిసిపోయాడు.

డిశెంబరు 1914 లో తన పొరపాటును గ్రహించ గలిగాడు. ప్రభుత్వానికి ఋణం మళ్ళీ అవసరమైనది. రీచ్‌స్టాగ్‌లో చర్చమళ్ళీ ప్రారంభమయినది. లెబ్‌నెక్ తన పార్టీ మెంబర్లతో విడిపోయి, ఒక్కడూ వ్యతిరేకంగా ఓటు చేశాడు.

వెంటనే లెబ్‌నెక్ ప్రజా సామాన్యంలో పని చేయడం ప్రారంభించాడు. రహస్యమైన ఒక ప్రజా వుద్యమాన్ని లేవ తీశాడు అనేక కరపత్రాలు రహస్యంగా అచ్చు వేయించి, కార్మికులలోను సిపాయిలలోను పంచి పెట్టించాడు. ప్రజలలో యితనికి గల విపరీతమైన పలుకుబడి వల్ల ప్రభుత్వం ఎరస్టు చేయలేదు. ఇతని యుద్ధ ప్రతికూల ప్రచారాన్ని గురించి సోషలు డెమాక్రటిక్ పార్టీ నాయకు లంతా "దేశద్రోహం" "మాతృద్రోహం" అని ఖండించారు. జనవరి 1915 లో జరిగిన పార్టీ మహాసభలో లెబ్‌నెక్ సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చవలసిన అవసరాన్ని గురించి గంభీరమైన ఉపన్యాస మిచ్చాడు. కాని యెవరూ ఇతన్ని లెక్క చేయలేదు.

లెబ్‌నెక్ తీవ్రరాజకీయాల్లో పాల్గొనకూడదని జర్మనీ ప్రభుత్వం ఫిబ్రవరి 1915 లో ఒక ఉత్తరువు జారీచేసింది. కాని లెబ్‌నెక్ తన కరపత్రాలు అచ్చువేయించి జర్మనీ సిపాయిలలోను, కార్మికులలోను పంచిపెట్టాడు. ఈ యుద్ధంలో పాల్గొంటున్న ప్రజలకు నిజమైశత్రువులు తమ దేశంలోనే ఉన్న ధనికవర్గపుప్రభుత్వాలు, జర్మనీ ప్రజలకు నిజమైన శత్రువు తమ ధనాఢ్యప్రభుత్వమే. ఫ్రెంచి ప్రజలుగాని, బ్రిటిష్ ప్రజలుగాని, కాదు. కాబట్టి, జర్మనీ ప్రజలు తమ ప్రభుత్వాన్ని, రాజకీయ పోరాటంలో, పడగొట్టాలి. ఇతరదేశాలలో కూడ తమ విముక్తికై పాటుపడే కార్మిక వర్గం జర్మనీ కార్మికుల సహాయంచేసి తీరుతుంది." అంటూ ఆ కరపత్రాలలో వ్రాసేవాడు.

రీచ్‌స్టాగ్ సభలు జరిగేటప్పుడు లెబ్‌నెక్ ప్రభుత్వ సభ్యుల్ని అనేక ప్రశ్నలు నడుగుతూ, వారిని నానా అవస్థలుపెట్టేవాడు. పార్టీసభ్యులు యితనివైపు సురసురచూచేవారు. కాని, బయటి ప్రజాసామాన్యం యితన్ని మెచ్చుకొనేది.

యుద్ధప్రతికూల మహాసభ.

సెప్టెంబరు 1915 లో మొదటి అంతర్జాతీయ మహాసభ జిమ్మర్‌వాల్డ్‌లో జరిగింది. దానికి లెబ్‌నెక్ పంపిన సందేశంలో యీ వాక్యాలున్నాయి.

"మిత్రులారా! సమస్త దేశాలకు చెందిన సోషలిస్టులారా! దొంగ సోషలిస్టు లెవరో కనిపెట్టుటకు మీ రు జంకుగొంకులు లేకుండా ప్రవర్తించాలి. కపటవేషధారుల్ని, జర్మనీ దేశస్థులైనా సరే నిర్దాక్షిణ్యముగా ఖండించివేయాలి... నా ఫ్రెంచి సోషలిస్టు మిత్రులకు నా హెచ్చరిక ఏమంటే, జాతీయ ఐక్యతఅనే శబ్దానికే గాకుండా, పార్టీ ఐక్యతఅనే ప్రమాదకరమైన మాటకు కూడా మీరు లోబడవద్దు."

ఎరస్టు, జైలు శిక్ష.

12-1-1916 వ తేదీని లెబ్‌నెక్‌ను సోషల్ డెమాక్రటిక్ పార్టీ నాయకులు పార్టీనుంచి తొలగించారు. పోలీసులు అతన్ని ఎరస్టు చేయడానికి ఈవిధంగా సులభమైంది. ఏప్రిల్‌లో మళ్ళీ ప్రభుత్వం ఋణం యివ్వాలంది. రీచ్‌స్టాగ్‌లో తీర్మానం మళ్ళీ ప్రతిపాదించబడింది. ఈసారి 18 గురు పార్టీ సభ్యులు వ్యతిరేకంగా వోటు చేశారు. లెబ్‌నెక్ యివ్వదలచుకొన్న ఉపన్యాసానికి ప్రభుత్వం అనుమతించలేదు. తక్షణం అతడు బయటికి నడిచివచ్చాడు. మే 1వ తేదీని బ్రహ్మాండమైన ఒక కార్మిక ప్రదర్శనానికి సన్నాహాలు ప్రారంభించాడు. ఆరోజు సాయంత్రము సుమారు 10 వేలమంది కార్మికులు యుద్ధ ప్రతికూల ప్రదర్శనంలో పాల్గొన్నారు. పోలీసులకు కార్మికులకు ఆరోజున అనేకచోట్ల పోరాటాలు జరిగాయి.

ఈమే దినోత్సవంనాడు కార్మికుల ప్రదర్శనములో పాల్గొన్నందుకు లెబ్‌నెక్‌ను పోలీసులు ఎరస్టు చేసారు. 4 సంవత్సరముల జైలు శిక్ష విధించబడింది. జులైలో మరికొందరు నాయకుల్ని కూడా ప్రభుత్వం ఎరస్టుచేసి, శిక్షలు విధించింది. ఈ నిర్బంధ విధానం వల్ల జర్మన్ కార్మికోద్యమం పూర్వంకంటె విజృంభించిందేగాని, ప్రభుత్వం అనుకున్నట్లు ఆగిపోలేదు. లెబ్‌నెక్ యొక్క విడుదలకై వారు దేశంలో జరిపిన తీవ్రాందోళనవల్ల, అతన్ని రెండు సంవత్సరాల అనంతరం, అక్టోబరు 1918 లో, జైలునుంచి విడుదల చేసింది. అప్పుడే బయలుదేరిన రష్యా విప్లవ జ్వాలలు లెబ్‌నెక్‌ను ఉత్సాహపూరితుడ్ని చేశాయి. జర్మన్ కార్మికులు కూడా తమ రష్యన్ సోదరులు మాదిరిగానే ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవాలనే నినాదం యిచ్చాడు. 9-11-1918 వ తేదీని కొద్దిమంది నావికదళంతో అతడు జర్మన్ రాజమందిరాన్ని ముట్టడించి, విప్లవం ప్రకటించాడు. రెండు రోజుల తరవాత బెర్లిన్ కార్మికుల యొక్క, సిపాయిల యొక్క, సోవియట్ సమావేశం అయింది.

కమ్యూనిస్టు పార్టీ స్థాపన.

ఈ ప్రజాతంత్ర విప్లవాన్ని త్వరలో కార్మిక విప్లవంగా మార్చే యేర్పాట్లు చేయాలంటూ స్పార్టకస్‌సమితి (లెబ్‌నెక్ స్థాపించిన రహస్య సంస్థ) నిశ్చయించింది. కాని, యీ ప్రయత్నం కొనసాగాలంటే, అనుభవం కలిగిన ఒక చక్కని రాజకీయ పార్టీ అవసరం. 1871 లో ప్యారిస్ కమ్యూన్ పరాజయానికీ, 1905 లో రష్యాలో బయలుదేరిన మొదటి విప్లవం భగ్నం కావడానికీ గల కారణాలలో ఒకటి అట్టి పార్టీ లేకపోవడమే. ఇప్పుడు జర్మనీలో కూడా యీ లోపమే కనపడింది. లెబ్‌నెక్ యీ సూత్రాన్ని గ్రహించ లేకపోయాడు. ఇంతేగాక

(మిగతా 22 వ పేజీలో)

యూరపులో ఫాసిస్టుల విలయ తాండవం

ఛాంబర్లేను దలదీరులు పట్టిన కుందేటికి మూడేకాళ్లు!

ఈవారము వార్తలు శాంతికోసం పనిచేసే వారికి నిరుత్సాహ జనకంగా ఉన్నాయి.

స్పెయిను.

విద్రోహసేనల దాడికి, ఫ్రాంకోకు ఇటలీ జర్మనీలు సరఫరా చేసిన విమానాలు, మరఫిరంగులకు, టర్రగోనా, రుయూస్, వల్లాస్ పట్టణాలు పడిపోయాయి. ఈ నెల 16 వ తారీఖున విద్రోహులవశమయ్యాయి. మాడ్రిడ్ రంగాన ప్రభుత్వసేనలు మరిరెండు స్థలాలలో శత్రుసేనలపై దుమికాయి. శత్రుసేనలు బార్సిలోనాపై సాగడముమాని, ఈదాడిని ఎదుర్కొనడానికి వెనుతిరుగుతారేమో అనిఆశ. అదివట్టి అడియాసయయ్యింది. ఫ్రాంకో సేనలు బార్సిలోనా నగరము వైపు సాగుతూనే ఉన్నాయి.

బార్సిలోనాలో శత్రుసేనల మరఫిరంగుల మ్రోతలు వినబడుతూ ఉన్నాయి. అయినా ప్రజలు భయపడుటలేదు. బార్సిలోనాలో ఎచ్చట చూచినా నోటీసులు గోడలమీద అంటించబడి ఉన్నాయి. ప్రతివాడు దేశస్వాతంత్ర్య రక్షణకోసం ఆయుధాలు ధరించి ముందుకు రావాలని అవి ఉద్బోధిస్తూ ఉన్నాయి. "ఆఖరిమనిషి ఉండేవరకు, ఆఖరిగుండు ప్రేలేవరకు యుద్ధము సాగించాలి" "కాటలోనియా ఎప్పటికీ ఇటలీకి లోబడదు" అనే నినాదాలతో పట్టణమంతా మారుమ్రోగిపోతూఉంది. స్త్రీలు పట్టణములో వీధివీధి తిరుగుతూ, "కాటలోనియాను ఒక కోటగా చేయండి" "కాటలోనియా రక్షణకోసం చనిపోయేవరకు యుద్ధముచేయండి" అనే వినాదాలతో ప్రతిధ్వనింప జేస్తున్నారు. సైన్యములో చేరడానికి పురుషులు వెళ్ళుతూ ఉంటే వారిస్థానాన ఫ్యాక్టరీలలో పనిచేయడానికి స్త్రీలు మూగిపోతున్నారు.

ప్రభుత్వసేనల ధైర్యము పట్టుదల విదేశ సైనిక నిపుణులకు ఆశ్చర్యము కలుగజేస్తూ ఉంది. విద్రోహులకుండే అత్యధిక విమానాల ముందు, మర ఫిరంగుల ముందు, టాంకుల ముందు వీరి ధైర్యమును సాహసమును చూచి చకితులై పోతున్నారు.

ప్రభుత్వసేనలు ఇంత సాహసముతో పోట్లాడుతున్నా, విద్రోహుల ఆయుధాల ముందు వెనక్కి పోవలసి వస్తూఉంది. జనవరి 21 వ తారీఖునకు, సముద్రతీరానఉన్న వెంద్రిల్లా పట్టణము ఫ్రాంకో సేనల వశమయింది. కాటలోనియాకు మధ్యనున్న సిరివిరా పట్టణాన్ని ఫ్రాంకో సేనలు పట్టుకొని, మరిరెండు రోజులకే బార్సిలోనాకు 33 మైళ్ళ దూరముననున్న ఇగల్డా అనే పట్టణాన్ని కూడ ఆక్రమించుకున్నారు. బార్సిలోనాకు 25 మైళ్ళ దూరములో నున్న డెల్‌పాండిస్ పట్టణమునుకూడ ఆక్రమించుకున్నారు. ఈవారము పూర్తిగాక మునుపే బార్సిలోనా పట్టణాన్ని చుట్టుముట్టుతారు.

అయినా, ప్రభుత్వము తమ వాగ్దానాలను భగ్నము చేయడములేదు. యుద్ధరంగానికి ప్రతిమనిషినీ పంపిస్తూ ఉన్నప్పటికీ ఇంటర్నేషనలు బ్రిగేడులోని ఇంకను స్పెయినులో ఉన్న మూడు వేలమందిని ఫ్రాన్సుకు పంపించి వేస్తున్నారు. వారిని సాగనంపుతూ, స్పెయిను ప్రధాని నెగ్రిన్ ఈలాఅన్నాడు. "నేడు యుద్ధములో చాల క్లిష్టదశను, ఎదుర్కొనుచున్నాము. కాని మేము లొంగిపోము."

బార్సిలోనాకు 20 మైళ్ళ దూరములో శత్రుసేనలు వచ్చిపడుతూ ఉన్నను, ప్రభుత్వ సేనలు నిరుత్సాహ పడడములేదు. భయపడడము లేదు. బార్సిలోనాలో సంగీత కచ్చేరీలకు మామూలుగనే టిక్కెట్లు అమ్ముతున్నారు.


హిట్లర్

విదేశ వాలంటీర్లు, స్పెయినునుండి వెళ్ళినదిలేనిదీ పరీక్షించడానికి పంపబడిన నానాజాతి సమితియొక్క ఒక ఉపసంఘము, ప్రభుత్వము తరపున ఈరోజు ఒక్క విదేశ వాలంటీరుకూడ యుద్ధము చేయుటలేదని ప్రకటించింది. లీగు కౌన్సిలులో, స్పెయిను విదేశాంగ మంత్రి, జర్మనీ ఇటలీలు, ఈమధ్య విరివిగా విమానాలను, సైన్యాన్ని పంపుతూ ఉన్నట్లు రుజువులతో సహా నిరూపించాడు.

ఫ్రెంచి పార్లమెంటులో బ్లూం (సోషలిస్టు పార్టీ నాయకుడు) తటస్థ విధానాన్ని మానుకోవాలి. స్పెయిను ప్రభుత్వానికి ఆయుధాలు అమ్మాలి అని వాదించాడు. కాని ఫ్లాండిను, (మితవాది.) స్పెయినులోఎవరుగెలిచినా ఫ్రాంసు లక్ష్యము చేయాలసిన అవసరము లేదన్నాడు. ముసోలినీ చేసింది తప్పయినా స్పెయినులోని అంతర్యుద్ధములో పాల్గోవడము మహా నేరమన్నాడు ఫ్రెంచి విదేశాంగ మంత్రి బోనెట్, తటస్థ విధానాన్ని మానుకోమని ప్రకటించాడు.

ఇంగ్లండులో, లేబరుపార్టీ, ట్రేడు యూనియను కాంగ్రెసు వెంటనే స్పెయినుకు ఆయుధాలు పంపవలసినదిగ ప్రభుత్వాన్ని కోరాయి. లేబరుపార్టీ నాయకుడు అట్లీ పార్లమెంటును వెంటనే సమావేశపర్చ వలసినదిగా కోరాడు. కాని ఛాంబర్లేను నిరాకరించాడు. ఇప్పుడు స్పెయిను ప్రభుత్వానికి ఆయుధాలు పంపడము


దలదీర్

ప్రపంచయుద్ధాన్ని రగుల్గొల్పడమేనని ప్రకటిస్తూవున్నాడు. ఒకవైపు జర్మనీ, స్పెయిను అట్లాంటిక్ తీరానఉన్న పాసిజో, బిల్బోవా, వీగో, గాలిసియా రేవు పట్టణాలలోనూ, కానరా దీవులలోని రేవులలోనూ సబ్‌మేరైను కేంద్రాలు నెలకొల్పుతూ వుంది. స్పెయినులో విట్టోరియా నుండి ఆఫ్రికా ఖండంలోని స్పానిష్ మొరాకో వరకు విమాన మార్గాన్ని జర్మనులు ఏర్పరుస్తున్నారు. వీని అన్నింటి వలన ఆసియాకు, దక్షిణమెరికాకువెళ్లే సముద్రమార్గాల నన్నింటిపై జర్మనీ తన అధికారము చెలాయించడానికి ఏర్పాట్లు చేసుకోవడము బ్రిటిషు సామ్రాజ్యానికి వినాశకరమైనా, ఫాసిస్టుల పతనమునకు భయపడే ఛాంబర్లేను, దలదీరులు మాత్రము తమ విధానాన్ని మార్చుకోవడము లేదు.


దలదీరు డంబాలకు మాత్రము అంతులేదు. ఫ్రాంసు అపాయస్థితిలో ఇరుక్కోదట! కాని ఇతరులకు తనదేమీఇవ్వదట! దేశములో అన్నిటికన్న ప్రధానమైనది జాతీయరక్షణ యట! స్పెయినులోగాని, బాలరిక దీవులలోగాని స్పానిష్ మొరాకో తీరానగాని, ఇటలీ దేశస్థులు శాశ్వితముగా అధికారము చెలాయించరట!

స్పెయిను ప్రభుత్వానికి ఆయుధాలు పంపాలని ఫ్రాంసులో సోషలిస్టులు, కమ్యూనిస్టులు తీవ్ర ఆందోళన సాగిస్తూ ఉన్నారు. దానికి ఎచ్చట లొంగిపోతుందోఅని, ఫ్రాంసు ప్రభుత్వాన్ని బెదరించడానికి ఇటలీపత్రికలు ఫ్రాంసును తిట్టి దుమ్మెత్తి పోస్తున్నాయి. ఫ్రెంచిప్రభుత్వం స్పెయినుకు ఆయుధాలు పంపించడానికి నిశ్చయిస్తే, ఫ్రాంకోను గెలిపించడానికి ఇటలీ ఇంకను సైన్యాన్ని, ఆయుధాలను పంపించవలసి వస్తుందని బెదరిస్తూ ఉన్నాయి. ముసోలిని భావాలు ప్రతిధ్వనింప జేసే గైడా ఈవిధంగా బెదరించాడు:— ఫ్రాంసు, ఇటలీల మధ్య వ్యవహారాలు పూర్తిగా చెడిపోయాయి. కేవలము ఒడంబడికల విషయమేగాదు ఈ రోజు ఈ తగాదాకు కారణము. ఇటలీయొక్క జాతీయగౌరవానికి నష్టము కలిగేటట్లు ఫ్రెంచి వ్యవహారాలు సాగుతున్నాయి, ఇటలీ తన జాతీయగౌరవాన్ని కాపాడుకోడానికి, అవసరమయితే ఆయుధాలను ఉపయోగించడానికి వెనుదీయుదు."

గత ప్రపంచ యుద్ధములో ఇటలీసైనికులకు ఫ్రాంసు ప్రభుత్వమిచ్చిన యుద్ధ మెడల్సును తిరిగి ఫ్రాంసుకు పంపించివేస్తున్నారు. కారణం ఫ్రెంచిపత్రికలు ఇటలీ సైనికులను అగౌరవపరుస్తూవ్యాసాలు ప్రకటించాయట. ఒక ఇటలీపత్రిక ఈలా వ్రాస్తూ ఉంది. అడవి జంతువులు తమ లోపుత్సాహాన్ని, ఉద్రేకాన్ని పెంపొందింపజేసుకోడానికి తమ తోకతో దేహాన్ని బాదుకొంటాయి. అదేరకంగా ఫ్రెంచిపత్రికలుకూడ ఇటలీసైనికుల యుద్ధ నిపుణతగూర్చి అవమానకరములగు వ్యాసాలు వ్రాస్తున్నాయి. ఈబెదరింపు చూచి ఎవరూ మోసపోరు. అడవిమృగము ఎంత పిరికిదో, ఫ్రెంచిదేశస్థులుకూడ అంత పిరికిపందలే." మరియొక పత్రిక "ఫాసిస్టు పిడికిదిపోటుతో ఫ్రాంసు త్వరలోనే తెలివితేటలు తెచ్చుకుంటుంది." అని వ్రాసింది.

జపాను : చైనా

బ్రిటిషు ప్రభుత్వం, జపానుప్రభుత్వానికి ఒక హెచ్చరికను పంపింది. చైనాలో రాజ్యాధికారం కోరమని ఇదివరకు జపాను ప్రధానిగా ఉండిన కోనాయి తెలియజేశాడు. కాని తమ ఆర్థిక, రాజకీయ విజ్ఞాన జీవితాన్ని జపాను అధికారానికి అప్పగించునట్లు, జపానుప్రభుత్వము చైనా ప్రజలపై సైన్యాధికారాన్ని వినియోగించి నిర్బంధిస్తూ ఉంది. యుద్ధము చేస్తూఉంది. చైనాలో జపానుసేనలను, కాల నిర్ణయము లేకుండ నిలుపుతున్నామని జపాను ప్రకటనలే



తెలియజేస్తూఉన్నాయి, ఇన్నర్ మంగోలియాను చైనానుండి విడదీసి పూర్తిగా జపాను సైనికాధికారముక్రింద ఉంచెదమని ప్రకటించియున్నారు. ఈ చర్యలన్నీ కోనాయి ప్రకటనకు విరుద్ధమని బ్రిటిషు ప్రభుత్వము తెలియ జేసింది. అంతేగాక 9 రాజ్యాలు కలసి చేసికొనిన ఒడంబడికను ఏ ఒక్క దేశమూ రద్దుచేయడానికి వీలులేదు. సైనికబలాన్ని ఉపయోగించి తెచ్చిన మార్పులను బ్రిటిషు ప్రభుత్వము గుర్తించదట, కాని ఏమైనా సూచనలు జపాను ప్రభుత్వము చేస్తే వానినిగూర్చి సంప్రదింపులు జరుపుదామందట! చైనాలో అన్నిదేశాలు సమంగా వర్తకవ్యాపారాలు చేసుకోడాని అవకాశమున్నంతకాలము, చైనాప్రజలస్థితి రోజురోజుకు అభివృద్ధి చెందుతూ ఉండినది. వారు ఒక సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పరచుకొంటూ వచ్చారు. ఇవన్నీ జపానుదాడితో భగ్నమయ్యాయట.

ఫ్రెంచి ప్రభుత్వంకూడ, జపానుకు ఒక హెచ్చరికను పంపినది. ఒడంబడికలను ధిక్కరిస్తే ఊరుకోమని, కాని ఒడంబడికలలో ఏమైనా మార్పులు కావలసివస్తే, సంప్రదింపులు చేయడానికి తాము తయారుగ ఉన్నామని ఆ హెచ్చరికలోని ముఖ్యాంశాలు.

జపాను విదేశాంగ మంత్రి అరిటా మరియొక పర్యాయము జపాను దృక్పధాన్ని తెలియజేశాడు: చైనాలో జపానుకు దేశము అవసరములేదట! చైనానుండి నష్టపరిహారముకూడ కోరుటలేదట! చైనాకు నష్టదాయకమైన ఎక్స్‌ట్రా టెరిటోరియాలటీ మొదలగు విదేశస్థులకు ఇవ్వబడిన ప్రత్యేక సౌకర్యాలను చైనానుండి బలవంతంగా లాక్కొన్నవానిని రద్దు చేయడానికి తాను చైనాకు సాయము చేస్తూఉందట! విదేశస్థులు చైనాలో వ్యాపారము చేసుకోడానికి అభ్యంతరాలు కల్గించడము తన ఉద్దేశముకాదు. కాని కొన్ని ముఖ్యస్థలాలలో, విదేశస్థుల హక్కులు కొంతవరకు తగ్గించక తప్పదు వానిపై అధికారము చెలాయించక తప్పదు. కాని, చైనాలో ఇంకను విదేశస్థులు వర్తక వ్యాపారము చేసుకోడానికి కావలసినంత విశాల ప్రదేశముంది దానిని అభివృద్ధి చేయడానికి విదేశస్థుల సహాయాన్నికూడ తాను అపేక్షిస్తూ ఉందట! దానినిబట్టి జపాను కోరేదంతా, చైనాగాని, విదేశ ప్రభుత్వాలుగాని, జపాను ప్రభుత్వము కోరినట్లు ప్రవర్తించుకోవాలనే కదా?

రష్యాను అరిటా తీవ్రంగా ఖండించాడు. చైనాలో యుద్ధము ఇంతకాలము సాగడానికి రష్యాయే కారణమన్నాడు, చైనాలోని గోరిల్లా యుద్ధానికి కూడ రష్యాయే కారణమన్నాడు ఫ్రెంచి, బ్రిటిషు ప్రభుత్వాలు చైనాకు ఆయుధాలు, ఇప్పటిలాగనే పంపుతూ ఉంటే తగిన చర్య తీసుకోవలసి ఉంటుందని కూడ బెదరించాడు.

లీగు ఆఫ్ నేషన్సు (నానాజాతి సమితి) సమావేశములో చైనా ప్రతినిధి వెల్లింగ్టన్‌కూ, జపాను మొదట ఆసియాను ఆక్రమించి పిమ్మట ప్రపంచ మంతటిపై అధికారము చెలాయించాలని చూస్తూ ఉందన్నాడు. జపానుకు విమానాలుకాని, పెట్రోలుకాని పంపకూడదన్నాడు. కాని లీగుచేసిన తీర్మానము చైనాకు ఏవిధంగా సహాయము చేయగల్గుతుందేమో విచారించడానికి, వివిధ లీగు దేశాలమధ్య సంప్రదింపులు సాగించాలని.

అమెరికా, బ్రిటను ఫ్రాంసులు జపాను యెడల తమ వ్యతిరేకతను హెచ్చరికలు పంపుటతో ముగిస్తూఉన్నాయి. ఈ నాటకాన్ని చూచే బెర్లిను పత్రికలు బ్రిటను, అమెరికాలను అపహసించుచున్నాయి. "బ్రిటనుగాని, అమెరికాగాని, జపానుకు వ్యతిరేకంగా చైనాకు సైన్యసహాయ మివ్వడానికి తయారుకాలేదని ఈ హెచ్చరికలబట్టే తేలుతూఉంది. బహుశః ఈరెండు దేశాలు ఇట్టి హెచ్చరికలు వ్రాయుటలో చాల నిపుణతను సంపాదించి ఉండవచ్చు. కాని జపాను మాత్రము, ఆచరణలో తమ విధానాన్ని సాగించడములో ఎక్కువ జయము పొందుతూంది".

అమెరికా పసిఫిక మహాసముద్రములోని 'గువాం' దీవులను విమానాశ్రయంగాను, నావికాశ్రయంగాను మార్చడానికి 50 లక్షల డాలర్లు ఖర్చు పెట్టడానికి నిర్ణయించింది. కాని జపాను అమెరికా యుద్ధ ప్రయత్నాలను చూచి తన విధానాన్ని మార్చుకోవడము లేదు. చైనాకు ముఖ్యపట్టణమైన చంకింగ్‌పై బాంబుల వర్షము కురిపించింది. 300 మందికి పైగా చనిపోయారట!

జపానును వ్యతిరేకించడానికి విదేశాలు సహాయము చేయకపోతే పోనీ! చైనాలోని వివిధ పార్టీలన్నా కలసి పోట్లాడుతాయా అని చూచినా, అచ్చటి స్థితికూడ అట్టే సంతృప్తికరంగా లేవు.

చాంగ్‌చున్‌మై అనే కుమింగ్‌టాంగ్ నాయకుడు చైనా ప్రభుత్వ పత్రికయైన "జనరల్ డెయిలీ న్యూస్" అనే పత్రికలో వ్రాస్తూ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మావిడంగును ఖండించాడు. కమ్యూనిస్టు సైన్యమునకు ప్రత్యేకంగా కమ్యూనిస్టులే నాయకులుగా ఉండకూడదట. ఈవరకు చైనా సోవియటుగా ఉండిన ప్రాంతాన కమ్యూనిస్టులు, చైనా ప్రభుత్వానికి లొంగియే ఒక ప్రజాతంత్ర రాజ్యాన్ని కొనసాగిస్తూ ఉంటే అదే పనికిరాదట!

అమెరికాలో నిరుద్యోగుల సహాయము కోసం ఏర్పాటు చేయబడ్డ కట్టడపు పనులకు కావలసిన 88 కోట్ల డాలర్లుకు, అమెరికను కాంగ్రెసు 72 కోట్లు మాత్రము గ్రాంటు చేసిరి.

హంగరీ, యుగోస్లేవియాల మధ్య రాజీ కుదర్చడానికి, ముందు ముందు రుమేనియానుకూడ తనతో కలసి ఆర్థిక రంగములో పని చేయునట్లు చూడడానికి ఇటలీ విదేశాంగ మంత్రి సియానో ప్రయాణ మవుతున్నాడు. యుగోస్లేవియాకు ప్రపంచ యుద్ధమయిన పిదప వచ్చిన హంగరీ దేశభాగాన్ని తిరిగి కోరకుండా హంగేరీని బుజ్జగిస్తాడట! యుగోస్లేవియాలోని హంగరీ దేశజాతివారికి ప్రత్యేక సౌకర్యాలు


ముస్సోలినీ

యుగోస్లేవియా ఇచ్చేటట్లు చూస్తాడట! ఈవిధముగా డాన్యూబ్ నది ఒడ్డునఉన్న దేశాలలో ఫాసిస్టు ఇటలీ, జర్మనీలు ప్రయత్నిస్తూ ఉన్నాయి.

పాలస్తైన్

పాలెస్టయిను అరబ్బు కమిటీకి చెందినవారు ముఫ్తీని కలిసికొని లండను కాన్ఫరెన్సుకు ఒక రాయభారవర్గాన్ని ఎన్నుకొన్నారు. వీరూ తదితర అరబ్బుదేశాల ప్రతినిధులు ఈజిప్టుకు ముఖ్యపట్టణమైన కెయిరోలో సమావేశమై తాము లండనుకు కాన్ఫరెన్సులో కోరవలసిన షరతులను నిర్ణయించుకుంటారు. పాలెస్టయిను అరబ్బు ప్రతినిధులు, అరబ్బు హైకమిటీవారు మాత్రమేనని బ్రిటిషు ప్రభుత్వము గుర్తించాలి. నైషిషిబీ పార్టీని గుర్తించరాదు. దీనికి బ్రిటిషు ప్రభుత్వము అంగీకరిస్తేనే లండను సమావేశములో పాల్గొంటామని వీరు ప్రకటించారు. నైషిషిబీ పార్టీవారు దానికి వ్యతిరేకంగా ఆందోళనచేస్తున్నారు.

సిరియాకు స్వాతంత్ర్య మిస్తూ చేసుకొన్న ఒడంబడికను ఫ్రాంసు ప్రభుత్వము వెంటనే అమలులో పెట్టాలని సిరియాలోని తాత్కాలిక ప్రభుత్వము కోరుతూ ఉంది. కాని దలదీరు ప్రభుత్వము అంగీకరించేటట్లు లేదు.

ఐర్లండులోని అలస్టరును తిరిగి ఐర్లండులో కలుపలేదని ఐర్లండు రిపబ్లికను పార్టీవారు బ్రిటనులోను, అలస్టరులోను, విద్యుత్యంత్రాలను భగ్నముచేయడానికి, బ్రిటిషు ఉన్నతోద్యోగులను చంపడానికి బాంబులువిసరడము ఆరంభించారు. అయినా బ్రిటిషు ప్రభుత్వము, అలెస్టరును ఐర్లండుతో కలిపే సూచనలు కనబడుటలేదు.


బ్రిటిష్ సింహానికి పట్టిన గతి

విజ్ఞానపుట

వస్తువుల మూలస్వరూపం ఏమిటి?

కామ్రేడ్ ప్రభల కృష్ణమూర్తి, బి. యస్‌సి., బి యల్.

శాస్త్రజ్ఞానం మానవ జీవితములో పెద్ద మార్పును తేగలుగుతుందని చాలమందికి తెలియదు. పాశ్చాత్య దేశాలలో నాగరితకు, అభివృద్ధికి ముఖ్య కారణము శాస్త్ర పరిశోధన పెంపొందుటయే. సృష్టిని, ప్రపంచాన్ని, మానవ జీవితాన్ని తర్కించి విమర్శ చేసే సిద్ధాంతా లన్నిటికి కూడ నిదర్శనము శాస్త్రములోనే వెదుకవలసి ఉన్నది. ప్రపంచము ఎవరిచేతనో సృష్టింపబడినది కాబట్టి ప్రపంచముతో సంబంధములేని శక్తి ఒకటి ఉన్నది అని మొట్టమొదట సిద్ధాంతులు తలిచారు. ఈ సిద్ధాంతము బాగుగా ప్రబలిన దినాల్లో ఇంకా శాస్త్రజ్ఞానము మిక్కిలిగా లేదు. మనుష్యులు కాని, జంతువులు కాని, వృక్షములు కాని, చివరకు వస్తువులు (ప్రాణము లేనివి)కాని పుట్టుట, పెరుగుట, అంతమగుట మనము ప్రత్యక్షముగా చూచుచున్నాము. మన కండ్లకు కన్పడే దృశ్యములను ఆధారములుగా తీసికొని ప్రతివస్తువునకు పుట్టుట, గిట్టుట అను అవస్థలున్నవి కాబట్టి ప్రపంచమునకు కూడ పుట్టుక యుండి తీరవలెననియూ, (ఆది సృష్టి అంటారు) గిట్టుటయుండవలెననియూ (ప్రళయము) వాదించడము మొదలుపెట్టినారు. ఈ సిద్ధాంతాన్ని పరిపరివిధాల తర్కించి వివిధ రకములయిన సిద్ధాంతాల్ని తయారుచేశారు. పాశ్చాత్య వేదాంతులు గాని, తూర్పు దేశాలలో వేదాంతులు గాని వేర్వేరు భాషలలో తమ వేదాంతం చెప్పినా, ముఖ్య సూత్రము మాత్రము పైన చెప్పినదే.

దీనికి విరుద్ధముగా యింకొక సిద్ధాంతము బయలుదేరినది. పై సిద్ధాంతములకంటె యింకా కొంచెము శాస్త్రీయముగా నుండి, యువకులకు, ఉద్రేకులకు చాల ఆకర్షణీయముగా నుండే సిద్ధాంతము యిది. దేవుడు లేడు, అని ఈ సిద్ధాంతుల వాదన. ఈ వాదన 18 వ శతాబ్దములో యూరపులోను, 20 వ శతాబ్దములో ఇండియా మొదలగు దేశాలలోను కొంతవరకు ప్రబలినది. ఈసిద్ధాంతము విరివిగా ప్రచారము జరుగడానికి, చదువుకున్నవారిని ఆకర్షించుటకు కారణ మున్నది. 18 వ శతాబ్దములో శాస్త్ర పరిశోధన బాల్యదశలో నుండెను. శాస్త్రకారులు వివిధ వస్తువుల స్వరూపము, గుణముల కనుగొనుటలో పరిశోధన చేయుచు నుండిరి. వారి కంటికి గాని, ఆలోచనకుగాని కన్పడని వస్తువులు లేవని వారు తలచుచుండిరి. దీనికి కారణము శాస్త్ర పరిశోధన అభివృద్ధి కాకపోవుటయే. దీని ఫలితముగా ఒక్క వస్తువు యొక్క గుణమును తీవ్రముగా పరిశోధించుట, ఒక్కొక్క శాస్త్రజ్ఞుని జీవిత మంతయు ఒక్క వస్తువు యొక్క పరిశోధనయందే గడిచిపోవుట కూడ జరిగింది. దాని మూలముగా శాస్త్రజ్ఞుల భావప్రపంచములో ఒక్క వస్తువుకున్న ప్రాముఖ్యత వస్తువునకు వస్తువునకు గల సంబంధమును తెలిసికోలేనంత గొప్పదిగా నుండెను. వస్తువులే ఇంత ప్రాముఖ్యత వహించుటచే వాటినే గొప్పవిగను(దైవభావము) వాటికి మించినవి లేవను భావముతోను, పరిగణించుచుండిరి. దీనివలన ఫలితములు రెండు. వస్తువులు ప్రాముఖ్యత నొంది, శాస్త్రజ్ఞుల పరిశోధనా ప్రపంచములో లేనివి అసలే లేవను భౌతిక వాదము మొదటి ఫలితము.

వస్తువు లన్నిటికి పరస్పరముగా గల సంబంధములను అప్పటి కింకను ఎవ్వరును పరిశోధన గావించి యుండకపోవుటచే ప్రతివిషయమునందును వారికి ఒక విధమయిన "వస్తు దృష్టి" ఏర్పడెను. ఈ దృష్టిని వారివారి పరిశోధనా విషయములలో ప్రసరించునప్పుడు మంచి ఫలితములే కల్గెను కాని, ప్రపంచము నంతటిని ఈ దృష్టితో చూచుసరికి అసందర్భములయిన ఫలితములు కల్గెను. ప్రపంచము ఒక్క వస్తువుగా కన్పించినను, నిజముగా నది వివిధ రకములగు వస్తువుల కలయిక. మార్పు మూలముగా రూపము నొందిన దగుట వలన ఈ "వస్తు దృష్టి" లోని పొరపాటు బయటపడెను. ఉదాహరణముగా:—నూరు గజముల దూరము నుండి ఒక తేనె కుట్టెను చూచిన ఒక గుండ్రని బంతి లాగ కన్పడును. కాని దగ్గరకు వచ్చి చూచిన కొన్ని వేల ఈగలు ఆగకుండ నడుచుచుండుటచే ఈరూపము కల్గినదని చెప్పవచ్చును. సంపూర్ణ శాస్త్ర పరిశోధన కాని 18 వ శతాబ్దములో, ప్రపంచమును కూడ యీ మోస్తరుగనే శాస్త్రజ్ఞులు చూచిరనవచ్చును. కాని 19 వ శతాబ్దమునాటికి శాస్త్ర పరిశోధన ఎక్కువగుటచే తేనెకుట్టె దగ్గిరగా మనను తీసుకువచ్చినా రనవచ్చును.

శాస్త్ర పరిశోధనా ఫలితముగా ప్రపంచము గురించి చాల విషయాలు తెలుసుకున్నారు. ఈవిషయాలన్నిటిని ఆమూలాగ్రం చదివినట్లయితే ప్రతి మానవునియందు గొప్ప మార్పు రాక తప్పదు. శాస్త్ర పరిశోధనలవల్ల తేలిన అంశములు చాల ఉన్నవి.

మొదటి విషయము:

ప్రపంచములో వివిధ వస్తువులని పైకి కన్పడుచే కాని అన్ని వస్తువులుకూడ ఒక్క స్వరూపము యొక్క రూపములే. పైవాక్యము చాల వేదాంతార్థమును కూడు కొనినట్లు కన్పడవచ్చును, గాని నిజముగా చాల సులభముగా నర్థమవునది. చాల కాలము క్రిందట మనవారు రాతిని రాతిని కొట్టిన నిప్పు వచ్చునని కనుగొన్న మాట అందరికి తెలిసినదే. రైలు పరుగెత్తునప్పుడుగాని, చేతులు చేతులు చాలసేపు రాసుకున్నగాని వెచ్చనవుతయి. ఈ వెచ్చదనము ఎక్కడనుంచి వస్తుంది? మనము రెండు మైళ్లు నడిస్తే అలసిపోతాము, మనకు కొంత శక్తి ఖర్చు అవుతుందన్నమాట. ఈ శక్తి మనము ఏ చిన్నపని చేసినా ఖర్చవుతుంది, కాని మనకు అలసట కలిగించే అంతటి ఖర్చు చాల శక్తి ఖర్చు ఐతే తప్ప జరగదు. ఈ శక్తిని గనుక నడక ఉపయోగించకుండ, మన కాళ్ళు ఒక చోటనే నేలకు రాస్తే వేడిగా అవుతయి. శాస్త్రము కనిపెట్టినది ఏమిటంటే, ఖర్చయిన శక్తియే వేడిమి అని ఈ మోస్తరుగా వెల్తురు విద్యుచ్ఛక్తి మొదలయినవన్నికూడ శక్తి స్వరూపంలే.

పై పరిశోధనతోపాటు యింకొకటి కూడ కనిపెట్టినారు. ఒక వస్తువు తీసికొని విభజించుచూ పోయిన మొదల, చివరకు అణువు మిగులును. ఈ అణువును బద్ధలుచేయుట సులభ సాధ్యముకాదు. కాని ఆ పని కూడ జరిగింది. అణువును బ్రద్దలు కొడితే మిగిలేది విద్యుచ్ఛక్తి. ఈ విషయమువల్ల ఎంత గొప్ప మార్పు జరుగునో చూడండి. శక్తి అనునది విద్యుచ్ఛక్తి. వేడిమి, వెల్తురు, విద్యుచ్ఛక్తియొక్క రూపమే వస్తువులు. కనుక ప్రపంచమంతయు శక్తియొక్క వివిధ రూపములన్నమాట! అంటే మానవులు, జంతువులు మిగతా-ప్రపంచము అన్నియు ఈ శక్తియొక్క రూపములే.

ఈ శక్తియొక్క గుణములేమిటి?

కాలు నేలకు వేసి రాస్తే వేడిమి కల్గుతుందనే, కనుక వేడిమి, శక్తి అనునవి ఒక్కటియే అని నిరూపించాము. యిప్పుడు ఈ శక్తి అంటే 'గతి' అని తేలింది. దానికి ఉన్న గుణములు 2 మాత్రమే.

(1) యింకొకరి సహాయము లేకుండా స్వతంతట తాను నడచుట.

(2) ఈ నడకలో వివిధ స్వరూపములు దాల్చుట.

దీనివల్ల మన సిద్ధాంతాల్లో కలిగే మార్పు ఏమిటి?

(1) మన ప్రపంచమునకు బాహ్యంగా వేరొక శక్తిగాని, పదార్థముగాని లేదనియు.

(2) ప్రతి ఒక పదార్థమునకుగాని, లేక ఒకే విధములయిన పదార్థములకుగాని ఒక్కొక్క రకమయిన 'నడకలు' (Laws) ఉంటవనియు తేలినది.

యిందుకు మొదటి భావము భౌతిక వాదమునకు మూల సూత్రము,

యిందుకు రెండవది 'గతి తర్కము'అను భావమునకు మూల సూత్రము.

నిర్మాణ సమస్యలు

మన మంతా కాంగ్రెసులోను, రైతుల్లోను, కార్మికుల్లోను పనిచేస్తున్నాం. ప్రజాసామాన్యానికి రాజకీయాలు బోధ చేస్తున్నాం, కాన్ఫరెన్సుల మీద కాన్ఫరెన్సులు జరుపుతున్నాం. కాని ప్రజలలోని రాజకీయ చైతన్యాన్ని గ్రహించి మన పనిని గురించిన సరియైనరిపోర్టులు వ్రాయగలిగినవారు చాల తక్కువ.

అంతేకాదు. మన కృషి సఫలీకృతం కావాలంటే మనలో కూడా చక్కని శాస్త్రీయ పరిజ్ఞానం కావాలి. దీనికి అధ్యయన తరగతులుండాలి.

ఇవన్నీ అలవడాలంటే ఒక్క "నిర్మాణ సమస్యలు" చదివితే చాలు,

కర్త: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య

వెల అణా, పోస్టు ఖర్చులు వేరు.

నవశక్తి కార్యాలయం,
గవర్నరుపేట, బెజవాడ.

ప్రపంచ విఖ్యాతిగన్న చైనా కమ్యూనిస్టు సైన్యం

జపాన్ సైన్యాలకు హడలెత్తించే గొరిల్లా యుద్ధపుటెత్తులు

కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు

[ఆయుధబలం తక్కువగా వున్నా ప్రజాభిమానము చూరగొని స్వాతంత్ర్యం కొరకు పోరాడే జాతీయ వీరులకు సర్వ ఆధునిక మారణ యంత్ర సమన్వితమైన విదేశ సైన్యాలను ఎదుర్కొనుటకు "గోరిల్లాయుద్ధం" చక్కని తరుణోపాయం. చైనాలో కమ్యూనిస్టు సైన్యాలు జపాను దోపిడిగాండ్రకు వ్యతిరేకంగా జరుపుచున్న యుద్ధపు విధాన మదియే. ఈ వ్యాసములో "గోరిల్లా యుద్ధపు" వివిధ యెత్తులు చర్చింపబడ్డాయి.
—సంపాదకుడు]

పూర్వపు చరిత్ర

8 వ రూట్ ఆర్మీ అంటే జపాను సేనలకు సింహస్వప్నం జపాను సేనలు ఏరోప్లేనులూ,మిషన్‌గన్‌లూ, టాంకులూ, మొదలగు ఆధునిక యుద్ధ పరికరాలతో ఎదుర్కొంటూంటే తుపాకులూ, కత్తులూ, బల్లెములూ మొదలయిన సామాన్య యుద్ధ పరికరాలతో 8 వ రూటార్మీ జపాను సేనలను హతమారుస్తోంది. జపాను సేనలనుండి ఆయుధాలు లాక్కొని రైతు కూలీలలో నుండి సైన్యాన్ని తయారు జేస్తోంది. చైనా ప్రజల విశ్వాసాన్నీ, అభిమానాన్నీ చూరగొన్నది.

చైనా జపాను యుద్ధం ఆరంభం కాకముందు ఈ 8 వ రూట్ ఆర్మీయే "రెడ్" ఆర్మీ అని పిలువబడేది. 1917 లో చాంగ్‌కైషేక్ దేశద్రోహియై చైనా ప్రజాసామాన్య రక్తాన్ని జలగలవలె పీల్చే పాశ్చాత్యసామ్రాజ్యవాదులతో కలసి, స్వాతంత్ర్యవిప్లవాన్ని సాగిస్తూన్న చైనా కమ్యూనిస్టులలో సుమారు 30 వేల మందిని చిత్రవధ జేసి బూర్జువా ప్రభుత్వాన్ని స్థాపించాడు. 8 వ రూట్ ఆర్మీకి నాయకుడైన చూటేకు 1200 మంది విప్లవ సైనికులూ, కమ్యూనిష్టు నాయకుడు మోసియాంగ్‌కు 1000 మంది కూలీ రైతులుమాత్రమే అనుయాయులు మిగిలారు, ఈ కొద్దిమందితోనే రెడ్ ఆర్మీ జన్మించింది. వీరు 1931 నాటికి 90 లక్షల జనసంఖ్య గల సోవియటు రాజ్యాన్ని 'కియాంగ్‌సీ' రాష్ట్రప్రాంతాల్లో స్థాపించగలిగారు. నెమ్మదినెమ్మదిగా ఈ సైన్యం వృద్ధి పొందింది. ఈ సోవియటు చైనాను అణచటానికై చాంగ్‌కైషేక్ ఆరుసార్లు దాడి వెడలాడు. చాంగ్‌కైషేక్ సైన్యాలు తమకన్నా అనేకరెట్లు ఉన్నా, ఆధునిక యుద్ధపరికరాలు కలిగియున్నా, ఏమాత్రం అధైర్య పడకుండా రెడ్ ఆర్మీ సోవియటుచైనాను రక్షించింది. మొదటి దాడిలో 30,000 సైనికులు గల రెడ్ ఆర్మీని 2 లక్షల చాంగ్‌కైషేక్ సైనికులు గల సైన్యం ఎదిర్కొంచినది, అయినప్పటికీ రెడ్ ఆర్మీదే జయం. 1934 లో చివరి తడవ ప్రపంచంలోకెల్ల పేరు పొందిన జర్మను సైన్యాధిపతుల యాజమాన్యం క్రింద బయలుదేరి 4 లక్షల చాంగ్‌కైషేక్ సైన్యం ఆధునిక యుద్ధపరికరాలతో సోవియట్ చైనాను అన్ని ప్రక్కలా చుట్టుముట్టింది. 1934 అక్టోబరులో రెడ్ ఆర్మీ ముట్టడినుండి తప్పించుకొని 12 రాష్ట్రాల గుండా ఎత్తైన కొండలూ అడవులలోనుండి 6000 మైళ్ళు ప్రయాణం చేసి, చైనా పశ్చిమోత్తర భాగమైన 'షెన్సీ' అనే రాష్ట్రానికి 1935 అక్టోబరునాటికి చేరుకుంది. అక్కడ సోవియటు ప్రభుత్వాన్ని మళ్ళీస్థాపించింది. దారిపొడుగునా శత్రుసైన్యాలు వెంటాడుతున్నా, శత్రువిమానాలు పైనుండి బాంబుల వర్షాన్ని కురిపిస్తున్నా, తమ ఆయుధసామగ్రిని తయారు చేసే యంత్రాలతోసహా షెన్సీకి చేరుకున్నారు. దారిలో ఆకలిబాధకూ చలిబాధకూ కొంతమంది చచ్చిపోయినా వారి స్థానాలను కూలీలు రైతులూ పూర్తి చేశారు. ఈ సాహసకృత్యాన్ని, ప్రపంచం కని విని ఎరుగని 6 వేల మైళ్ళ యాత్రను చూసి ప్రపంచమంతా నిర్ఘాంతపోయింది."2000 సంవత్సరాలకు పూర్వం'హానిబాల్' యొక్క సైన్యం ఆల్ప్సు పర్వతాలను దాటినప్పటి నుండీ ఇంతటి సాహస కృత్యాన్ని ప్రపంచం మరెన్నడూ చూసియుండలేదు" అని బూర్జువా సైన్యాధిపతులు ప్రకటించారు. ఇంతటి సాహసకృత్యం చైనా ప్రజల సహాయం వల్లనే జరిగిందని మనం మరువకూడదు.



గొరిల్లా యుద్ధంలో ఆరితేరిన కమ్యూనిస్టు, కామ్రేడ్ చూటే

8 వ రూటార్మీగా మారుట

అటు తర్వాత 1937 లో ప్రారంభించిన చైనా జపాను యుద్ధంలో ఈ రెడ్ఆర్మీ చైనా సైన్యంలో ఒక భాగమై ఉత్తర చైనాలో జపానుకు వ్యతిరేకంగా పోరాడుతోంది. అప్పుడు 8 వ రూట్ ఆర్మీ అని పేరు మార్చుకొంది. యుద్ధ విషయాల్లో బాగా ఆరితేరిన 'చూటే' అను నతడు ఈ సైన్యానికి అధిపతి. ఈ సైన్యాన్ని చూస్తే జపాను సైన్యాలకు హడలు. మామూలుగా బూర్జువా ప్రభుత్వాల సైనికులు చేసే పద్ధతుల మీద కాకుండా 8 వ రూటార్మీ క్రొత్త పద్ధతులమీద యుద్ధాన్ని చేయడమే కారణం. ఈ కొత్త రకపు పద్ధతికే గోరిల్లా యుద్ధమని పేరు.

ఈ గొరిల్లా యుద్ధంలో కత్తి, తుపాకీల సహాయంతోనే ఆధునిక యుద్ధ పరికరాలన్నీ కలిగియున్న సైన్యాలనుకూడా ఓడింపవచ్చునని 8 వ రూట్ ఆర్మీ ఋజువు చేసింది. విప్లవ సైన్యాలకు బూర్జువా సైన్యాలకు వలె ఆధునిక యుద్ధ సామగ్రి ఉండదు. అట్టి పరిస్థితులలో విప్లవ సైన్యాలకు బూర్జువా సైన్యాల నెదుర్కొనటానికి గొరిల్లా యుద్ధం తప్ప వేరే గత్యంతరం లేదు. గొరిల్లాయుద్ధంయొక్క ముఖ్య సూత్రాల్ని తెలుసుకుంటేనేగాని 8 వ రూట్ ఆర్మీ పద్ధతిని అర్థం చేసికోలేము.

గొరిల్లా యుద్ధం యొక్క ముఖ్య సూత్రాలు

(I) **Mobile warfare of independent initiative** 'మొబైల్ వార్ ఫేరు' అనగా చిన్న చిన్న ముఠాలుగా పోయి విరోధి సైన్యాన్ని దెబ్బగొట్టి, వారు మేల్కొని తమ ఆయుధాల్ని సిద్ధం చేసుకోకముందే పారిపోయి వచ్చుట. పగలూ రాత్రీ అనే విచక్షణ లేకుండా పొంచియుండి వీలైనప్పుడల్లా దెబ్బ గొట్టడం. బూర్జువా సైన్యాలు సామాన్యముగా రాత్రులయందు యుద్ధం చేయవుగనుక గొరిల్లాలకు హఠాత్తుగా మీద పడడానికి అదే మంచి సమయము. అంతేగాని, ఒకే చోటు నంటిపెట్టుకొని కూర్చుండగూడదు. ముఖ్యమైన పట్టణాలనుకూడా అంటిపెట్టుకొని యుండరాదు. గొరిల్లాలకు బూర్జువా సైన్యాలకుండే యుద్ధ సామాగ్రి లేకపోవడంచేత, బారులు దీరిగాని కందకములను త్రవ్వుకొనిగాని ప్రత్యక్ష యుద్ధమును కొనసాగించరాదు. అలా చేస్తే శత్రు సైన్యాలు గొరిల్లాలున్న ఆచోకీలను తెలుసుకొని వారిని చుట్టుముట్టి ఆధునిక యుద్ధ పరికరాలతో దూరము నుండియే నాశనం చేయగలవు. విరోధి సైన్యాలు మీదకు వచ్చినప్పుడు వెనుకకు తగ్గడం, విరోధి సైన్యాలు విశ్రాంతి తీసుకుంటున్నపుడు వారిని ఎదుర్కొని విసిగించడం: విరోధి యుద్ధానికి సిద్ధంగా లేనపుడు దాడి సల్పడం, విరోధి పోతున్నపుడు వెంబడించడం గొరిల్లా ఎత్తుగడల ముఖ్య సూత్రాలు.

మామూలుగా బూర్జువా ప్రభుత్వాల సైన్యాలు 'పొజిషనల్ వారుఫేరు' (Positional warfare) పద్ధతిని అవలంబిస్తాయి. పొజిషనల్ వారుఫేరనగా దాడిలో బారులుగా దీరి ప్రత్యక్షంగా ఎదుర్కొనడం, కందకాలు త్రవ్వుకొని వాటిలోవుండి శత్రువు నెదుర్కొనడం, ముఖ్య పట్టణాల్ని అంటిపెట్టుకొని పోరాడటం. బూర్జువా సైన్యాలు ఫిరంగులూ, టాంకులూ, మొదలగు బరువయిన ఆయుధ సామగ్రి కల్గియుండటంవల్ల నెమ్మదిగా కదుల్తాయి. ఇటువంటి ఆధునిక సామగ్రియున్న సైన్యాలను గొరిల్లా సైన్యాలు ఎలా జయిస్తవనే సందేహం కలుగవచ్చు. టాంకులూ ఫిరంగులూ కదల్చడానికీ సరియైన పొజిషన్‌లో పెట్టడానికీ చాలా టైం పడుతుంది. ఈ లోపుగా గొరిల్లాలు దెబ్బ కొట్టవచ్చు; పారిపోనూవచ్చు. ఈ యుద్ధంలో

ప్రతి సైనికుడూ, బూర్జువా సైనికుల్లాగా కాకుండా, తన తెలివితేటలను (Intiative) బాగుగా ఉపయోగించి యుద్ధం చెయ్యాలి. ఈ పై జెప్పిన సూత్రాలకు ఉదాహరణగా 8 వ రూటుఆర్మీయొక్క ఒక దాడిని క్రింద పొందుపరుస్తున్నాను. "ఒకనాడు 8 వ రూట్ ఆర్మీకి చెందిన 4 గురు గొరిల్లా సైనికులు గుర్రాలమీద పోవుచుండగా జపాను సైనికుల లారీలను చూశారు. వారు నల్గురూ త్వరగా స్వారిచేసి, ఒకడ్ని గుర్రాలమీద కాపలాయుంచి పక్కనున్న దిబ్బల చాటున దాకున్నారు. లారీలు తమ దాపుకు రాగానే ఒక్కొక్కరు నాలుగు 'హేండ్ గ్రెనేడ్స్'ను లారీలలోనికి విగిరి పారిపోయారు. లారీలు ఆగేటప్పటికి వారు చాలా దూరం పోయారు. తరువాత గొరిల్లా గూఢచారులవల్ల దాదాపు 45 మంది జపాను సైనికులు చనిపోయినట్లు తెలిసింది." ఈ విధంగా కొద్దిమంది గొరిల్లాలు చాలమంది విరోధులను తేలికగా ఎదుర్కొనవచ్చును.

(II) Fighting on flanks and rear of the enemy, attacking of Communications.

విరోధి సైన్యాల ముందుభాగమందు పోరాటానికి కొద్దిమందిని వదలి, వెనుకభాగమందు ప్రక్కలందునూ పోరాడటానికి ఎక్కువ సైన్యాన్ని గొరిల్లా లుపయోగించవలెను. వెనుకవైపున దాడి సల్పి వారి తిండిబండారములను ఆయుధ సామగ్రిని దోచుకొనవలెను. ఈవిధముగా రెడ్ ఆర్మీ వెనుక చాంగ్‌కై షేకు సైన్యాలతో పోరాడినపుడే తనకు వలసిన ఆయుధ సామగ్రి నంతా సంపాదించుకుంది. ఇప్పుడదేవిధంగా జపాను సేనల నుండికూడా తిండిబండారాల్ని ఆయుధసామగ్రినీ సంపాదించుకుంటోంది. ఇందువల్ల సప్లయిలను తెచ్చు ప్రతి స్టోర్సుకూ, లారీకి, చాలామంది సైనికులు కాపలా ఉండవలసి వస్తోంది. ఈవిధంగా చాలామంది శత్రుసైనికులకు పని కల్పించవచ్చును. ఉత్తర చైనాలో 8 వ రూట్ ఆర్మీ భయంచేత ప్రతి జపాను సప్లయి లారీకూ ఒక ఇంజనీర్ల గ్రూపూ, ఒక గుర్రపుదళమూ, ఒక పటాలమూ, కొన్ని విమానలూ, రక్షకవర్గముగా ఏర్పాటు చేయబడుతున్నాయి. అప్పటికి అనేకసారులు గొరిల్లాలు సప్లయిలను కొల్లగొట్టినాయి. అందుచేత కొన్ని సమయాల్లో యుద్ధ సామగ్రి విమానాల ద్వారా తెప్పించుకోవల్సి వచ్చింది. జపాను సేనలు మాంసం మొదలయిన మంచి ఆహారాలు లేక జొన్నకూడుకూడా తినాల్సి వచ్చింది. బూర్జువా సైన్యాలు 3, 4 రోజులు పోరాడిన తరువాత విశ్రాంతికోసం యుద్ధరంగమ్నుండి వెనుకకు పోతాయి; కొత్త సైన్యాలు యుద్ధరంగంలోనికి వస్తాయి. అప్పుడు గొరిల్లాలు విశ్రాంతి తీసుకొంటున్న సైన్యాలమీద వెనుకవైపు దాడిసల్పి వారికి అలసట గల్గించి సైర్యం పోగొట్టి యుద్ధ విముఖుల్నిగా చెయ్యాలి.

(3) విరోధి సైన్యాలు చిన్న ముఠాలుగా లభించినపుడు అమాంతంగా మీదబడి ధ్వంసం చేయుడము. జపాను సేనానాయకులు కొద్దిమంది గొరిల్లాలకే చాలమంది సైనికుల నుపయోగించుట, అవసరమని తలచి వారు కూడ గొరిల్లా పద్ధతులవలంబించిరి. కాని వారి కనుభవము లేకపోవుటవలన చిన్న చిన్న ముఠాలుగా ఏర్పడ్డ సైనికులను గొరిల్లాలు ధ్వంసంచేశారు. అంతేగాక గొరిల్లా యుద్ధం సాగించడానికి దేశీయుల సహకారం ఉండాలి; విదేశీయులు, దోపిడిగాండ్రకు అది లభ్యం కాదుగదా; అందువల్ల జపానుసేన ఈ ఎత్తులను మానివేసినవి.

అసలు సైన్యానికి రక్షక సేనలుగా ముందు పంపబడే "పెట్రోలు", "ఔట్ పోస్టులు" అను చిన్న ట్రూప్‌లను నాశనం చేయాలి. "జపాను చేతుల్లోవున్న షాంసై, నాన్‌కింగు ప్రాంతాల్లో కొత్తగా 4వ రూట్ ఆర్మీ అనే గొరిల్లాదళము ఏర్పడింది. ఇదిగూడా 8 వ రూట్ ఆర్మీ కమేండర్లుచేతనే నడుపబడు చున్నది. 14 అగస్టు 1938 వ తేదీన 300 మంది గొరిల్లాలు షాంషే విమానాశ్రయమును మెషీన్ గన్‌లతో ముట్టడించి, అక్కడున్న చిన్న సైనికదళాన్ని చంపి, చైనా జండాలను పాతి, సైన్యాలు వచ్చేలోగా ఉడాయించారు. ఆ ప్రాంతాలలోనే యిట్టి సాహసకృత్యాలు గొరిల్లాలు చాలా గావించారు."

(4) శత్రువులు ఒక చోటికి బయలుదేరి వెళ్తున్నప్పుడు వారిని హఠాత్తుగా ఎదుర్కొనడం చాల ఉపయోగ కరం. దీనివల్ల గాభరాపడి శత్రు సైన్యము చెదరిపోతుంది. వాళ్ల యుద్ధం చేయడానికాయుత్తులై యుండరు. అప్పుడు గొరిల్లాలకు చెదరిని సైన్యాలను నాశనం చెయ్యడానికి వీలుగా వుంటుంది. ఒకసారి 'జపాను సేనాని ఇమాగిషీ రెండు డివిజన్ల సైన్యంతో మార్చి చేస్తూండగా కొద్దిమంది 8 వ రూటార్మీ గొరిల్లాలు దారిపక్కనే పొంచి దాక్కొని, సగము సైన్యం దాటిపోయాక మధ్యలోనున్న సైన్యాధిపతి సామానులు, జపాను ఉద్యోగీయులు పోవుచున్న లారీలను ఎదుర్కొని దాడి చేశారు. అప్పుడు జపాను సైన్యం ఏమ్మీ తోచక చెల్లా చెదరైంది. 7 రోజులకు పైగా అక్కడే ఉండిపోవలసి వచ్చింది. కొంత నష్టంకూడా పొందినారు. అవతలవారు వెళ్ళే ప్రోగ్రాం భగ్నమైపోయింది.

(5) సామాన్యంగా ఎప్పుడూ మొబైల్ వారుఫేరు (Mobile warfare) చెయ్యాలి. ఎప్పుడైనా చాల ముఖ్యమైన స్థలాలను శత్రు సేనలనుండి కాపాడవలసి వచ్చినపుడు బారులుగా తీరి యుద్ధం చేయకూడదు. లైను పొడుగునా అక్కడక్కడా పొంచియుండి ఎదుర్కోవాలి. ఇట్లయితే తక్కువ సైన్యంతో ఎక్కువ సైన్యాన్ని ఎదుర్కోవచ్చు. ఇది గొరిల్లా ఎత్తులకు చాలా అనువైన మార్గం.

(6) చెయ్యీ చెయ్యీ గలిపి పోట్లాడటం గొరిల్లాలకు వీలైనపని. ఇట్టి పోరాటంలో ఆధునిక యుద్ధ పరికరాలే కాక తుపాకీనిగూడా ఉపయోగించే అవకాశం ఉండదు. అందువల్ల అటువంటి యుద్ధంలో ధైర్యశాలులయిన గొరిల్లాలే జయిస్తారు. ఈ రకపు యుద్ధములో కత్తీ, హేండ్ గ్రేనేడులూ ఉపయోగించాలి. 'షాంటంగు రాష్ట్రంలో లూహిసీ–యన్ అనే పట్నములో 1000 మంది 8 వ రూటార్మీకి చెందిన గొరిల్లాలు 3000 జపాను సైనికులచే ముట్టడి వేయబడ్డాయి. రాత్రి మొదలు ఉదయం 7 గం॥ వరకూ జపాను ఫిరంగులు పట్టణాన్ని ధ్వంసం చేస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ గొరిల్లాలు తమ స్థానాలను విడిచిపోలేదు. పట్నంయొక్క ఈశాన్య మూలనున్న ప్రాకారపు గోడ కూలి పోయింది. పొద్దున 7 గంటలకు జపాను సైనికులు ఫిరంగుల నాధారం చేసికొని ఆ సందునుండి పట్నంలోకి ప్రవేశించ మొదలెట్టాయి. గొరిల్లాలప్పుడు చేతులు చేతులు కలిపి పోరాడినారు. యిరుకు సందులలోనూ వంకర వీధుల్లోనూ ఒక చేత్తో జపాను సైనికుల తలల నరుకుతూ రెండవ చేత్తో హేండ్ గ్రేనేడ్సును గొరిల్లాలు విసిరారు. ఈ విధంగా 10 గంటలకు 300 మంది జపాను సైనికులు హతమయ్యారు. రెండు మెషీన్ గనులూ, చాలా తుపాకులు గొరిల్లాలకు చిక్కినాయి. ఇంతలో ఇంకా కొన్ని గొరిల్లాల ముఠాలు వచ్చి సహాయం చేసాయి. దాదాపు 12 గంటలకు ఒకసారి బుద్ధిపూర్వకంగా జపాను సైనికులను లోనికి రానిచ్చి గొరిల్లాలు మాటునుండి మీదబడి కత్తులతోనూ హేండ్ గ్రేనేడ్సుతోనూ హతమార్చాయి. ఇంతలో జపాను సేనలకు తోడ్పాటుగా మరికొంత సైన్యం వచ్చింది. ఇంక లాభం లేదనుకొని గొరిల్లాలు 6 గంటలకు సరియైన ఆర్డరులో చీకటి నాధారం చేసికొని, వెనుకకు తగ్గినారు. 1000 మంది జపాను సైనికులు 500 మంది గొరిల్లాలు ఆ యుద్ధంలో నష్టమైపోయారు.

సరియైన గొరిల్లా పద్ధతులమీద యుద్ధం నడిపితే, 30 మంది జపాను సైనికులు చస్తే 3 గురు గొరిల్లా సైనికులు మాత్రం చచ్చిపోతారు. 1938 ఫిబ్రవరిలో 'హోయే' యుద్ధంలో జపాను సైనికులు 65 మంది, 17 మంది గొరిల్లాలూ చనిపోయారు. 17 మంది చనిపోవడంకూడ అనవసరమేనవియూ, తప్పనియూ 8 వ రూటార్మీ కమాండర్లు ఆ గొరిల్లా ముఠా నాయకుడ్ని విమర్శించారు.

(7) లేనిచోట్ల ఉన్నట్లుగ్గాను, ఉన్నచోట్ల లేనట్లుగాను శత్రు సేనలకు కనబడుతూ వారిని హఠాత్తుగా ఎదుర్కొనవలెను. ఇప్పుడు జరుగుచున్న చైనా జపాను యుద్ధంలో 8 వ రూటు ఆర్మీ గొరిల్లాలు ఒక వైపునుండి బిగిల్సు ఊదుట మొదలయిన చప్పుడులు చేసి, ఆవైపుననుండి దాడి సల్పబోవుచున్నట్లు నటించి మరొకవైపునుండి దాడి సల్పుతారు. 8 వ రూట్ ఆర్మీకి చెందిన 359 వ బ్రిగేడునకు నాయకుడు 'వాంగ్‌నెన్' ఆ బ్రిగేడుకు చెందిన గొరిల్లాలు జపాను విమానాలను ఆకర్షించడానికి ఒక కొండ సులాబి మీద గోడలు, గోతులు మొదలయిన రక్షణ సాధనాలు నిర్మించారు. జపాను విమానాలు ఇది చూచి, అక్కడ చాల గొరిల్లా సేన యున్నదనుకొని నాలుగైదురోజులు వరుసగా ఆ రక్షణ సాధనాల మీద బాంబులు వేసి, చాల ఆయుధ సామగ్రిని వృధాగా ఖర్చుపెట్టారు. కొంతమంది గొరిల్లాలు ఆ చుట్టుపట్ల ఉండి జపాను విమానాలను చూచి పారిపోతున్నట్లుగా నటించేవారు. జపాను విమానాలు చాలమంది గొరిల్లాలను నాశనం చేశామని సంతోషపడి మిగిలిన గొరిల్లాలను చుట్టుముట్టి చంపుటకు ఒకఅశ్విక దళమును ఆ కొండదగ్గరకు పంపారు. ఈవిధముగా జపాను అశ్వికదళం వస్తుందని గొరిల్లాలు అనుకొని ఆ కొండక్రింద మాటు చేసుకొని కూర్చుండిరి. జపాను అశ్వికదళం దగ్గరకు రాగానే మిషను గన్‌లతోనూ, "హాండు గ్రెనేడుల"తోనూ ఎదుర్కొని వారికి చాల నష్టం కలిగించారు.

(8) Scarched earth tactics — గొరిల్లాలు వెనుకకు పారిపోయేటప్పుడు శత్రువులకు కావలసిన వస్తువుల నన్నిటినీ వెనుకనుండి తెప్పించుకొనేటట్లు చేయవలెను. ఆ వస్తువులను తెస్తున్న లారీలను, గాడిదలను పట్టుకొనవలెను. 8 వ రూటు ఆర్మీ గొరిల్లాలు తాము పారిపోవునప్పుడు జపాను సేనలు అక్కడికి రాకపూర్వమే ఇళ్ళను, పంటలను, బావులను నాశనం చేసి, తీసుకొనిపోయి జపాను సేనలకు నిలువ నీడ, త్రాగుటకు నీళ్ళు లేకుండా చేసి పారవేస్తున్నారు. అందువలన జపాను సేనలు తమకు కావలసిన వస్తువులను, చివరకు మంచినీరుగూడా, చాల దూరమునుండి తెప్పించుకోవలసి వస్తున్నది. అప్పుడు గొరిల్లాలు సేనలకు వస్తున్న "సప్లయిలను" పట్టుకొని జపాను సేనలకు తిండి లేకుండా గూడా మాడ్చుతున్నారు. ఒకసారి వూచైషాన్ వద్ద జపాను సేనలకు సప్లయిలు మోసుకొని వచ్చుచున్న కంచర గాడిదలను పట్టుకొనుటవలన 20 లక్షల తుపాకి గుళ్ళు, 1200 కంచరగాడిదలు దొరికినవి. ఆ సప్లయిలను రక్షించుచున్న 400 మంది జపాను సైనికులు హతమార్చబడినారు.

(9) ఇంతేగాక గొరిల్లా సైన్యాల విజయంలోగల రహస్యం ఏమనగా వారు ప్రజా సామాన్యానికి సాయుధులుగా చేసి, స్థానిక రక్షణ కోసం ఉపయోగిస్తారు. బూర్జువా ప్రభుత్వ సైన్యాలు ఆ విధంగా జేయవు. కారణం ప్రజా సామాన్యాన్ని సాయుధులుగా జేస్తే బూర్జువా ప్రభుత్వాలను కూలదోస్తారని భయం. ఇదీ బూర్జువా సైన్యాలకు గొరిల్లా సైన్యాలకు ముఖ్య భేదాలలో ఒకటి. 8వ రూటు ఆర్మీ తమకు సహాయంగా జపాను సేనలకు వెనుకనుండి పోరుటకు సహాయక సైన్యాలను (Partisan detachments) ను తయారు చేస్తున్నారు. జపాను సేనల అమానుష కృత్యాలను భరించలేక చాలమంది రైతులు, కూలీలు, విద్యార్థులు, చివరకు ఉపాధ్యాయులు గూడ ఈ సహాయక సేనలలో చేరుచున్నారు. ఈ సేనలు ఎల్లప్పుడు జపాను సేనల వెనుకనుండి పోరాడుతూ, సప్లయిలారీలను పట్టుకొనుట మొదలయిన పనులను చేయుచున్నారు. ఇటువంటి సహాయక సేనలను అణచుటకు జపాను సేనలు వచ్చినప్పుడు వారు మామూలుగా రైతుల వేషములలోనే ఉండి రైతులవలెనే నటించుతారు. గొరిల్లా యుద్ధానికి సహాయ సేనలు చాలా అవసరం.

(ఇంకా వుంది)

మొఖాసా రైతుల కడగండ్లు.

పొలసానిపల్లి నూజవీడు తాలూకాలోని ఒక మొఖాసా గ్రామం. నేనచ్చటి మొఖాసాదారులలో ఒకరయిన శ్రీయుః కోటగిరి పుల్లయ్యారావుగారి ఇంట్లో చదువు చెప్పటకై వెళ్ళితిని. అప్పటికి సుమారు నెల రోజులనుండి ఆ వూరియందలి రైతులకూ—మొఖాసాదార్లకూ గల తగాదాలలో రైతుల వద్దకు కూలీలెవరూ పోయి పనులు చేయకుండా ముఖాసాదార్లు నివారించుచుండిరి. పొరుగూళ్ళనుంచి వచ్చే రైతులను కూడా రాకుండా చేసిరి. శ్రీ కాత్రగడ్డ నారాయణరావు గారు (శాసనసభాసభ్యులు) ఒకనాడు ఆ వూరికి వచ్చి, బహిరంగ సభను యేర్పాటు చేయ ప్రయత్నించగా, మొఖాసాదార్లు ఆ ఊరు వెట్టితో ఇంటింటికి కబుర్లు చేసి, మీటింగుకు యెవరూ వెళ్ళకుండా చేసిరి. నారాయణ రావుగారు గత్యంతరము లేక సభను విరమించవలసి వచ్చెను. తరువాత, నాసలహాపై నారాయణరావుగారు మొఖాసాదార్లను కలుసుకొని మాట్లాడగా, కూలీల సమ్మెకు తాము కారణం కాదనియు, రైతులు కూలి ఎగబెట్టుటవల్లనే సమ్మె జరుగుచున్నదన్ని దనియు, వారితో చెప్పిరి.

ఈసంభాషణ జరిగిన కొంత కాలమునకు రైతులు ఏబదిరూపాయలిచ్చి దేవరకోట భూషయ్య అనే మాదిగను లింగాల గ్రామంనుంచి తెప్పించుకొనిరి. ఆ మాదిగను పొడుచుటకై ఉప్పర్లు (మొఖాసాదార్ల చెప్పుచేతతలో ఉండేవారు) రాగా, ఇతర మాదిగలు వారించిరి.

ఒక రోజున రైతుల యిండ్లలోనుంచి గొడ్లువచ్చి, రైతుల వాకిటిలో కడులువేయగా, అవి తీసుకొనుటకు యింటివారు వచ్చి వాకిటనున్న మొఖాసాదారుగారిని చూచి సందేహించి గోడచాటున ఉండగా, మొఖాసాదారుగారు అది గమనించియూ తమ పాలేళ్ళచే ఆ కడులు పట్టించుకొని వెళ్ళిరి. ఇట్లే, రెండు మూడు పర్యాయములు పిల్లలు పోగుచేసుకొనిన పేడను మొఖాసాదార్లు బెదరించి, పట్టించుకొని వెళ్ళిరి.

ఈ తగాదాలను గురించి విచారించుటకు ఒకనాడు నూజవీడు తహసీల్దారుగారు ఆ గ్రామం రాగా, వారితో నేను తిరిగి తగాదాలు రాకుండా పరిష్కరించవలసినదని కోరితిని. మొఖాసాదార్లు నాతో మీది యీవూరా, పల్లెయా? ముష్టి మూడు రూపాయలకు వచ్చిన మీరు కూడా మాట్లాడవలెనా? అనిరి. నేను ఆ రాత్రి వారి పిల్లలకు చదువు చెప్పటకు వెళ్ళినప్పుడు, శ్రీ సూరానేని తిరుమలరావుగారు నాతో మీరుగాని, కాత్రగడ్డ నారాయణరావుగారు కాని, యితర కాంగ్రెసువారుగాని, ఏమి చేయగలరు? ఈ తహసిల్దారుగారు ఏమి చేయగలరు? అసలు మీరు పత్రికలు ("నవశక్తి" మొదలయినవి) తెప్పించుట ఎందుకు? అవి రైతులకు వినిపించుట ఎందుకు? అని యింకా నా "డ్యూటీ"లను గురించి ఉపన్యసించిరి.

అప్పటినుండి నన్ను ఊరినుండి పంపి వేయుటకు ప్రయత్నములు జరిగెను. నేనొకరాత్రి చదువుచెప్పే సమయములో ఒక పిల్ల వానిని కొట్టితిననే కారణము కల్పించి, తమ పిల్లలకు చదువు అవసరంలేదని శ్రీ కోటగిరి పుల్లయ్యారావుగారు అనిరి. ఈ విషయము నేను శ్రీ తిరుమలరావుగారితో (నన్ను రప్పించినవారు) చెప్పగా, అది వొక సాకు అనియు, నేను రైతుల యెడల సానుభూతిని చూపుట వారికి యిష్టంలేదనియు చెప్పి, మరునాడు పిల్లలను ఏల కొట్టితివని అడిగిరి. కాని, వారి పిల్లవాడు మా యిరువురి సమక్షమున నేను కొట్టలేదని చెప్పెను.

అయినా, నేను వెళ్ళిపోవలసిన గతి తప్పినదికాదు. నాకు రావలసిన 20 రూపాయలలో 10 రూపాయలు మాత్రమే యిచ్చి, దానితో తృప్తిపడవలసినదని చెప్పిరి. నేనట్లు వీలులేదని పలుకగా, గుడివాడ వచ్చిన పిమ్మట చూచెదనని చెప్పిరి. గుడివాడ ఆనరరీ మేజస్ట్రేటు అగు శ్రీయుత సూరానేని తిరుమలరావుగారు నన్ను చదువు చెప్పుటకు రమ్మని, నెలకు 15 రూపాయల చొప్పున జీతం నిర్ణయించి, ప్రతి నెల జీతం ముందుగనే యిచ్చెదనని వాగ్దానం చేసి, రెండు నెలల 10 దినములయిన పిమ్మట 10 రూపాయలిచ్చి అతాత్తుగా నన్ను పొమ్మనడం ఏమి న్యాయం?

ఆ గ్రామంలో మొఖాసాదార్లు చేయు అన్యాయములకు దౌర్జన్యములకు మితిలేదు. ఒక రైతుకు మొఖాసాదారుగారు 500 రూపాయలు నూయి త్రవ్వించమని యిచ్చెను. అచ్చట ఎంత త్రవ్వినను నీరు పడలేదు. అందులకై 10 యకరముల మెట్ట, $3\frac{1}{2}$ యకరముల మాగాణి, 1 యకరము యిండ్ల స్థలము, అందున్న 2 యిండ్లను వశపరచుకొనిరి. ఒకరు దెబ్బది రూప్యముల నీయవలసి యుండగా, ఒక యకరం పొగాకు తోట వశపరచుకొనిరి. $1\frac{1}{2}$ యకరము స్థలమును చెరువులో కలిపివేసుకొని, దానికి బదులుగా మరొకచోట స్థలమిచ్చెదనని నమ్మించి, ఇంతవరకూ ఏమి ప్రతిఫలం ముట్టజెప్పలేదు. వేరొకచోట. రెండు మూడు యకరముల పొగాకు తోటను ముచ్చిలకాలు లేపనే కారణముతో వశపరచుకొనిరి. ఇట్టివి యింకా ఎన్నో ఉన్నవి. ఆ వూరియందు ఉప్పర్లు చాలమంది గలరు. అక్కడికి సమీపములో ఉన్న నిజాము యిలాకా మల్లవల్లి గ్రామమందు పొలములు గలవు. ఆ గ్రామ కరణమును మొఖాసాదార్లు లోబరచుకొని, ఉప్పర్లు శిస్తులు చెల్లించిననూ జమ కట్టించక, భూములను జప్తు చేయించి, వాని నన్నిటిని నామ మాత్రపు సొమ్ముకు పాటపాడి, వశపరచుకొనిరి. ఇప్పుడా ఉప్పర్లందరూ నిర్బంధపు కూలీపై, పొట్ట గడవక, అల్లో కాలక్షేపం చేయుచున్నారు.

ఆ వూర సమ్మె యిప్పటికిని (అనగా 11—1—39 నాటికి) జరుగుచున్నది. దూర్వాసుల్లు అనే ఒక చాకలి వానిని రైతులు పొరుగూరి నుంచి తెప్పించుకొనగా వాడు పారిపోయెను.

—చిట్టా శ్రీమన్నారాయణమూర్తి.

* * *

మొఖాసా రైతుల మొర

మా పుణ్యమా అంటూ "మద్రాసు వ్యవసాయక ఋణవిమోచన చట్టము" వల్ల 1346, 47 ఫసలీల శిస్తు చెల్లిస్తే పూర్వపు బకాయి అంతా రద్దవుతుందనే శాసనము వచ్చి, మా మూపుమీది భారము కొంత వరకు తగ్గించింది. ఆ ఆర్డు ప్రకారం, పోయిన సంవత్సరము 1347 వ ఫసలీ శిస్తును కట్టినాము. ప్రస్తుతపు పంటమీద ఆధారపడిన 1346,48 ఫసలీల శిస్తును చెల్లించవలసి యుంది. కాని, ఈ యేడు సంభవించిన తుపాను బీభత్సం వల్ల పై రెండు ఫసలీల శిస్తును చెల్లించాలంటే ఎంతో కష్టము. రైతు శ్రేయస్సును రవంతైనా ఆలోచించని మొఖాసాదార్లకు రెమిషన్ ఆలోచనలు ఎల్లాగూ ఉండవు. రైతు క్షేమాని కై కంకణము కట్టుకొన్న కాంగ్రెసు ప్రభుత్వమువారు మొఖాసాదార్లకు రైతులు చెల్లించవలసిన పై రెండు ఫసలీల శిస్తును రద్దు చేయించగలందులకు ప్రార్థించుచున్నాను.

(ఒక మొఖాసా రైతు)

* * *

అగ్రహారం రైతుల తగాదా

నరసరావుపేట తాలూకాలో "ముత్తనపల్లి" అగ్రహారం ఉన్నది. ఈ అగ్రహారంలో కందుల బ్రహ్మాడు అనే మాదిగ మనిషి అగ్రహారందారయిన వాసిరెడ్డి లక్ష్మీపతి గారి భూమిని 40 సంవత్సరముల నుంచి సేద్యం చేయుచున్నాడు. భూమి విస్తీర్ణం 12 ఎకరములు. 1936 వ చట్టము వచ్చిన తరువాత యితర అగ్రహారం రైతులతోగూడా అగ్రహారందారును పట్టా కొరకని నోటీసు యిచ్చినాడు. అగ్రహారందారు పొలములో అక్రమముగా ప్రవేశించి యీ సంవత్సరము అతనే పైరు వేసుకొనినాడు. నరసరావుపేట డిప్యూటీ కలెక్టరు కోర్టులో కందుల బ్రహ్మాడు వేసిన తగాదా విచారణ జరుగుచున్నది. అని శ్రీగిరిరాజు సత్యనారాయణ (జిల్లా రైతు ఆర్గనైజరు) గారు వ్రాయుచున్నారు.

* * *

కాళహస్తి తాలూకాలో క్షామ బాధ.

చిత్తూరు జిల్లా, కాళహస్తి తాలూకాలో అన్ని గ్రామములు వర్షలేమిచే పైర్లు బొత్తిగా ఎండిపోయి, పశువులకు మేత లేక, త్రాగుటకు నీరు లేక ప్రజలు అల్లాడి పోవుచున్నారు. ఇటీవల కొద్ది వర్షము వర్షించి గుంటలకు కొద్దిగా నీరు వచ్చినది కాని, అవికూడా యిప్పుడు తీవ్రమైన ఎండ వేడిమికి ఎండి పోయినవి. రైతులకు, వ్యవసాయ కూలీలకు తిండిలేక మల మల మాడుచున్నారు. ఈ పరిస్థితులను తెలియజేయుచూ జమీందారులకు ఎన్నో అర్జీలు పంపుకొన్నను, విచారణ చేయకపోగా నవంబరు మొదటి వారంలోనే శిస్తు వసూళ్ళు ప్రారంభించారు. జమీందార్ల వద్దకు రైతులు రాయబారములుకూడా వెళ్ళియున్నారు. కాని ప్రయోజనం లేకపోయినది. ఎస్టేటు ఉద్యోగులు, ముఖ్యంగా పానగల్ ఎస్టేటులో, మామూళ్ళు ఇచ్చిననే గాని తనిఖీకి రామంటున్నారు. ప్రకాశంగారి బిల్లు రాకుండా చేస్తామని బెదరించుచున్నారు. పంటలు నశించినా శిస్తులు చెల్లించితీరాలి అని నిర్బంధించుచున్నారు. ఈవిధముగా బాధపడే రైతుల, కూలీల ఆర్తనాదములను జిల్లా అధికార్లు, కాంగ్రెసు మంత్రులు అనాదరణ చేయుట మిక్కిలి వింతగా ఉన్నది. అని నూతలపాటి మునుస్వామి నాయుడు గారు వ్రాయుచున్నారు.

నెల్లూరు జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ తృతీయ వార్షిక సమావేశము.

పైపార్టీ వార్షిక సమావేశము ముందు ప్రకటించిన ప్రకారము జనవరి 29 వ తారీఖు జరుగదు. ఫిబ్రవరి 4, 5 తారీఖులలో నెల్లూరులో జిల్లాబోర్డు కాంగ్రెసు పార్టి ఆఫీసులో జరుగును. ప్రతినిధి రుసుము రు 0-2-0 లు. తీర్మానములు పంపదలచు కొన్నవారు 30 వ తారీఖులోగా పంపవలెను.

కార్యక్రమము

4-2-39 మధ్యాహ్నము 12 గం॥లకు అధ్యక్షుని ఎన్నిక, కార్యదర్శి రిపోర్టు. 3 గం॥లకు ఫలహారము. 3/30 గం॥లకు తీర్మానములు.

5-2-39 ఉదయం 7 గం॥లకు కార్యనిర్వాహక వర్గ నూతన ఎన్నికలు, రాష్ట్రపార్టీ కాన్ఫరెన్సుకు ప్రతినిధుల ఎన్నికలు, మిగతా తీర్మానములు.

బి. శంకరయ్య
కార్యదర్శి.

షరా:—4 వ తారీఖు ఉదయం 8 గం॥లకు కార్యనిర్వాహక సభ జరుగును.

* * *

గుంటూరు జిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టి కార్యనిర్వాహకవర్గ సమావేశం

గుంటూరుజిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టి కార్యనిర్వాహకవర్గ సమావేశం యీనెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు తెనాలిలో పార్టి ఆఫీసునందు జరుగును గాన కార్యనిర్వాహక సభ్యులందరు హాజరు కావలెను. ఈ నెల మూడు నాలుగు వారాలమధ్య జరుగుతుందని ప్రకటించబడిన పార్టి కాన్ఫరెన్సు పరిస్థితులు వీలుపడక ప్రస్తుతం ఆపబడినది. ఈ కార్యనిర్వాహకవర్గ సమావేశంలో జిల్లా కాంగ్రెసు కమిటీ ఎన్నికలు మొదలగు విషయాలతో పాటుగా, పార్టి వార్షిక సమావేశంయొక్క తేదీ నిర్ణయంకూడ చేయబడును.

తెనాలి 19-1-39 } పి. నరసింహమూర్తి
కార్యదర్శి
జిల్లా కాం. సో. పార్టి.

* * *

తూ. గో. జి. వ్య. కూలీ సంఘం

పై సంఘ కార్యనిర్వాహక సభ యీనెల 29 తేదీని రాజోలు తాలూకా శేషచెట్టుపాలెం నందు, కామ్రేడ్ గెద్దం మహాలక్ష్మిగారి స్వగృహమున జరుగును గాన సంఘ సభ్యులెల్లరు 29 తేదీ 10 గం॥ హాజరు కావలెనని కోరుచున్నాను.

ఇట్లు
వంటూరు శ్రీనివాసరావు
తూ. గో. జి. వ్య. కూలీ సంఘ కార్యదర్శి.

* * *

భీమవరం తాలూకా కాంగ్రెసుసంఘం

భీమవరం తాలూకా కాంగ్రెసుసంఘ కార్యనిర్వాహకవర్గ సమావేశం మహమ్మద్ ఇబ్రహీం సాహెబుగారి అధ్యక్షతను జరిగి యీ క్రింది తీర్మానములు గావింపబడినవి.

1\. గుమ్మలూడి దేవాలయ ధర్మకర్తల మీదనున్న తగాయిదాను గురించి విచారించుటకు కమిటీని ఏర్పరచుట.

2\. జమిందారీ రైతుల సౌకర్యంకొరకు పెట్టబోవు ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరుస్తూ ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారి సూచనలతోగూడ శాసనముచేయవలసినదిగా కాంగ్రెస్ ప్రభుత్వమునుగోరుచూ తీర్మానము.

గమనించండి

3\. జనవరి 26 వ తేదీని ప్రతి గ్రామ కాంగ్రెసు సంఘం స్వాతంత్ర్య దినోత్సవము జర్పి ప్రమాణపత్రములు చదివి సభలు గావించవలసినదిగా గ్రామ సంఘములను హెచ్చరించుచున్నాము.

ఇట్లు.
కృ॥ వెంకటేశ్వరరావు.
సహాయ కార్యదర్శి.

* * *

కొల్లూరు విద్యార్థి సంఘము

10-1-39 తారీకు యం. రామదాసు ఆధిపత్యం క్రింద కొల్లూరు విద్యార్థులు సమావేశమై యీ తీర్మానము లామోదించిరి.

1\. సంఘమును రిజిష్టరు చేయవలసినదిగా పాఠశాలాధికారులను కోరడమైనది.

2\. స్కూల్ వార్షికోత్సవము జరుపుటకు తీర్మానించుచు, దానికి కె. చంద్రమౌళిగార్ని అధ్యక్షులుగాను కె. సత్యనారాయణగారిని ప్రారంభోపన్యాసకులుగాను యం.వి. పున్నయ్యగారిని పతాక ప్రతిష్ఠాపకులుగాను ఎన్నుకొనడమైనది.

3\. ఆ. భా॥ వి॥ సం॥ తీర్మాన ప్రకారము జనవరి 26 తా॥ స్వాతంత్ర్య దినము జరుపుట నిశ్చయించుట

4\. కొల్లూరు విద్యార్థి సం॥ తరపున "నవశక్తి, ఆంధ్రప్రభ, Indian Express, Students Call" తెప్పించుటకు తీర్మానించుట.

5\. ఆం॥ రా॥ వి॥ సం॥ సభ ప్రతినిధుల నెన్నుకొనిరి.

6\. ఉస్మానియా, అన్నామలై, కృష్ణా మండల విద్యార్థులు తమ న్యాయమైన హక్కుల కొరకు సలుపుచున్న పోరాటానికి సానుభూతి తెలుపుచు అధికారుల కఠిన చర్యల తీవ్రముగ ఖండించడమయినది.

7\. బొంబాయి, మద్రాసు, విద్యార్థుల అవిద్యా నిర్మూలన కార్యక్రమాన్ని Adult Education training course హృదయ పూర్వకముగా అభినందించడమైనది.

ఇట్లు
పి॥ గోపాలరావు
సెక్రటరీ.

స్వాతంత్ర్య దినోత్సవం

జనవరి 26 వ తేదీ గురువారం

నేటికి తొమ్మిది సంవత్సరాలనాడు లాహోరు కాంగ్రెసుమహాసభ భారతీయుల లక్ష్యం సంపూర్ణ స్వాతంత్ర్యమని నిర్ణయించింది. నాటినుండి స్వాతంత్ర్య పోరాటము సాగుతూనే వుంది. ప్రతియేటా జనవరి 26 వ తేదీన దేశమంతా స్వాతంత్ర్య నినాదం ఎలుగెత్తి చాటుతూంది; కాని మనమింకా మన ఆదర్శానికి దూరంగానే వున్నాము అయినా కొందరు, కాంగ్రెసు మంత్రిపదవులు స్వీకరించుటతోనే స్వరాజ్యము వచ్చినట్లు ఉబ్రాశలూగుచున్నారు. భారతీయులందరూ నిరశించిన ఫెడరేషను మననెత్తిపై రుద్ద జూచుచున్న సామ్రాజ్యవాదులతో రాజీ చేసికోడానికి సూచనలొసంగబడుతున్నాయి.

కాంగ్రెసు అధ్యక్షుడు ఫెడరేషను భగ్నం గావించటానికి సర్వ సన్నాహములు చేయవలెనని హెచ్చరించుచున్నాడు బ్రిటీషు యిండియాలోని, స్వదేశ సంస్థానాలలోని ప్రజాసామాన్యమంతా తమ దైనందిన హక్కులకొరకు, పౌరసత్వ హక్కుల కొరకు పోరాటం సాగించుచున్నారు. ఈ వివిధ పోరాటాలను సమీకరణ మొనర్చి రాజకీయపోరాటంలోకి మార్చుటే నేటికర్తవ్యం.

బ్రిటీషు సామ్రాజ్యవాదులు అంతర్జాతీయ క్లిష్టపరిస్థితులలో వున్న యీ సమయాన భారతీయులు ఐక్య కంఠంతో స్వాతంత్ర్యదీక్ష పునశ్చరణచేసి, పోరాటం ముందుకు సాగించాలి. యుద్ధంలో దమ్మిడీ సొమ్ము, ఒక మనిషినీ బ్రిటనుకు యివ్వమని చాటాలి. ఫెడరేషను నాశనం గావించుతామని దీక్ష బూనాలి.

సోషలిస్టులంతా కాంగ్రెసుకమిటీలతో కలసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జయప్రదంగా జరపాలని కోరుతున్నాను.

ఇట్లు,
బెజవాడ, 22—1—39 } పుచ్చలపల్లి సుందరయ్య,
ఆం॥ కా॥ సో॥ పార్టీ కార్యదర్శి.

స్వాతంత్ర్యదినము: జనవరి 26వ తేదీ

స్వాతంత్ర్య దినము మనకొక జాతీయ పండగవంటిది. లాహోరు కాంగ్రెసు మొదట ప్రతి సంవత్సరము జనవరి 26 వ తేదీన స్వాతంత్ర్య శపథమును తీసుకొని, భారతీయులు స్వాతంత్ర్యపోరాటము మరచి పోలేదని, ముందు మరింత తీవ్రముగా పోరాటము సల్పుటకు దీక్ష వహించున్నారని ప్రపంచమునకు తెలియజేయుచున్నారు. అట్టి జనవరి 16-వ కాలేజి, స్కూళ్ళకు సెలవు యివ్వవలసినదిగా మేము విద్యాశాఖమంత్రిని కోరగా కొలది దినములలో ఆ విషయం తెలియజేస్తానన్నారు. సెలవు యివ్వక పోయినా విద్యార్థులందరు ఆదినమున విద్యాలయాలకు వెళ్ళక స్వాతంత్ర్య దిన ఉత్సవంలో పాల్గొనాలి. అఖిలభారత విద్యార్థి ఫెడరేషను గూడ స్వాతంత్ర్య దినమున అందరికి సెలవు ఇప్పించవలసినదని, అట్లు సెలవివ్వకపోయిన విద్యార్థులు సమ్మెచేసి స్వాతంత్ర్య దినోత్సవాలలో పాల్గొనవలసిందని తెలియచేసింది.

కార్యదర్శి
మద్రాసు రాష్ట్ర విద్యార్థి సంఘము
మద్రాసు

* * *

బెజవాడ విద్యార్థుల సమ్మె.

ఈనెల 10, 11 తేదీల నుంచి హిందూ మున్సిపల్ స్కూలులో సమ్మె తిరిగి ప్రారంభమైనది. విద్యార్థులు సమ్మెజేయుటానికి కారణం అధికారులు విద్యార్థుల కనీసపుకోర్కెలను నెరవేర్చకపోవటమే. విద్యార్థులు శాంతియుతంగా పట్టుదలతో సమ్మెను సాగించారు. 17-1-39 తేదీన షుమారు 10 గంటలప్పుడు జిల్లాకలెక్టరుగారు, సూపరింటెండెంటుగారు పోలీసులతో స్కూళ్ళకు వచ్చారు. మొదట మున్సిపల్‌స్కూలు వద్ద విద్యార్థుల ప్రతినిధులైన కే. ఆంజనేయులు యల్. మధుసూదనరావు, ఎ. అబ్దుల్ రహిం గార్లతోమాట్లాడి, విద్యార్థుల కోర్కెలను నెరవేరుస్తామని వాగ్దానమిచ్చారు. డిటెన్షన్ల విషయములో సాధ్యమైనంతవరకు తక్కువగా వుండేటట్లు జేస్తామని హామీయిచ్చారు. వారిహామీమీద విద్యార్థులు సమ్మెను ఆపివేసారు. తరువాత హిందూహైస్కూలువద్దకు వచ్చారు. 1¼ గంట విద్యార్థులతో వారి కోర్కెలను గురించి చర్చించారు. నూటికి 10 మార్కులు లోపుగా వచ్చిన వారిని తప్ప అందరిని పరీక్షకు పంపేటట్లు చూస్తానని వాగ్దానంజేసారు. సాయంత్రము సబ్‌కలెక్టరు ఆఫీసులో ఆలోచించుదామని చెప్పినమీదట హిందూ స్కూలులోకూడా సమ్మె ముగించారు. ఆరోజు సాయంత్రము సబ్‌కలెక్టరుగారి ఆఫీసులో హిందూస్కూలు తరపున హెడ్‌మాస్టరు, అలపాటి కుటుంబరావుగారు, వేణుగోపాలరావుగారు, ఆస్కూలు విద్యార్థుల తరపున వి. భాస్కరరావు; సి. హెచ్. బంగారురావు, పేట రామారావు, సత్యనారాయణ సింగుగార్లు వచ్చారు. ఆఫీసు వెలుపల అనేకమంది విద్యార్థులు నిలుచున్నారు. విద్యార్థులు ప్రకటించిన కనీసపు కోర్కెలను తీసుకొని చర్చ సాగించారు. ఫాక్టరీ విషయం, డిటెన్షన్ల విషయం జిల్లా కలెక్టరుగారు తేలుస్తారని మొదట నిర్ణయించారు. విద్యార్థులు నేషనల్ ఫ్రంట్, స్టూడెంటు కాల్ అడిగితే హిందూ, ఆంధ్రపత్రికలు తెప్పించాలని నిర్ణయించారు. రెండు వైపు మిషన్లు అర్డరు యిచ్చారు. నీళ్ళ విషయం అంగీకరించారు. తక్కిన కోర్కెలుకూడా వొప్పుకున్నారు.

మున్సిపల్ స్కూలులో 191 మందికి 23 నిడిటెంషను జేసారని తెలుస్తూన్నది. హిందూ స్కూలులో 130 మందికి 12 డిటెంషను చేసారు. రెండుసారులు విద్యార్థులు డిటెన్షన్ల విషయంలో సమ్మెచేసినా, ఇంత ఎక్కువ డిటెంషన్లు వున్నందున విద్యార్థులలో అసంతృప్తి ఎక్కువగా వున్నది.

గ్రంధావలోకనం

కమ్యూనిజానికే జయం

రచయిత:—అంతర్జాతీయ కమ్యూనిస్టు మహా సభా కార్యదర్శి డిమిట్రావ్. అనువాదం 'నవయుగ శాంతియా'. ప్రకాశకులు ఆదర్శ గ్రంధమండలి, ఎలమర్రు, కృష్ణా జిల్లా. 20 పేజీలు అణా.

గ్రంధకర్త 1935 లోనే, ప్రపంచ రాజకీయ రంగంలోఫాశిస్టులు అధికారంలోకి రావడంవల్ల ఎల్లా మారుతుందో వేసిన అంచనా ఎటుల సత్యమయిందో తెలిపాడు. ముందు ఫాసిస్టుల యెత్తులు ఏ రూపముగా వుంటాయో సూచనలిచ్చాడు. ప్రపంచ కష్ట జీవులు, ప్రజా స్వామిక ప్రభుత్వాలు, శాంతి కావాలని కోరే వారందరు ఫాశిస్టు దుండగీడులను ఎదుర్కొటానికి ఏమి చెయ్యాలో కార్యక్రమమిచ్చాడు. ప్రపంచ శాంతికి తన యావచ్ఛక్తిని వినియోగించుచున్న సోవియటు యూనియన్ రక్షణ శాంతి కాములందరి విధి యెటులో తెలియజేసాడు.

అనువాదం సరళంగా నడిచింది. ప్రధమంగా సోషలిస్టు సాహిత్యాన్ని ఆంధ్రలోకానికి అందించిన ఆదర్శ గ్రంధ మండలివారు, డిమిట్రావ్ వంటి వారి వ్యాసాలను చిన్న పొత్తాలుగా ప్రకటించు చున్నందులకు అభివందనీయులు.

మాలపిల్ల

రచయిత: గద్దె లింగయ్య. ప్రకాశకులు ఆదర్శ గ్రంథ మండలి, ఎలమర్రు, కృష్ణాజిల్లా. 70 పేజీలు: నాలుగణాలు.

అందమైన గెటప్‌తో చూడ ముచ్చటగా వున్న చిన్ని నవల. ఒక భూస్వామి కొడుకు చదువుకొంటూ సోషలిస్టుగా మారి, ఒక క్రిష్టియన్ కన్యను ప్రేమించి పెండ్లాడాడు. తండ్రి కోపోద్దీపితుడై పుత్రునితో సంబంధం త్రెంచుకున్నాడు. తల్లి కుమిలి కృశించి మరణించింది. యువకుడు తన కర్తవ్యాన్ని మరువక కార్మికులలో పనిచేసి వారి నాయకుడయి జైలుకేగాడు. భార్య అతడు లేని సమయంలో కార్మికోద్యమాన్ని నడిపి పతి ననుసరించింది. తండ్రి పశ్చాత్తప్తుడయి కుమారుని, కోడలిని మన్నించుతాడు. ఇదీ కథ.

కథలో పాత్రలు కవి ఉద్దేశించిన ప్రచారానికే కల్పించబడ్డాయి: కాని సంవిధానంలో సహజత్వం, జిగి లేదు. భాష సరళంగా నడుస్తోంది.

అంతా సామ్యవాదులే

రచయిత: యమ్. ఆర్. రాజు.

98 పేజీలు. వెల 0—8—0

"సర్వసాధారణముగ మానవుడు కొత్త సిద్ధాంతములన్నింటిని సమగ్రముగ తెలుసుకొంటినని, అందలి ప్రతిభావ భావములను తీసికొనిన తరువాత దానిని జీవిత మందలి సంఘటనములతో సమన్వయము చేయగలమని ఏ తప్పు మార్గమున నైనను సరే తలంచును" అన్నాడు ఏంజిల్స్. అటులే ఈ రచయిత సామ్యవాద పరిణామాన్నిగురించి పుస్తకం వ్రాయబూని, అనేక గ్రంథకర్తల అభిప్రాయాలను ల్లేఖించి, వానిని పరిస్థితులకనుగుణ్యంగా అన్వయించుకోలేక భారతదేశములోని కమ్యూనిస్టు, సోషలిస్టు ఉద్యమాలను దువ్వారబట్టాడు. వారే వ్రాసినటుల గ్రంథ పఠనము వల్లనే విషయాలు స్పష్టముగ తెలియవు. దైనందిన జీవితములందు జరుగుచున్న సంఘటనలను పరిశీలించాలి. అంతే గాదు, వానిలో లీనమై ఉక్కుముక్కలు అంటే

గాని నిజమైన మార్క్సిస్టు కాడు: కాలేడు. సోషలిజము ఒక పడక కుర్చీ భావం కాదు; అది చైతన్యం పొందిన కార్మికవర్గ దిన దిన అనుభవాల విప్లవశాస్త్రం.

గ్రంథకర్త పుస్తక ప్రారంభంలోనే "భారతదేశములో అందులోను, మన ఆంధ్ర జిల్లాలో 'నేను సామ్యవాదిని' అని చెప్పుకోటమంటే పలువురి పరిహాసాలకు పాత్రము కావటమే" అన్నారు. ఒకవేళ వారికున్న పరిచయమల్లా ధనిక వర్గాల వారితో నేమో! మగతా తగ్గాలని కర్షకులలో, కూలి హెచ్చాలని కార్మికులలో పనిచేసే సామ్యవాది తప్పకుండా భూస్వామి, యజమానులచే దూషింపబడతాడు. గాంధీజం వల్ల స్వరాజ్యం రాదంటే యిదివరకు అనుభవాల నుండి పాఠం నేర్చుకోని కాంగ్రెసు వాది హేళన చేస్తాడు. ఇందువల్ల సోషలిస్టులు సిగ్గుపడ నవసరం లేదు.

1 వ ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి మహాసభ, బెజవాడ.

శ్రీ దుర్గా కళా మందిరములో
జనవరి 28, 29 తేదీలలో శని, ఆదివారములు
అధ్యక్షులు
శ్రీ ఆచార్య రంగాగారు
యం. యల్. ఏ. (సెంట్రల్)

ఆంధ్రావనిలోని విద్యార్థి సోదర సోదరీమణులు విరివిగా విచ్చేసి మహాసభను జయప్రదముగా చేయ ప్రార్థన.

జాస్తి నారాయణరావు,
ఆహ్వాన సంఘాధ్యక్షుడు.

అటుల గాక వేదాంతులు చెప్పినట్లుల, "మానవుడు జన్మించేటపుడు ఏమైనా తెచ్చాడా! మరణించేటపుడు తనతో కట్టుకు పోతాడా" అని వైరాగ్య సూక్తులు చెబుతూ, అంతా పుట్టేటపుడు చచ్చేటపుడూ సమానముగా వున్నారనీ, అదే సామ్యవాదమనీ తమవలే అంటే పై వర్గాలవారు గౌరవం యిస్తారు. క్రింది వర్గాల వారికి చైతన్యం యింకా కల్గలేదు గాన వేదాంతి మోసాన్ని గ్రహించలేక సంతసిస్తారు. ఈ సర్వజనికామోదం సోషలిస్టులకు సిగ్గుచేటు.

వీరికి 'కాంగ్రెస్ సోషలిస్టు' అన్న మాటలు నేషనల్ సోషలిస్టు అన్న పదములను స్మృతికి తెస్తున్నాయట. సోషలిస్టులు ఖద్దరు ధరించుట వీరికి పరస్పర విరుద్ధంగా కాన్పించుతోంది. భారత దేశం బానిస తనములో ఉంది. అందుచే జాతీయత ఇచట అభివృద్ధికరమైనదే. జర్మనీ, ఇటలీ వంటి స్వతంత్ర్య దేశంలో సంకుచిత దేశాభిమానం జాతీయత అగుటచే సోషలిజానికి విరుద్ధం. బానిస దేశంలో ఒకటి రెండోదానికి సోపానం మాత్రమే. కాంగ్రెసు స్వతంత్ర్యం కోరే భారతీయుల సంస్థ. దానికి సోషలిస్టులు దూరంగా ఉండలే

లేరు. అందుచేతనే సోషలిస్టులు అర్థంలేని ఖద్దరు నియమాన్ని పాటించి ఐనా కాంగ్రెసులో ఉండి స్వాతంత్ర్య పోరాటానికి అగ్ర గాములుగా వుండాలి; వుంటున్నారు. ఇచట పారిస్ కమ్యూన్‌పై మార్క్సు యిచ్చిన అభిప్రాయాలను ఉదాహరణగా తెచ్చాడు రచయిత. మార్క్సు, కర్షకులను విప్లవ పక్షంలోకి తేజాలనందుకు, వెర్సెలీస్ (బూర్జువా ప్రభుత్వం) పైకి దాడి వెళ్ళనందుకు కమ్యూనార్డులను ఆక్షేపించాడు గాని జాతీయత మిళితం చేసినందుకుగాదు. జర్మనీ సైన్యాలకు బూర్జువా లొంగినపుడు, కమ్యూన్ స్వాతంత్ర్యం కొరకు నిలబడుటచే అచట జాతీయత సంకుచిత దృష్టికాదు. అటులే నేడు చైనాలో కమ్యూనిస్టులు జపానుకు వ్యతిరేకంగా జాతీయ పోరాటంలో అగ్రగాములుగా వుంటున్నారు. భారత దేశంలో సోషలిస్టుల కర్తవ్యం అదే.

ఇటులే రచయిత సిద్ధాంతాలను అనేక చోట్ల పరిస్థితులకు అన్వయించలేక అపార్థాలు కల్పించాడు. స్థలాభావంచే అవన్నీ యిచట చర్చించము. "అంతా సామ్యవాదులే" చదివితే తెలియని వారికి భారత సోషలిస్టు ఉద్యమంపై లేనిపోని అనుమానాలు, ధనిక వర్గము వారికి మన శత్రువుల్ని బాగా తిట్టాడురా! అనే సంతోషము కల్గుతుంది. గ్రంధకర్త అటుల ఉద్దేశించినా, లేకపోయినా మార్క్సిస్టు ననుకొనే గ్రంధకర్త అంత మాత్రం తెలిసికోపోవడం విచారం.

వెలుగులు

కథల పుస్తకం. పబ్లిషరు:—స్వర్ణయుగ పరిషత్, మచిలీపట్నం. 70 పేజీలు.

ఇందు వివిధ కవులు వ్రాసిన కథలున్నాయి. అన్నీ సంఘంలో కష్టాలనుభవించే వారి యెడల సానుభూతి సంస్కార అభిలాష కనబరచే కథలు. అభివృద్ధి కరమైన భావాలు వ్యక్తపరచే కథలు. కాని డాక్టరు శేషగిరిరావుగారి "అనాధ" కథ తప్ప తక్కిన కథలలో జిగిలేదు: అతి సామాన్యంగా ఉన్నాయి. కథకులు తమ చక్కని భావాలను ప్రచారం చేయడానికి తగిన కథా వస్తువును తయారు చేసికోవాలి. అట్టి ప్రయత్నాలకు తొలిమెట్టుగా ఇవి వెలుగులే.

ప్రాథమిక సత్వములు

రచయిత: సురవరము ప్రతాపరెడ్డి బి.ఏ.బి.యల్. 50 పేజీలు ఐదు అణాలు. పబ్లిషర్సు: దేశోద్ధారక గ్రంథమాల, 2344, ఇమాంబావీధి, సికింద్రాబాదు.

స్వాతంత్ర్య హక్కులకై అనేక పోరాటాలు జరిగాయి. వాని ఫలితంగా మానవుడు పౌరసత్వహక్కులు సంపాదించాడు. ఈ పుస్తకంలో క్లుప్తంగా పైచరిత్ర సింహావలోకన ముంది. వివిధ దేశాలలో నేడు ప్రజలనుభవించుచున్న ప్రాథమిక హక్కులు తెలియజేయబడ్డాయి. హైదరాబాదు రాష్ట్రంలో ప్రజలకు పౌరసత్వ హక్కులు నామ మాత్రముగా నయినా లేవు వాక్స్వాతంత్ర్యము శూన్యం; సభలు పెట్టుకోవడము మగ్దూర్, విద్య, ఆరోగ్య ఏర్పాటులు ప్రజల కందుబాటులో లేవు. ఇచట ప్రజా పోరాటం అవసరం ఎంత కలదో యీ పుస్తకం చదివితే స్పష్టమవుతుంది. అందరూ ముఖ్యంగా నైజాం ప్రజలు చదవాలసిన పొత్తము.

—మ. చం.

రాంపూరు సంస్థాన చరిత్ర

రాంపూరు, పూరీ జిల్లాలో ఒక చిన్న సంస్థానము. వైశాల్యం 203 చదరపుమైళ్లు. జనసంఖ్య 47,000. ఆదాయం రు 70,000 లు.

సంస్థానప్రభువుల నిరంకుశత్వం సామాన్యప్రజల వైయక్తిక జీవితాన్నికూడా సుఖంగా సాగనివ్వడంలేదు. ప్రజలు తమ ఇబ్బందులను గురించి ప్రభువులతోను, పొలిటికల్ ఏజెంటు బజల్‌గెట్టితోను అనేక పర్యాయాలు మొరబెట్టుకున్నారు. కాని ఆనిరంకుశ బధిరమూర్తులకివి యేమీ వినబడలేదు.

వీరి కష్టాలను గురించి విచారించడానికి, ఒరిస్సా సంస్థానాల ప్రజాసంఘం ఒక కమిటీని నియమించింది. 1938 జూన్ నెలలో ఆకమిటీ ముందు, సుమారు వందమంది సంస్థాన ప్రజలు సాక్ష్యాలిచ్చారు. ఆసాక్ష్యాలవల్ల బైటపడిన సంస్థాన వ్యవహారాలు చూస్తే ఈనెల 5 వ తేదీని రాంపూరులో జరిగిన తిరుగుబాటులో, పత్రికలు గోల చేసినంత వైపరీత్యం ఏమీ కనబడదు.

విచిత్రమైన పన్నులు.

రాంపూరు సంస్థానంలో ఎవరూకూడా తమ గుమ్మాలకి రెండేసి తలుపులు అమర్చుకోకూడదు. పరిశుభ్రమైన బట్టలు కట్టుకొని నీటుగా కనబడకూడదు. బాగుగా అలంకరించుకుని ఎవరూ వీధిలోకి రాకూడదు. ఎవరో డబ్బుగల కుటుంబాలుతప్ప మిగిలిన ప్రజలెవరు, సంస్థాన ప్రభుత్వ అంగీకారము లేకుండా పెళ్లికి పల్లకీ ఉపయోగించ కూడదు. పెళ్ళిచేసుకుంటే మొగపెళ్ళివారొక రూపాయి, ఆడపెళ్ళి వారొక రూపాయి పన్నుకట్టాలి. లేకపోతే పెళ్లే చేసుకోకూడదు. ఖర్మంజాలక ఎవరైనా పల్లకీ ఉపయోగించాలని సరదాపడితే రు 15 లు ముటుపు చెల్లించాలి; అద్దైనా పల్లకీకి ఇచ్చుకునే అద్దెకాక. ఈమధ్య యువరాజాగారికి ఉపనయనం జరిగిందనీ, రాజాగారి తల్లి చనిపోయిందనీ, రూపాయకు నాలుగణాలు అదనపు పన్ను వసూలుచేశారు. ఒరియా సంవత్సరాదిక్కి పన్ను వసూలు చేసేవాళ్ళు రాజాగారికి నజరానా చెల్లించాలట అందుకని ప్రతి ఇంటివద్ద నుండి అర్ధణా చొప్పున వసూలుచేశారు.

వెట్టి చాకిరీ

అన్నిటికన్న ఆ సంస్థానంలో ప్రజలకు ఎక్కువ బాధగా వుండేది వెట్టి చాకిరీ, బీద రైతులు సంవత్సరంలో కనీసం అయిదు నెలలైనా వెట్టిచేయాలసివస్తుంది. ఈ వెట్టిలో 27 రకాలున్నాయట. ఏదైనా పర్వదినం వస్తే దేవుడు పేరుతో అధికారులకు చాకిరీ చెయ్యడం కులాసాకోసం సంస్థానాధీశుని తాలూకు ఎవరైనా వేటకు వెళ్ళితే వారికే అపాయం రాకుండా ఎన్నాళ్ళు ఆవేట సాగితే అన్నాళ్ళు కాపలాకాయడం, ఈ వేటస్థలంకు చుట్టూ కంచె వేసి కాపాడడం, రోడ్లు మరమ్మతులు చేయడం, అధికారుల సామాన్లుమోయటం(సంస్థానం దాటి వారు ప్రయాణం చేస్తూన్నాసరే.) రాజుగారు ఎవరికి కట్టిపెట్టమంటే వారికల్లా ఇష్ట కట్టిపెట్టడం మొదలైనపనులన్నీ చేయడం ఈ వెట్టిచాకిరీ అంతా చేసిపెట్టినందుకు రైతులకు అప్పుడప్పుడు సరిగాచేయలేదని, రాలేదని జరిమానాలు విధింపబడుతూంటాయి. వ్యవసాయపు అదను రోజుల్లో ఎవరైనా యీ వెట్టి చేయడానికి రాలేకపోతే వారికి దెబ్బలు ప్రసాదించడం కద్దు. ఈజరిమానాలు తీసుకున్నట్టు రశీదులివ్వడంగాని, ఇచ్చినట్లుగా వీరిచేత రిజిష్టరులో సంతకం చేయించుకోవడం గాని వేలుముద్రలు వేయించుకోడంగాని అలవాటులేదు. ఇవి గాకుండా పొలిటికల్‌ఏజెంటు క్యాంపువేస్తే వారికి పాలు, వెన్న, పెరుగుకోసం 50, 60 ఆవులను వారికి తోలిపెట్టాలి. వారికి కావలసిన కోళ్ళు, మేకలుకూడ సప్లయి చెయ్యాలి.

న్యాయం

రాంపూరు సంస్థానంలో అన్యాయం 'న్యాయం' గా చెలామణి అవుతోంది, ప్రభువులవారేమంటే అదే 'లా', ఏదిచేస్తే అదే న్యాయం. ఇకవాటికి తిరుగులేదు. 15 సంవత్సరాలక్రితం, రైతులు కావలసిన కలప కంప అడవినుంచి వూరికినే తెచ్చుకునే వారు ఇప్పుడల్లా వీలులేదు. బండి 1కి 12 అణాలు మొదలు 14 అణాలవరకు పుల్లరి చెల్లించాలి. ఈ మధ్య పత్రికల్లో ప్రచురింపబడ్డాయిట. అందుకని పత్రికకు వ్రాశాడనే అనుమానంమీద ఒకనిని పట్టుకుని నానా హింసలు పెట్టారట. ఇంతకీ అతదేమీ ఎరుగడు తరువాత ఒకరైతు ఒకకేసులో కోర్టువారుచెప్పిన జడ్జిమెంటు కాపీఒకటి కావాలని పిటీషను పెట్టుకున్నాడట; అందుకని అతనిని జైలులోపెట్టారు. ఈ విషయం పొలిటికల్ ఏజంటుతో చెప్పుకుంటే ఆయన అది తనపని కాదన్నాడు. సంస్థానంలో నలుగురు కూర్చొని మాట్లాడుకోవడమే అపరాధం అయిపోయింది.

ప్రజలలో చైతన్యము

ఈవిధమైన బాధలన్నీ 20 సంవత్సరాలు అనుభవించారు ప్రజలు. ఇకవూరుకుంటే లాభం లేదనిపించింది. ఊరూర సభలు జరిపారు. దర్బారుకు డిప్యుటేషన్ నడిపారు. కాని దర్బారువారీ ప్రజా చైతన్యాన్ని సహించలేకపోయారు. 1938 డిసెంబరు 27 వ తేదీని "సంస్థానంలోనికి వచ్చే పత్రికలను తాము ఇష్టము వచ్చినప్పుడు నిషేధిస్తా"మంటూ ఒక ప్రకటన చేశారు. మీటింగులు పెట్టుకుంటే దర్బార్ అనుజ్ఞ పొందాలన్నారు. ప్రజామండలి అక్రమసంఘ మన్నారు. ఈ ఆజ్ఞనుల్లంఘిస్తూ మీటింగులు జరగకుండానే, ఆ రోజుననే ఆయుధ పోలీసుదళాన్ని ఒకదానిని రప్పించారు. ఈనెల 4వ తేదీని ప్రజామండలి కార్యనిర్వాహకవర్గ సభ్యులు కొందరిని అరెస్టుచేశారు. 5 వ తేదీని వారిని విడుదల చేయమంటూ ప్రజలు కోటవద్దకు పోవడం, వారిపై పొలిటికల్ ఏజెంటు తుపాకి కాల్చడం, 19 మంది మరణించడం, ప్రజలు ఆగ్రహావేశంతో తిరగబడి ఏజెంటును చంపివేయడం, జరిగాయి. ఇదీ, రాంపూరు సంస్థానపు కథ.

బీహారు రైతుల సత్యాగ్రహం

నాగలి కోతేరువేసి, యదునందన శర్మ పొలంలోకి తోలుకుపోయి పది నిమిషాలు కాలేదు: సుమారు 100 నాగళ్ళతో బయలుదేరారు రైతులు. కొందరు స్త్రీలుకూడా వారి ననుసరించారు. పొలందున్ని విత్తనాలు వేయడం ప్రారంభించారు. మరునాడు బారసలీ గజ్‌తానానుండి ఆ పొలాన్నంతా 145 సెక్షను క్రింద (Attach) జప్తు చేసామని నోటీసు వచ్చింది. అయినా రైతులు తమపని మానలేదు. సుమారు 100 బీఘాల భూమిదున్ని, గోధుమలు, శనగలు, గోగులు విత్తి యండ్లకు చేరారు.

గయాజిల్లా, బారసలీ గజ్‌తానాకు చెందిన రేవరా జగదీశపుర గ్రామరైతులు, జమీందారైన రామేశ్వరప్రసాదు గారిపాలన, 40 యేండ్ల నుండి చెప్పరాని కడగండ్లు పడుతున్నారు. అచట జమీందారుకు చెల్లించాలిసిన శిస్తుకోసం రైతుల కుమార్తెలను వృద్ధులకు అమ్మడం సామాన్య విషయం. అందుచేతనే ఆప్రాంతంలో ఒడ్డులేని బాల వితంతువులు ప్రతి యింటా కాన్పించుతుంటారు. జమీందారు రమేశబాబు ఒకసారి రైతులు తమవద్దలేవని అప్పులు పంప నిరాకరించితే, తన సౌకర్యము రైతు కుమార్తెల చనుబాలు తెమ్మని ఆజ్ఞాపించాడు, ఇది కథకాదు: జరిగిన యదార్థమని బీహారు రైతు నాయకుడు యదునందన్ శర్మగారే చెప్పారు. ఇట్టి రేవరా రైతులలో చైతన్యం కలిగింది. తలెత్తి తమ చిరకాల బంధిత సంకెళ్ళను త్రెంచుటకు జమీందారుకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. ప్రభుత్వ సహాయం, కలవానికి ఎల్లవేళల తయారుగదా, పంటపండి కోతలకు సిద్ధంగావున్న వేలకొలది బీఘాల భూమిపై 145 సెక్షను ప్రయోగించబడింది. రైతులు అన్నములేక మాడుచున్నారు: పండి తయారైన చేలున్నాయి, దున్ని కష్టించిన రైతులు దాన్ని ముట్టరాదు: 'లా' కు న్యాయానికి ఎంతదూరం?

గయా పట్టణంలో బ్రహ్మాండమైన సభ జరిగింది. రేవరాగ్రామరైతుల కనికరింపదగిన యీ సంగతి మొదటిసారి ప్రపంచానికి వెల్లడిచేసాడు కిసాన్ నాయకుడు యదునందన శర్మ. ఒక విచారణ సంఘం నియమించబడింది. వారు సాక్ష్యం తీసుకొని, విచారించి జమీందారు రైతులు యిద్దరి హితంగోరి 850 బీఘాలు రైతులకు, తక్కినది జమీందారుది అని రాజీ సూచనలు చేసారు. కాని జమీందారు వినలేదు. తర్వాత జల్లాకలెక్టరు, ప్రధానమంత్రి కూడా రాజీకి ప్రయత్నించి విఫలులయ్యారు. తరువాతనే యదునందనగారి నాయకత్వాన రైతులు భూమి నాక్రమించుకున్నారు.

రేవరా రైతులపైన 107 సెక్షను జారీ చేయబడింది. రైతు వాలంటీర్లైన గంగనాధ బ్రహ్మచారి, శివశంకర్ భారతి, కెప్టెన్ గంగూలీ గార్లపై 144 సెక్షను జారీచేశారు. యదునందన్ గారిని బారసలీగజ్ వదలి వెళ్ళాలని నోటీసిచ్చారు. ఆ ప్రదేశం వీడి వెళ్ళమనియు, 144, 145 సెక్షన్లు ఉల్లంఘించరాదనియు, మరునటి దినంనుండి వరికోతలు ప్రారంభించబడతాయని రైతులు నోటీసిచ్చారు.

మరునటిరోజు కోతలు మొదలెట్టారు. కలెక్టరు, సూపరింటెండెంటు, పోలీసులు, అచటికి తయారయ్యారు. వేలకొలది స్త్రీ పురుషులు గుమిగూడారు. "మేము 144 సెక్షను ఉల్లంఘించాము. జైళ్లంటే మాకు భయంలేదు" అని వారు అరచారు.

ఈ ప్రకారంగా సత్యాగ్రహం ప్రారంభమయింది. రైతులు భూమి నాక్రమించుకొని, చెరకు కొట్టి అమ్ముతున్నారు. కూరగాయల పండించుటకు నూతులు త్రవ్వుతున్నారు. గవర్నమెంటు భాషలో శాసనాన్ని అతిక్రమిందుతున్నారు. రాజకీయభాషలో సత్యాగ్రహం చేస్తున్నారు. తుపాకులు ధరించిన గూర్ఖాలు, లాఠీ పోలీసులు ఆగ్రామంలోక్యాంపువేశారు. కవాతు చేస్తూ, హంగామాచేస్తున్నారు. అటువేలకొలది సమీప గ్రామాలరైతులు రేవరాసత్యాగ్రహంలో చేరడానికి తయ్యారవుతున్నారు.

సత్యాగ్రహ కమిటీ కార్యక్రమం సిద్ధం చేసింది. స్త్రీలు క్యాంపువేసిన పోలీసులు, గూర్ఖా సైనికులలో యీరైతుల కరుణామయ అవస్థను గమనించాలనీ, తమ వలెనే బీదలైన రైతులకు వ్యతిరేకంగా జమీందారు సేవచేయడం న్యాయం గాదని, బోధించాలని ఏర్పాటుచేయబడింది. డిశెంబరు 24 వ తేదీ యదునందన్‌శర్మ 17 మంది యితరులను 379 సెక్షను క్రింద జప్తుపోవున్న పొలంలో వరి కోసినందులకు అరెస్టు చేసారు.

ఇందులో 8 గురకు 6 నెలలు కఠినశిక్ష విధించింది ప్రభుత్వం.

ఇదంతా కాంగ్రెసు మంత్రివర్గ హయాంలోనే సుమా: గయా జిల్లా కాంగ్రెసు కమిటీపై పోరాటానికి సానుభూతి తెలిపినందులకు బీహారు రాష్ట్రకాంగ్రెసు వర్కింగు కమిటీ సంజాయిషీ అడిగింది. తీర్మానాన్ని ఉపసంహరించుకొంది జిల్లాసంఘం. మాంఘీరు జిల్లా కాంగ్రెసు 29 గురిపై రైతుల ఆందోళనలో పాల్గొన్నందుకు కాంగ్రెసు వ్యతిరేక ఆందోళనలో పాల్గొన్నారని డిసిప్లినరీ చర్య తీసికొంది. ఆర్తులకు సానుభూతి తెల్పుట వారి పోరాటంలో పాల్గొనుట కాంగ్రెసు వారి దృష్టిలోనే నేరమవడం విషాదకరం. కాంగ్రెసు మాట వినని జమీందార్లకు కాంగ్రెసు మంత్రివర్గం ప్రభుత్వ సహాయం సమకూర్చడం ఏమనాలో?

కాంగ్రెసు జయానికి కారణమైన రైతులను మరచి ఎన్నికల ప్రణాళికకు విరుద్ధంగా మంత్రులు ప్రవర్తించినా, కిసాన్‌సభ అద్భుతమైన నెరవేర్పు చున్నందులకు అభినందించాలి. ఇంతవరకు ప్రభుత్వం కిసాన్ సంఘ వర్కర్లనే అరెస్టు చేసింది. వరి చెరకు పంటలను తీసుకుపోయిన రైతులపై చర్య తీసికోలేదు.

ఒక సవరణ

19 వ పేజీలో 15 వ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభకు బదులు పొరపాటున 1 వ అని పడినది. పాఠకులు ఈ మార్పును గమనించ గోరుచున్నాము.

—సం.

హార్బరు వర్కర్లు సమ్మె చేయవలసి వస్తుందా?

విశాఖపట్నం

హార్బరు పోర్టు వర్కర్సు యూనియన్

యూనియన్‌ను గుర్తించుట విషయమై, పోర్టు అధికార వర్గముయొక్క వైఖరి విభ్రమాశ్చర్యములను కలిగించుచున్నది. మూడు సంవత్సరాల క్రితం పోర్టు అధికారులు యూనియన్‌ను గుర్తించుటకు కొన్ని నియమములు సంఘము పాటించునట్లు హామీ కోరిరి. వాటిలో ముఖ్యమైన షర్తు—సమ్మె చేసేముందు 14 రోజుల నోటీసు యియ్యాలని; కొన్ని పరిస్థితుల నిర్బంధం వలన మేము అ షర్తుకు అంగీకరించితిమి. మరియొక హానికరమగు షర్తు—మా సభ్యత్వపు లీస్టు అధికారులు చూచుటకు మేము అంగీకరించాలని, యూనియన్ సభ్యత్వము నూటికి 50 వంతులు వుండాలని—సభ్యత్వపు లీస్టు చూపటము సంఘమునకే ముప్పు వాటిలును కనుక, మేము దానికి అంగీకరించలేదు. మూడు సంవత్సరముల వుత్తర ప్రత్యుత్తరములు జరిగిన తరువాత, రిజిస్ట్రార్ అఫ్ ట్రేడు యూనియన్సు మా లీస్టును, యజమానుల హాజరు పట్టీతో సరిపోల్చి చూచుటకు మేము అంగీకరించి ఒడంబడికకు వచ్చితిమి. కాని, యజమానులు ఈ ఒడంబడికను తృణీకరించి, తామే లీస్టు చూడాలని పట్టుదల చూపుతున్నారు. యూనియన్‌కు వ్యతిరేకముగా ప్రచారము చేయుచూ, యూనియన్ పునాదినే పెరికివేయుటకు యజమానులు పట్టుపట్టినట్లగుపడుచున్నది. అందువలన మా కడపటి సాధనమును వుపయోగించుట తప్ప మాకు వేరే గత్యంతరములేదు. మేము ఈ చర్య తీసుకొనక పూర్వము మంత్రి వర్గముమీద ఒత్తిడి తీసుకొని వచ్చుటకు ప్రజానీకమును కోరుచున్నాము.

ఇట్లు,

సి. పి. నాయుడు.

ఉపాధ్యక్షుడు.

బందరు

స్టీమరు 'లోడింగు' కార్మికుల కష్టాలు.

బందరు రేవులోని 'లూయి' కంపెని స్టీమర్లలోని లోడింగు పని కంట్రాక్టు పద్ధతిమీద 15 గ్యాంగుల కార్మికులచేత చేయించుచున్నారు. వీరికి భోజనముపెట్టి పగలు పని చేసినందులకు 12 అణాలు రాత్రి పూట పనికి గంటకు అణా చొప్పున కూలి యిస్తారు. పని వారి వద్దనుంచి ఇన్సూర్యెన్సుకిర్రింద, పగటి కూలీలో 0—0—9 రాత్రి కూలీలో 0—0—3, బిగపట్టెదరు. మేస్త్రీలకు యే రోజు కూలి ఆరోజు యిప్పించినందులకు అణా మామూలు యివ్వాలి, రెండు పడవలకు ఎక్కువ లోడింగు చేయవలసివస్తే, కంట్రాక్టరు ఉచితముగా కార్మికులచేత చేయిస్తాడు. కార్మికులు ఉచితముగా చేయ నిరాకరించటానికి, కంట్రాక్టరు క్రొత్త కూలీలచేత చేయించి పని అంతా యితరులకు యిస్తాడని భయపడుతున్నారు.

ఇటీవల ఒక పనివాని యడమచేతి వ్రేలు తెగిపోయినది. నష్టి కేసులలో పనివారలకు రావలసిన నష్టపరిహారం కంపెనీ గుమాస్తాలల్లో కొంతమంది ఆపనివారికి తృణమో పణమో ముట్టచెప్పి మిగిలినది వారు తాచేస్తూ వుంటారు. ఈ పనివాని విషయములో కాంగ్రెసు [illegible]

సోషలిస్టు పార్టీ సభ్యుడగు కామ్రేడు యం. రామారావుగారు శ్రద్ధవహించినారని తెలుస్తుంది.

ప్రెస్ వర్కర్సు

హిందూ ప్రెస్‌లో పనిచేయుచున్న కామ్రేడు యి. తాతయ్యగారు (యూనియన్ కార్యదర్శి) యజమాని పెట్టుచున్న ఒత్తిడిని సహించలేక, పనిచేయుట మానివేసెదనని యజమానికి నోటీసు యిచ్చారు. ప్రెస్‌లోని పనివారల మధ్యగల ఐకమత్యతను చూచి యజమాని కామ్రేడు తాతయ్యగారితో రాజీ పడిరి.

జట్కాలు తోలే కార్మికులు

జట్కా తోలువారి సంఘము తరపున కార్యదర్శి యగు టి. కె. సుబ్బారావు, యం. రామారావు కె. గంగాధరశాస్త్రి (పట్టణ కాంగ్రెస్ సంఘ కార్యదర్శి) గార్లు జట్కా తోలువారికి పన్ను తగ్గించవలసినదని, పన్ను కట్టుటకు 15 రోజులు వ్యవధి యివ్వవలసినదని కోరుటకు మునిసిపల్ కమిషనర్‌గారి వద్దకు రాయబారము వెళ్ళిరి. 15 రోజులు వాయిదా యిచ్చిరి.

20-1-39 అమావాస్య రోజున కాశీ పనివారలు, వడ్రంగి పనివారలు సమావేశమయిరి. యం. రామారావు, గంగాధరశాస్త్రిగారు పనివారల కష్టాలనుగూర్చి తెలియజేసిరి.

కార్మిక సమస్యలు

కాకినాడ

జ్యూట్ ప్రెస్ కార్మికుని మరణము

సుమారు నెలరోజుల క్రితము జ్యూట్ ప్రెస్‌లో బి. ఎల్. నారాయణగారనే కార్మికునకు ప్రమాదము జరిగి మరణించెను. కాంగ్రెసు సోషలిస్టుపార్టీ సభ్యులు శ్రద్ధ తీసుకొని, లేబరు కమీషనరుగారికి తెలియజేసిరి. త్వరలోనే నష్టపరిహారము వస్తుందని తెలుస్తున్నది.

స్టీమరు కార్మికులు

ఈమధ్య చటర్జీ అనే దుబేష్ కంపెని క్రొత్తగా కొంతమంది మేస్త్రీలను పెట్టుకొని, పాతవారిని పనిలోనుండి తొలగించిరి. పాతవారిని పెట్టుకొనవలెనని మిగిలిన మేస్త్రీలు ఆందోళన చేస్తున్నారు. క్రొత్తగా పనిలోనికి వచ్చినవారు యూనియన్‌లో చేరి, పాతవారు క్రొత్తవారు కూడ కలసి వంతులమీద పనిచేయవలెనని పాత మేస్త్రీలు కోరుతున్నారు. ఇది యూనియనులో చీలికలు కలుగచేయాలని కంపెనీవారి పన్నుగడ.

బి. ఓ. సి. కార్మికుల అప్పుల బాధ

ఈ కార్మికులకు అప్పలమ్మ అనే స్త్రీ అప్పులు యిస్తుంది. అప్పు తీసుకొనిన డబ్బు అంతా ఒకసారి యివ్వదు. అప్పు తప్పుడు రెండు మూడు సొమ్ముగా యిస్తుంది. కంపెనీ గుమాస్తాలను కట్టుకొని జీతాల సమయమందు కార్మికులను బాధిస్తూ వుంటుంది. కార్మికులు సంఘము పెట్టుకొని యిట్టి కష్టాలను పోగొట్టుకొనాలని ప్రయత్నించుచున్నారు. సంఘము యేర్పడితే బలపడిననే గాని యీ అక్రమపద్ధతి పోదు.

స్కావెంజర్ల కష్టాలు

[illegible] వీరంతా సంఘముగా ఏర్పడ్డారు. [illegible]

5 గంటలకే ఒక మైలు దూరము నడిచి మస్తరుకు పోవాలి. స్త్రీలు పసిబిడ్డలను చంకన పెట్టుకొని పోవడము చాలా కష్టముగా వుండటంవల్ల వారి కష్టమును తీర్చవలసినదని శానిటరీ ఇనస్పెక్టరువద్ద మొరపెట్టుకొనిననూ లాభము లేకపోవటమేకాక తిట్లు, తన్నులు పొందవలసి వస్తున్నది. వీరిచేత "వెట్టి"కూడ కొంతమంది మున్సిపల్ వుద్యోగస్థులు చేయించుకొనుచున్నారు. కాంగ్రెసు అధికారములో వున్న మున్సిపాలిటీలో కూడ యిటువంటివి జరగడము విచారకరము. ఈ వెట్టి, తిట్లు, తన్నులు పోవటానికి యూనియన్ చైర్మన్, కమీషనర్‌గార్ల వద్దకు రాయబారాలు నడిపి, కార్మికులచేత ప్రదర్శనాలు చేయించి, కాంగ్రెసు కమిటీ ద్వారా కూడ చైర్మన్ కమీషనర్లమీద ఒత్తిడి తేవాలి.

గుంటకల్లు

రైల్వే కార్మికులు

మాలపల్లి నరసడుగారికి (ట్రాన్‌షిప్పు కంట్రాక్టు కూలి) పని చేస్తూవుండగా దెబ్బ తగులుటచేత ఎడమచెయ్యి విరిగినది. యం. యస్. యం రైల్వే పనివారల యూనియన్, గుంటకల్లు బ్రాంచి, ఆర్గనైజరు యన్. నారాయణస్వామిగారు దెబ్బతగిలిన వానికి నష్టపరిహారం కొరకు ప్రయత్నించారు. లేబరు కమీషనరుగారు చెయ్యి విరిగిన నరసడుకు 504 రూపాయలు యిచ్చినట్లు తెలియుచున్నది.

రైల్వే ట్రాన్‌షిప్పు కూలీలంతా కలసి సంఘముగా ఏర్పడాలి. కంట్రాక్టు పద్ధతి పోయేందుకు రోజురోజు జరుగు అన్యాయాలను గూర్చి యూనియన్ ద్వారా ఆందోళన జరపాలి. తెనాలి, తాడేపల్లి, గుంటూరు, గుంతకల్లు బెజవాడ, బందరు మొదలగు పట్టణాలలో ఉండే ట్రాన్‌షిప్పు కూలీలకు సంఘములు ఏర్పాటు జేసేందుకు సోషలిస్టు పార్టీ సభ్యులు ప్రయత్నించాలి.

నిడదవోలు

యం. యస్. యమ్. రైల్వే యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. కృష్ణమూర్తి ఎం.ఎల్.ఏ. గారు రైల్వే మెన్సు ఫెడరేషను మీటింగునుంచి తిర్గి వచ్చి రైల్వే పనివారలకు శనివారం (14—1—39)సభ జరిపిరి. పనివారల కష్టాలను గూర్చి ఉపన్యసించుచూ, యూనియనును యేజెంటు గుర్తించు విషయమై మాట్లాడిరి.

రాజమండ్రి

రైల్వే యూనియన్ ప్రధాన కార్యదర్శిగారగు జి. కృష్ణమూర్తి గారి అధ్యక్షత క్రింద 14—1—39 వ తేదీ సాయంకాలం బహిరంగసభ జరిగెను. యం. పున్నారెడ్డి (యూనియన్ వైస్ ప్రెసిడెంటు) గారు కూడ మాట్లాడిరి. ప్రధాన కార్యదర్శిగారు మాట్లాడుతూ, ఇకనుంచి, ఏప్రిలు నుండి, 15 రూ॥ పై జీతము కలవారికి కూడ ప్రావిడెంటు ఫండు ఉండుననియు, రైల్వే బోర్డు యూనియన్ ను గుర్తించుటమును గూర్చి మాట్లాడిరి.

ధవళేశ్వరమ్ము పి. డబ్ల్యు. డి. పనివారలు కూడ హాజరయిరి. కంట్రాక్టుపద్ధతివలన వారికి కలుగుచున్న కష్టములనుగూర్చి ఎం. ఎల్. ఏ. గారికి తెలియచేసిరి. వారు పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటు మంత్రిగారితో ఉదయము సంప్రదించెదనని చెప్పిరి.

రైతుకూలీల తీర్మానములు

29—1—39 తేదిన కాకినాడలో జరుగ నున్న ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సాధారణ సమావేశమందు ప్రతిపాదింప బడుటకు శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారివల్ల పంపబడిన తీర్మానములు.

1. జమీందారీ విధానమును రద్దు బరుప జాలని ఏపట్టును రైతులయొక్క దుర్భర ఆర్థిక రాజకీయ దాస్య జీవన విముక్తికి సంపూర్ణ ముగ తోడ్పడ జాలదనియు జాతీయ ఆర్థిక స్థితికి క్షేమకరంగా నుండజాలదనియు యీ సంఘంవారు తీర్మానించుచున్నారు.

2. ప్రకాశం కమిటీ నివేదికలోని సిఫార్సులు రైతులకు కొంతవరకు అవుసర రక్షణ నొసగగలవిగా నున్నవని యీ సంఘంవారు అభిప్రాయపడుచు సదరు సిఫార్సులకు కారణ భూతులయిన గౌ॥ ప్రకాశంగారి కృషిని ప్రశం సించుచు వారికిని వారి కమిటీ సభ్యులకును యీ సంఘంవారు కృతజ్ఞతను వెల్లడించు చున్నారు.

3. ప్రకాశం కమిటీ నివేదిక సిఫార్సుల లాభమును రైతులు సంపూర్ణముగా పొందుటకు గాను ఆం॥ రా॥ రైతు సంఘంవారు గావించిన సూచనలను యీసంఘమువారు ఆమోదించుచు సదరు సూచనల కనుగుణ్యముగ ప్రకాశం కమిటీ నివేదిక సూచనలు ఆగష్టు మాసాంత మునకయినను ఎస్టేటు ల్యాండు రివిన్యూబిల్లు రూపమున శాసనమొనర్పబడవలయునని ప్రభు త్వమును, శాసనసభ్యులను యీ సంఘమువారు హెచ్చరించుచున్నారు.

4. ప్రభుత్వ నివేదికలోని ఈనాం రైతు లను వేరుపరచు సూచన 50 లక్షల ఈనాం రైతుల అసంతృప్తి కిహేతు వయినదని యీ సభవారు అభిప్రాయపడుచు. వారికి కూడా జమీ న్ రైతుల హక్కులు కొరవడని రీతిని శిస్తు నిర్ణయం వగయిరా సౌకర్యములు కలిగించుచు ఎస్టేటుల్యాండు రివిన్యూబిల్లుతోపాటు శాసనము చేయవలయునని యీ సంఘమువారు ప్రభుత్వ మును శాసనసభ్యులను హెచ్చరించుచున్నారు.

5. వ్యవసాయకూలీల రుణవిముక్తికి ప్రత్యేక చట్టము చేయుబడునని సంవత్సరం క్రిందటనే వాగ్దానమొనర్చియు, నేటివరకు వారి రుణములను రద్దు చేయుగల చట్టమును ప్రభుత్వము చేయనందున లక్షలకొలదిగా నున్న వ్యవసాయకూలీల అసాహాయత ఆర్థిక దాస్యం పెంపొందుచున్నందున కనీసం ఆగష్టు మాసాం తములోగా వారి రుణములను సంపూర్ణముగ రద్దుచేయుగలిగిన చట్టమును శాసనము చేయ వలయునని యీ సంఘంవారు ప్రభుత్వమును శాసనసభ్యులను హెచ్చరించుచున్నారు.

6. వ్యవసాయకూలీల ఆర్థిక పరిస్థితులను విచారించుటకు వెంటనే ఒక కమిటీని నియ మించి వారికి కనీసపు వేతనము మొదలగు వారి కనీసపు కోర్కెల సఫలతకొరకు నవం బరు మాసాంతములోగా శాసనము చేయబడ వలెనని యీ సంఘంవారు ప్రభుత్వమును, శాసనసభలను హెచ్చరించుచున్నారు.

7. జమీన్ రైతులకు మద్రాసు రుణనివా రణ చట్టములోని 17 సెక్షనులో పెట్టెంబరు ఆఖరులోగా 1246, 87 పసలీ శిస్తులు చెల్లించ నిదే బకాయి శిస్తులు, డిక్రీలు వగయిరాలు రద్దుబడవను విషమషరతు పరపతి సౌకర్య ములుకాని, పంట నష్టము బొందిన వేలకొలది పేద రైతాంగమునకు అనర్ధదాయకమై చట్ట ఉద్దేశ్యమునకు భంగము కల్గించు చున్నది. కావున వెంటనే సదరు షరతును రద్దుపరచు సవరణ బిల్లును రాబోవు శాసనసభ యందు ప్రవేశ పెట్టవలయునని యీ సంఘమువారు ప్రభుత్వమును, శాసనసభ్యులను హెచ్చరించు చున్నారు.

తిరువూరు తాలూకా రైతు మహాసభ.

పై మహాసభ తిరువూరులో 19 వ తేదీని ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షులైన కొమ్మా రెడ్డి సత్యనారయణమూర్తిగారి అధ్యక్షత క్రింద జయప్రదంగా జరిగెను. సుమారు 2000 మంది జమీన్ రైతులు సభకు వచ్చిరి. ఆహ్వాన సం ఘాధ్యక్షులైన శ్రీ వెలుగులేటి రామారావుగారు జమీందారీ విధానములో రైతుల యిక్కట్టెట్టివో వివరించారు. సభాధ్యక్షులు రైతుల కవసర మయ్యే సవరణలతో ప్రకాశంకమిటీ నివేదిక చట్టం అయేవరకు రైతులు—రైతు సంఘాలు ఆందోళన చేయవలసిందని హెచ్చరించారు. కమిటీ రిపోర్టును బలపరుస్తూ తీర్మానం ఏక గ్రీవంగా అంగీకరించ బడింది.

సత్యనారాయణమూర్తిగారి నాయకత్వమున తిరువూరు తాలూకాలయందలి 34 గ్రామాల రైతులు తహసిల్దారుగారివద్దకు రాయభారం వెళ్ళి, తమ యిబ్బందులనుగురించి, ముఖ్యంగా జమిందార్లవలన పడే బాధలను గురించి, ప్రకా శంకమిటీ రిపోర్టును బలపరచుచూ ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘంవారి సూచనలతోగూడిన బిల్లును ప్రవేశపెట్టవలసినదిగా రైతు మహా సభలో గావించబడిన తీర్మానమును, మెమోరాం డములో ఉదహరించి తహసిల్దారుగారికి అం దించిరి. ప్రభుత్వమునకు మెమోరాండమును పంపెదమని తహసిల్దారుగారు ప్రత్యుత్తరం యిచ్చిరి.

మునగాల రైతులమీద పుళ్ళీకేసులు

కలవకోవ గ్రామరైతులు. కూలీలు సురభి వీరన్న. మందపల్లి రామయ్య వగైరా 13 గురు మీదను, రైతు ప్రచారము కొరకై ఆంధ్రరాష్ట్ర రైతుసంఘము, జిల్లా సోషలిస్టుపార్టీవారిచే పం పబడిన కామ్రేడ్ మోటూరి పరంధామయ్య పైనను 143 వ సెక్షన్ క్రి. ప్రొ. కోడ్ క్రింద అనగా అక్రమసంఘములో ఉన్నందుకు, కేసులు బనాయించబడ్డాయి. ఈ నెల 12 వ తేదీని మునగాలలోను, 21 వ తేదీని జగ్గయ్య పేటలోను వాయిదావేయబడింది. కాని మేజస్ట్రే టుగారు హాజరుకానందున కేసులు తిరిగి 1 వ తేదీకి వాయిదా వేయబడ్డాయి. వీరుచేసిన నేర మేదో యింతవరకు సమన్లలోగాని, యితరత్రా గాని తెలియజేయబడలేదు.

ఒకవైపు రాష్ట్ర కాంగ్రెసు సంఘమువారు రైతులకూ—జమిందారులకు మధ్య రాజీ ప్రయ త్నాలు సాగిస్తోంటే, ప్రభుత్వోద్యోగులు యీ విధంగా రైతుల్ని రెచ్చగొట్టడంలో ఉద్దేశము ఏమై ఉంటుందో!

కారల్ లిబ్ నెక్

(11 వ పేజీ తరువాయి)

ప్రజాసామాన్యంలో లెబ్‌నెక్ అనుచరులకే ఎక్కువ పలుకుబడి ఉన్నప్పటికీ, సోవియట్లు సోషల్ డిమాక్రటిక్ పార్టీ స్వాధీ నంలో ఉన్నాయి. అయినప్పటికీ, మరొకపార్టీ ఆవశ్యకత గ్రహించి లెబ్‌నెక్ స్పార్టకస్ సమితిని కమ్యూనిస్టుగా మార్చవలెననే తీర్మా నం ప్రతిపాదించాడు. అందరూ అంగీకరించారు అప్పటినుంచీ కమ్యూనిస్టు పార్టీయొక్క బలం నానాటికీ వృద్ధిచెందింది.

కృత్రిమ దేశాభిమానుల ద్రోహబుద్ధి.

ఇప్పుడు ప్రభుత్వాధికారములో ఉన్నది సోషల్ డెమాక్రటిక్ పారీ నాయకులు. కమ్యూ నిస్టు పార్టీని, కార్మికోద్యమాన్ని ధ్వంసము చేయడమే వీరి పరమోత్కృష్టమైన ఆశయం. లెబ్‌నెక్ రష్యా ఏజంటు అని యెబర్టు ప్రభు త్వము ప్రచారం చేయసాగింది. తనపార్టీ అను చరులైన అనేకమంది సోషలిస్టుల్ని అధికా రాల్లోనుంచి తొలగించింది. కమ్యూనిస్టు పారీ మీద తీవ్రమైన నిర్బంధ విధానం ప్రారంభిం చింది.

రష్యాలో కెరన్‌స్కి ప్రభుత్వాన్ని కూల ద్రోసినట్లే జర్మనీలోకూడ యెబర్టు ప్రభుత్వాన్ని జర్మన్ కార్మికులు నాశనము గావించాలనీ, అందుకై సర్వవ్యాపిత సమ్మెను ప్రారంభించా లనీ కమ్యూనిస్టు పార్టి నిశ్చయించింది. 6-1-'19 వ తేదీని సుమారు రెండు లక్షల మంది జర్మన్ కార్మికులు, సోల్జర్లూ ఆయుధ పాణులై బెర్లిన్ నగర వీధులలో పడ్డారు. యెబర్టు ప్రభుత్వాన్ని నాశనం గావించడానికి కృతనిశ్చయులై వచ్చారు. ఇండిపెండెంటు సోషలిస్టులు (సోషల్ డెమాక్రటిక్ పార్టీనుండి వేరైవచ్చిన వారు) ఈ ప్రజాశక్తులకు నాయ కత్వం వహించలేక పోయారు. లెబ్‌నెక్, పీక్‌ల వోట్లకు వ్యతిరేకంగా వీరు ప్రభుత్వంతో రాజీకు దిగారు 6, 7, 8 తేదీలలో ప్రజలు ఈవిధంగా సరియైన నాయకత్వంలేక కాలాన్ని వృథాచేశారు. 8 వ తేదీని ప్రభుత్వము తన కున్న బలాన్నంతటిని కార్మికులమీద ప్రయో గించింది. పార్టీ కార్యనిర్వాహక వర్గముకూడా వెంటనే తిరుగుబాటు చేయాలంటూ కార్మికు లను హెచ్చరించింది.

కాని ఈ హెచ్చరిక ఆలస్యంగా వచ్చింది. యెబర్టు ప్రభుత్వం దారుణమైన హింసావిధా నానికి దిగింది. కార్మికుల స్వాధీనంలో వున్న ఫ్యాక్టరీలు, రైల్వేలు తిరిగి లాక్కుంది. అసం ఖ్యాకులైన తిరుగుబాటుదారులను తుపాకులతో కాల్చి చంపింది. జనవరి 16 వ తేదీని లెబ్‌నెక్ట నరెస్టుచేశారు. శిరస్సులోను, గుండెల్లోను అనేక గుండ్లుకాల్చి ఖూనీచేశారు. అతన్ని జైలుకు తీసుకువెడుతూంటే దారిలో తప్పించుకు పారి పోవ యత్నించాడనీ, అందువల్ల అతన్ని కాల్చ వలసివచ్చిందనీ, మరునాడు ప్రభుత్వం ప్రకటన చేసింది.

నవశక్తి

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్ధ సంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

నెలకు 20 అం॥ లోపల అంగుళానికి		రూ. 0—6—0
,, 20" అం॥ పైన	,,	0—4—0
,, 100" అం॥ పైన	,,	0—3—0
పేజీ	రు 10—0—0 లు	
½ పేజీ	6—0—0 లు	
¼ పేజీ	3—0—0 లు	

షరా:—ఈ రేట్లుపైన కమిషన్‌లు. డిస్కౌంటులు ఇవ్వబడవు. రు 0—8—0 లకు తక్కువ ప్రకటనలు తీసు కొనబడవు. నెలకగు డబ్బు ముందుగా ఇవ్వవలెను.

ప్రత్యేక చోటునకు, ప్రత్యేక రేట్లు.

* * ★

చందాదారులను చేర్పించాలి!

జనవరిలో ఈ క్రింది విధంగా చేర్పించాలని క్రొత్తగా మరో లిస్టు ఇచ్చినాం. ఈ "కోటా"ను పూర్తి అయేటట్లు పార్టీ సభ్యులు, సోషలిస్టు అభిమా నులు, ప్రజాసామాన్యము పని చేస్తారని ఆశిస్తున్నాం.

ముఖ్యంగా పార్టీసభ్యులు తీవ్రంగా పనిచేసి "కోటా" పూర్తిచేస్తారని నమ్ముతున్నాం.

	జనవరి నెల కోటా	మూడు వారాలలో చేర్పించినది.
విశాఖపట్టణం	5	3
తూ. గోదావరి	30	8
ప. గోదావరి	50	6
కృష్ణా జిల్లా	50	26
గుంటూరు	30	26
నెల్లూరు	20	6
రాయలసీమ	10	5
ఇతర స్థలాలు	5	4
	200	84

కామ్రేడ్ సుందరయ్యా విజయం.

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్య దర్శి కామ్రేడ్ సుందరయ్యగారు, ప్రత్యర్థులు యిద్దరు ఉపసంహరించుకొనుటచే, త్రిపురి కాంగ్రెసు ప్రతినిధిగా ఏకగ్రీవంగా యెన్నుకోబడ్డారు.

జమీందారీ
రైతుల హక్కులకై
పోరాడేది
నవశక్తి

నవశక్తి

కార్మిక, కర్షక
రాజ్యం
కావాలంటుంది
నవశక్తి

ఒక సంచిక చదవలేదంటే
ప్రపంచ రాజకీయాల్లో ఒక యుగం వెనుకబడి వున్నారన్నమాట!

వెంటనే

నవశక్తి

చంధాదారులుగ జేరండి.
తెలుగులో ఇటువంటి రాజకీయ వారపత్రిక లేదు

సం॥ చందా	★	విడి ప్రతి
రు 3 లు	మేనేజరు	24 పేజీలు అణా

నవశక్తి
గవర్నర్ పేట, బెజవాడ.

Published by M. Chandrasekhara Rao
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE